epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

సంపుటి: 19 | సంచిక: 84 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 9 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

## పేదల పొట్టకొట్టే యత్నం చేసిన మోడీ

పేదలపై కక్షతో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్నే మారుస్తారాగ అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించం అని అన్నారు.

**అధికారం ఉందని మోడీ ఇష్టారీతి నిర్ణయాలు**

**పంచాయితీ ఎన్నికల మాదిరే మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం**

**ఉపాధితో పేదరిక నిర్మూలనకు అడుగులు**

**కార్యకర్తలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపు**


**హైదరాబాద్, జనవరి 8:** మెజారిటీ ఉందని చట్టసభలను వినియోగించి పేదలను అణచివేస్తామంటే కుదరదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిబంధనల మార్పు ముసుగులో పథకాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ విస్తృతస్థాయి సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. అధికారం ఉందని మోదీ ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే అంగీకరించమన్నారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకోవాల్సిన సమయమిద న్నారు. ఈ పథకంతో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఇది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

మిగతా 2 లో

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు

చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు రవాణా సౌకర్యం

తెలంగాణలో విద్యా విధానంపై సీఎం రేవంత్ వివరణ



# టూరిజమే గేమ్ చేంజర్

## కేబినెట్ కీలక నిర్ణయాలు



**కృష్ణా నది ఒడ్డున మెరీనా ప్రాజెక్టుకు ఏపీ కేబినెట్ ఆమోదం**

**రూ.19,391 కోట్ల విలువైన పెట్టుబడులకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్**

**రాష్ట్రంలో 11,753 కొత్త ఉద్యోగాలు కల్పించేలా నిర్ణయం**

**ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఏర్పాటుకు అంగీకారం**

**పర్యాటకమే అసలైన గేమ్ ఛేంజర్ అన్న సీఎం చంద్రబాబు**

**అమరావతి :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు వేదికైంది. అమరావతిలోని కృష్ణా నది తీరంలో ప్రతిష్ఠాత్మక మెరీనా ప్రాజెక్టు ఏర్పాటుతో పాటు, రాష్ట్రానికి రూ. 19,391 కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించే ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. పర్యాటక రంగాన్ని రాష్ట్ర

మిగతా 5 లో

## పొదుపు సంఘాలకు నేరుగా రుణ సదుపాయం

రాష్ట్ర మహిళలు అద్భుతంగా పనిచేస్తున్నారు

సరస్ మేళాలో సీఎం చంద్రబాబు



## చెట్టును ఢీకొన్న కారు

నలుగురు విద్యార్థులు మృతి

మోకిల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

మరొకరి పరిస్థితి విషమం

.. వివరాలు 2లో



## నకిలీ ప్రభుత్వ ఉద్యోగాలతో మోసం

ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈడీ దాడులు

దాడులపై మండిపడ్డ బెంగాల్ సీఎం మమత

.. వివరాలు 4లో



జనగణనకు కేంద్ర ప్రభుత్వం

# గ్రీన్ సిగ్నల్

**కేంద్ర హోం శాఖ నోటిఫికేషన్ విడుదల**

**ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వరకు గణన పక్రియ**

దేశవ్యాప్తంగా జనగణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జనగణన తొలి దశగా ఇళ్ల గణన పక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమై.. సెప్టెంబర్ 30వ తేదీతో ఈ పక్రియ ముగియనుంది.

3



వైసీపీలా రప్పారప్పా విధానం

# మనది కాదు

ప్రజల తీర్పునకు అనుగుణంగా సేవలు అందించాలి

సమస్యలను పరిష్కరిస్తూనే.. విమర్శలను తిప్పికొట్టాలి

మంత్రులతో లోకేశ్ వెల్లడి

అమరావతి : వైసీపీలా రప్పారప్పా విధానం తమది కాదని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఆర్టీజీఎస్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. దౌర్జన్యాలు, బెదిరించడం మన పార్టీ సంస్కృతి కాదని చెప్పారు. క్యాబినెట్ భేటీకి ముందు పలువురు మంత్రులతో ఆయన మాట్లాడారు. ప్రజల తీర్పును గౌరవిస్తూ ఎంత సేవ చేశామన్నదే మన అజెండా కావాలి. అభివృద్ధి-సంక్షేమం సమన్వయంతో ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలి. వైకాపా కుట్రలను పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నేతలు సమర్థంగా తిప్పికొట్టాలి. అందరూ ఏకతాటిపైకి వచ్చి అసత్య ప్రచారాలకు దీటుగా బదులివ్వాలి. ప్రజావేదికలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి మంత్రులు బాధ్యత

మిగతా 5 లో

మహిళా మంత్రులకు కేసీఆర్

# ఆత్మీయ స్వాగతం

రివర్‌కు, రివర్ బెడ్‌కు తేడా తెలియకుండా వ్యాఖ్యలు

జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి నారాయణ





భారత్‌పై పేలనున్న

# మరో బాంబ్

ఏకంగా 500 శాతం

సుంకాల విధింపునకు రెడీ

బిల్లును సిద్ధం చేసిన అమెరికా

4



## జనగణనకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, జనవరి 8:** దేశవ్యాప్తంగా జనగణనకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జనగణన తొలి దశగా ఇళ్ల గణన పక్రియను చేపట్టనున్నారు. ఈ మేరకు కేంద్ర హోం శాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమై.. సెప్టెంబర్ 30వ తేదీతో ఈ ప్రక్రియ ముగియనుంది. దేశంలోని ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతంలో కనీసం 30 రోజులపాటు ఈ పక్రియను నిర్వహించనుంది. హౌస్ లిస్టింగ్‌లో భాగంగా అన్ని రకాల ఇళ్లు, నివాసాలు, భవనాలు, నిర్మాణాల వివరాలను సేకరించనున్నారు. దేశంలో ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణన నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 2021లో ఈ జనగణన పక్రియను నిర్వహించాల్సి ఉంది. కానీ కొవిడ్ కారణంగా.. ఈ పక్రియను వాయిదా వేశారు. తాజాగా ఈ జనన గణన పక్రియను నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. అయితే ఈ పక్రియను రెండు దశల్లో నిర్వహించేందుకు కేంద్రం ఏర్పాట్లు చేస్తోంది. తొలి దశలో ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జరగనుంది. ఇక రెండో దశలో జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది అంటే.. 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ జనాభా లెక్కలు పూర్తిగా డిజిటల్ రూపంలో చేయనుంది. ఈ జనగణనతోపాటే కులగణనను సైతం చేపట్టాలని ఇప్పటికే కేంద్రం నిర్ణయించింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో కులగణన పక్రియను చేపట్టి.. పూర్తి చేసింది. దీనిని ఆధారంగా చేసుకుని.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపడుతుందంటూ మోదీ ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ విమర్శలు సంధిస్తున్న సంగతి తెలిసిందే.

## చెట్టును ఢీకొన్న స్పోర్ట్స్ కారు

**నలుగురు విద్యార్థులు మృతి.. మోకిల వద్ద ఘోర రోడ్డు ప్రమాదం**



**రంగారెడ్డి, జనవరి 8:** రంగారెడ్డి జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి బోల్తాపడటంతో నలుగురు విద్యార్థులు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ ఇక్ఫాయి యూనివర్సిటీ విద్యార్థులు శ్రీ నిఖిల్, సూర్యతేజ, సుమిత్, రోహిత్, నక్షత్ర కలిసి కోకాపేటలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం ఓ స్నేహితుడిని డ్రాప్ చేసి తిరిగి మోకిల నుండి హైదరాబాద్ నగరానికి వస్తుండగా గురువారం తెల్లవారుజామున రంగారెడ్డి జిల్లా మోకిల పరిధిలోని మీర్జాగూడ వద్ద కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టింది.. కారు వేగం ఎక్కువగా ఉండటంతో అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. నక్షత్ర అనే యువతికి తీవ్రగాయాలయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు వెంటనే యువతిని అత్యవసర చికిత్స ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘోర ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు.

## నిలకడగా సోనియా ఆరోగ్యం

**న్యూఢిల్లీ,జనవరి 8:** కాంగ్రెస్ పార్టీ ఛైర్‌పర్సన్, సీనియర్ నేత సోనియాగాంధీ ఆరోగ్యం నిలకడగా ఉందని సర్ గంగారామ్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ అజరు స్వరూప్ గురువారం వెల్లడించారు. సోనియాగాంధీ ఢిల్లీలో గాలికాలుష్యం వల్ల శ్వాసకోశ సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం సోమవారం రాత్రి సర్ గంగారామ్ ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆమె చికిత్సకు స్పందిస్తున్నారని, కోలుకుంటున్నారని అజరు స్వరూప్ ఆమె ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని వెల్లడించారు.

## అవినీతి కేసుల్లో సుప్రీం కోర్టు కీలక తీర్పు

**హైకోర్టు ఇచ్చిన తీర్పు రద్దు**

**న్యూఢిల్లీ,జనవరి 8 :** ఆంధ్రప్రదేశ్‌లో 2016-2020 మధ్య కాలంలో ప్రభుత్వ ఉద్యోగులపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల అవినీతి కేసుల్లో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన 13 ఎఫ్‌ఐఆర్‌లను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఏపీ విభజన తర్వాత విజయవాడలోని ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్‌ను ప్రత్యేక పోలీస్ స్టేషన్‌గా అధికారికంగా నోటి÷ చేయలేదన్న టెక్నికల్ కారణంతో హైకోర్టు ఆ ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన కేసులో హైకోర్టు ఆదేశాన్ని సుప్రీంకోర్టు రద్దు చేస్తూ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై దర్యాప్తు పూర్తి చేసి ఛార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించింది. కేసులో ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, సిద్దార్థ్ అగర్వాల్ వాదనలు వినిపించారు. ఇలాంటి టెక్నికల్ కారణాలతో దేశవ్యాప్తంగా అనేక అవినీతి కేసులు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ తీర్పు మైలురాయిగా నిలుస్తుంది.

## ఏసీబీకి పట్టుబడ్డ ఎస్ఐ

**వరంగల్,జనవరి 8:** రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడుతున్నారు. గురువారం వరంగల్ కేయూసీ సబ్ ఇన్‌స్పెక్టర్ పి. శ్రీకాంత్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇటీవల ఒక కేసులో పట్టుబడ్డ వ్యక్తి తనపై వెంటనే చార్జ్‌షీట్ నమోదు చేసి పట్టుకున్న వాహనాన్ని, మొబైల్ ఫోన్‌ను తనకు అప్పగించాలని ప్రైవేట్ డ్రైవర్ ద్వారా ఎస్సైను సంప్రదించాడు. దీంతో లంచం డిమాండ్ చేయగా బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గురువారం కేయూ జంక్షన్ వద్ద రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి ప్రైవేట్ డ్రైవర్‌ను, ఎస్సైను పట్టుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వరంగల్ ఏసీబీ కోర్టు ఎదుట హాజరు పరిచారు.

# ఉపాధి పథకం రద్దు దుర్మార్గ చర్య

మొదటి పేజీ తరువాయి



2024 ఎన్నికల్లో 400 సీట్లు ఇవ్వాలని భాజపా నేతలు ప్రచారం చేశారు. అన్ని సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్నే మార్చేసేవారు. తద్వారా పేదల హక్కులను కాలరాయాలని చూశారు. కార్పొరేట్లకు దేశాన్ని అప్పగించే ప్రయత్నం చేశారు. ప్రజలను కాంగ్రెస్ అప్రమత్తం చేయడంతో భాజపా 240 సీట్ల వద్ద ఆగిపోయింది. దీంతో రాజ్యాంగాన్ని మార్చాలనే ఆలోచన వాయిదా పడింది. ఓట్లను తొలగించేందుకు ఎస్ఐఆర్ తీసుకొచ్చారు. దీని వెనక పెద్ద కుట్ర ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ పథకం వల్ల వెట్టిచాకిరి ఆగిపోయిందని, గ్రామాల నుంచి వలసలు తగ్గాయన్నారు. అలాగే పనికితగ్గ వేతనం డిమాండ్ చేసే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో 80 శాతం మంది ఈ ఉపాధి హామీపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. పథకం పేరు మార్పు వెనుక ప్రధాని మోదీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. ఎస్ఐఆర్ వెనుక పెద్ద కుట్ర ఉందని.. వీబీ జీ రామ్ జీ (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్) చట్టాన్ని వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేశామన్నారు. ఉపాధి హామీని రద్దు చేస్తే మళ్లీ వలసలు ప్రారంభ మవుతాయని హెచ్చరించారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు, అదానీ-అంబానీలకు ప్రజలను కూలీలుగా మార్చేందుకు ఉపాధి హామీని రద్దు చేస్తున్నారని విమర్శించారు. వికసిత్ భారత్ కాదు.. సంక్షోభ భారత్‌ను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. నల్ల చట్టాల విషయంలో క్షమాపణ చెప్పే వరకు వదల్లేదని.. ఇప్పుడు ఉపాధి హామీ విషయంలోనూ క్షమాపణ చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికారం ఉందని మోదీ ప్రభుత్వం ఇష్టారీతిన వ్యవహరిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తల పాత్రను ముఖ్యమంత్రి రేవంత్ కొనియాడారు. కార్యకర్తల కష్టం, త్యాగాలతోనే అధికారంలో ఉన్నామని.. వచ్చిన పదవులన్నీ కార్యకర్తలు ఇచ్చినవేనని చెప్పారు. అందుకే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతంపైగా కాంగ్రెస్ గెలిచిందని, మున్సిపల్ ఎన్నికల్లోనూ గెలవాలని ధీమా వ్యక్తం చేశారు. కష్టపడినవాడు ఎప్పుడూ నష్టపోడని తెలిపారు. కాంగ్రెస్ మంత్రులంతా కష్టపడి పైకొచ్చినవారేనని, పార్టీ అవకాశం ఇస్తే తనతోపాటు ఎవరికైనా గుర్తింపు వస్తుందని పేర్కొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతం



- చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు రవాణా సౌకర్యం
- తెలంగాణలో విద్యా విధానంపై సిఎం రేవంత్ వివరణ
- హిమాచల్ విద్యామంత్రి రోహిత్ కుమార్ భేటీలో వివరాలు వెల్లడి

**హైదరాబాద్, జనవరి 8:** ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే ప్రీ ప్రైమరీ విద్యా విధానాన్ని త్వరలో తెలంగాణలో అమలు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్ విద్యా శాఖ మంత్రి రోహిత్ కుమార్క గురువారం సిఎం రేవంత్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఇక్కడి విద్యావిధానంపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులను ప్రీ ప్రైమరీ పాఠశాలలకు తీసుకెళ్లేందుకు రవాణా సౌకర్యాన్ని సైతం కల్పించే యోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఆయనకు రేవంత్ రెడ్డి వివరించారు. తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డిని హిమాచల్‌ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి రోహిత్ కుమార్‌తో కూడిన ఉన్నతాధికారుల బృందం కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణలో తీసుకురాబోతున్న విద్యా విధానాన్ని సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి రోహిత్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఐటీఐలను ఏటీసీలుగా తీర్చిదిద్దుతున్నట్లు ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏటీసీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మల్లెపల్లిలోని ఐటీఐని సందర్శించాలని మంత్రి రోహిత్ కుమార్‌కు ముఖ్యమంత్రి సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణలో అమలు కానున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంపై రోహిత్ కుమార్ ఆసక్తి కనబరిచారు. స్కూళ్ల ఏర్పాటుకు సంబంధించి.. సమగ్ర నివేదికను తమకు అందించాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్‌ను హిమాచల్ ప్రదేశ్ మంత్రి కోరారు. అలాగే ప్రభుత్వ విద్యా వ్యవస్థను పటిష్ట పరిచేందుకు రేవంత్ రెడ్డి విజన్‌ను రోహిత్ కుమార్ అభినందనలతో ముంచెత్తారు. ÷ూష్ట్ర విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న సంస్కరణలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు వివరాలను హిమాచల్‌ప్రదేశ్ మంత్రికి ఈ సందర్భంగా సీఎం రేవంత్ వివరించారు. 25 ఎకరాల సువిశాల స్థలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఒకే చోట మినీ యూనివర్సిటీ తరహాలో రూ200 కోట్లతో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు సోదాహరణతో రోహిత్ కుమార్‌కు ముఖ్యమంత్రి వివరించారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ తరహాలో త్వరలో తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురానున్నట్లు ఆయనకు సీఎం రేవంత్ వివరించారు. అందుకు సంబంధించి ఒక కమిటీని నియమించామని.. త్వరలోనే పాలసీని తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యాశాఖ కమిషనర్ యోగితా రాణా, పాఠశాల విద్య డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డితోపాటు హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలతో కాంగ్రెస్ సన్నద్ధం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో మున్సిపల్ ఎన్నికలపైనా చర్చించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో గెలుపు బాధ్యతలు తీసుకునేలా దిశానిర్దేశం చేశారు. వీటిని పర్యవేక్షించే బాధ్యతను రాష్ట్ర పార్టీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కట్టబెట్టింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు వేదికగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్ గాంధీలను ఆహ్వానించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం భావిస్తోంది. మండలాల్లో సైతం ఈ సభలను విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఒక మండలం బాధ్యతను తాను తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదంటూ ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఆరోపిస్తున్నాయి. అలాగే ఏపీ ప్రభుత్వం అక్రమ నీటి ప్రాజెక్ట్‌లు నిర్మించేందుకు సన్నాహాలు చేస్తోందని.. ఈ వ్యవహారంలో రేవంత్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందంటూ బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు వరుసగా విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విమర్శలు తిప్పికొట్టేందుకు ఈ భారీ బహిరంగ సభలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. అంతేకాకుండా ఈ సభల వేదిక మీద నుంచి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత.. ఆరు గ్యారంటీలు, రైతు రుణమాఫీ, ఉచిత విద్యుత్, మహాలక్ష్మి తదితర పథకాలు అమలును వివరించడం ద్వారా ప్రతిపక్ష విమర్శలు తిప్పికొట్ట వచ్చనే లక్ష్యంలో ఈ కీలక నిర్ణయాన్ని ఆ పార్టీ తీసుకుంది. అంతేకాకుండా.. ఆయా జిల్లాల్లోని స్థానిక సమస్యలతోపాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసే దిశగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందంటూ ఈ సందర్భంగా ప్రజలకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇంకోవైపు రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వ తీరును ఎండగడతామంటూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. ఇందుకోసం భారీ



బహిరంగ సభలు నిర్వహిస్తామంటూ ఆయన ఇప్పటికే మీడియా వేదికగా స్పష్టమైన ప్రకటన చేశారు. అలాంటి వేళ బీఆర్ఎస్ పార్టీ కంటే ముందే భారీ బహిరంగ సభలు నిర్వహించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఆ దిశగా ఆ పార్టీ అగ్రనాయకత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

# హెచ్‌టీ పత్తి విత్తనాలను అడ్డుకోండి

- రాష్ట్రంలోకి రాకుండా చర్యలు తీసుకోండి
- టాస్క్‌ఫోర్స్ టీమ్‌లతో నిఘా ఏర్పాటు
- అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం





**హైదరాబాద్, జనవరి 8:** రాష్ట్రంలో అనధికారకంగా, అనుమతిలేని పత్తి విత్తనాల ప్యాకెట్ల అమ్మకాలను అరికట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. పత్తి విత్తనాల ప్యాకేట్లపై వ్యవసాయశాఖ సంచాలకులతో సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అనుమతిలేని హెచ్‌టి పత్తి విత్తనాలను రాష్ట్రంలో అమ్మకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పత్తి రకాన్ని అమెరికాకు చెందిన మోన్సాంటో కంపెనీ కనుగొన్నప్పటికి, ఫీల్డ్ ట్రయల్స్ లో ఫెయిల్ అవడం మరియు దీనివలన పర్యావరణానికి కలిగే అనర్థాలను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పత్తి రకానికి అనుమతులు ఇవ్వలేదని మంత్రిగారు తెలిపారు. అయినప్పటికి కొందరు దళారులు తమ ప్రయోజనాల కోసం రైతులకు ఊ÷ు పత్తి విత్తనాలను అనధికారకంగా రైతులకు అంటగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 అధీకృత పత్తి విత్తన కంపెనీలు విత్తనోత్పత్తి చేస్తుండగా, ప్రభుత్వం సర్టి÷డ్ చేసిన మరో 40 వివిధ కంపెనీలు రాష్ట్రానికి పత్తి విత్తన ప్యాకెట్లను సరఫరా చేస్తున్నాయన్నారు. గత సంవత్సరం ఈ కంపెనీల ద్వారా సరఫరా అయిన 1.10 కోట్ల పత్తి విత్తన ప్యాకెట్లను రైతుల కొనుగోలు చేశారన్నారు. కొందరు దళారులు కేంద్ర ప్రభుత్వం బ్యాన్ చేసిన హెచ్‌టి విత్తనాలతో పాటు కల్తీ విత్తనాలను మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి తెలంగాణ సరిహద్దు ప్రాంతాలలోని రైతులకు అమ్ముతున్నట్టు గుర్తించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో దాదాపు 52 లక్షల ఎకరాలలో పత్తి సాగయ్యే అవకాశం ఉందని, దీనిని ఆసరా చేసుకొని దళారులు ఊ÷ు విత్తనాలు మరియు కల్తీ విత్తనాలను రాష్ట్రంలోకి తెచ్చే అవకాశం ఉన్నందున, ఈ నెల నుంచే సరిహద్దు ప్రాంతాలలో టాస్క్ ఫోర్స్ టీంలను ఏర్పాటు చేసిన పత్తి విత్తనాల అక్రమ రవాణాలను అరికట్టే విధంగా నిఘా ఏర్పాట్లు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా కో-మార్కెటింగ్ కు సంబంధించి విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ రకం పత్తి విత్తనాలను రైతులు కొనకుండా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కలుపును తట్టుకుంటుందని, అధిక దిగుబడి వస్తుందని పత్తి విత్తనాలను కొనవద్దని ఈ సందర్భంగా మంత్రి రైతులను కోరారు. ఈ విత్తనాలను వాడటం వలన అధికంగా కలుపు మందు వాడాల్సి వస్తుందని, దీంతో పర్యావరణానికి హాని కలగడంతోపాటు జీవ వైవిధ్యం దెబ్బతిని, ఇతర పత్తి హైబ్రిడ్ లు కూడా కలుషితం అవుతాయని వివరించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు డా.గోపితో పాటు వ్యవసాయశాఖ అధికారులు మరియు విత్తన కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# కృష్ణా జలాలపై పదేపదే రాజకీయాలు



- పాలమూరు-రంగారెడ్డికి విభజన చట్టంలో ప్రతిపాదన ఏదీ
- 229 టీఎంసీలు చాలని కేసీఆర్ సంతకం పెట్టలేదా?
- బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు

**కరీంనగర్, జనవరి 8:** కృష్ణా జలాల అంశంలో ప్రజలను కేసీఆర్ పదేపదే మోసం చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 571 టీఎంసీలు రావాల్సి ఉంటే.. 299 టీఎంసీలకే ఆయన ఎందుకు అంగీకారం తెలిపారని ప్రశ్నించారు. కరీంనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంజయ్ మాట్లాడారు. పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలించినప్పుడు ఎవరూ స్పందించ లేదన్నారు. వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నదీ జలాల అంశాన్ని తెరపైకి తెచ్చాయని మండిపడ్డారు.. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను పూర్తిగా వాడుకోలేదు. అవసరం ఉన్నప్పటికీ వినియోగించుకోలేదు. అప్పటికే నిర్మాణంలో ఉన్నవాటికి అభ్యంతరం చెప్పొద్దని ఏపీ పునర్విభజన చట్టంలో ఉంది. ఆ చట్టంలో పాలమూరు-రంగారెడ్డికి పేరే లేదు. పోతిరెడ్డిపాడు ద్వారా 4 టీఎంసీల నీటిని ఏపీకి తరలించారు. దీన్ని గతంలో అడ్డుకోలేదు. కాంగ్రెస్, కేసీఆర్ చేసిన మోసాలు చూస్తే నాకు ఆశ్చర్యం వేసిందని బండి సంజయ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా జలాల విషయంలో రెండు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుంది.. ప్రజల దృష్టి మరల్చడానికే కాంగ్రెస్, బీఆర్ఎస్ పొలిటికల్ డ్రామా ఆడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి ఇరిగేషన్ విషయంలో అసెంబ్లీ వేదికగా పచ్చి అబద్దాలు మాట్లాడారన్నారు. మేము నదీజలాలపై కొట్లాడినప్పుడు కాంగ్రెస్ పార్టీ ఫీల్డ్ లో లేదు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అండగా ఉందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ తామే ప్రారంభించామని కాంగ్రెస్ అంటోంది.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పాలమూరు రంగారెడ్డి పేరు ఎందుకు లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ఇది మరణశాసనం. వాళ్లే జాతీయ హోదా ఇవ్వలేదు అని లొల్లి చేస్తూన్నారన్నారు. రీ ఆర్గనైజ్ యాక్ట్ లో 6 ప్రాజెక్ట్ లు మాత్రమే ఉన్నాయి.. పునర్విభజన చట్టంలో లేని పాలమూరు ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఎలా ఇస్తారు..? అని నిలదీశారు. కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందన్నారు.. పోతిరెడ్డిపాడు విషయంలో ఆ రెండు పార్టీలు నోరు మెదపలేదు. కేసీఆర్ ప్రకటనలకు పరిమితం అయ్యారని బండి సంజయ్ అన్నారు.. కృష్ణా నది మీ జాగీరా? అణు బాంబు అయితా అన్నాడు కేసీఆర్.. అణుబాంబు కాదు తోక పటాక్ కూడా కాలేదు. ఉమాభారతి సమక్షంలో జరిగిన మీటింగ్ లో 299 టిఎంసిలు కృష్ణా నదిలో వాటా చాలు అన్నారు. దానికి కేసీఆర్ వద్ద సమాచారం లేదు. తెలంగాణకు కృష్ణా జలాల్లో అన్యాయం చేసింది కేసీఆర్? ఈ విషయాన్ని నేనే బయట పెట్టాను.. వెంటనే నేను అన్నది తప్పు అన్నారు కేసీఆర్. ఆంధ్ర వాళ్ళతో కమిట్ అయ్యి.. ఇక్కడ ఉల్టా డైలాగులు కొట్టారు. కాళేశ్వరం అని రూ. లక్ష కోట్లు మింగి కూలేశ్వరం కట్టారు. రెండవ దఫాలో కృష్ణా మీద కన్నేసి.. పాలమూరు రంగారెడ్డి కి సిద్ధమయ్యారు. జగన్ ప్రగతి భవన్ కి వచ్చారు.. ఇద్దరూ కలిసిన విషయం ఫార్మాలిటీ అన్నారు.. ఆనాడు నేను ప్రశ్నిస్తే నన్ను విమర్శించారు. వెంటనే బేసిన్లు లేవు భేషజాలు లేవు అన్నారు. రాయలసీమ ఎత్తిపోతల జరుగుతుంటే ఆపలేదు. రోజా ఇంటికి పోయి రొయ్యల కూర చేపల పులుసు తిని వచ్చారు. రాయలసీమను రత్నాల సీమ చేస్తా అని చెప్పి.. పెద్దన్న పాత్ర పోషిస్తా అన్నారు. కవిత కూడా ఆ రోజు పట్టుబట్టలు పెట్టారు. ఆరోజు జరిగిన సమావేశంలో ఏమి జరిగిందో కవిత బయటపెట్టాలని బండి డిమాండ్ చేశారు. బీజేపీ అండ ఉంది. కవిత దావత్ వద్దన్నదని నాకు సమాచారం ఉంది. ఇప్పుడు చెప్పాలి? రోజా ఇంట్లో నాన్ వెజ్ తిని తిరుమల యాత్ర రద్దు చేసుకున్నారు. రాయలసీమ ఎత్తిపోతల విషయంలో అన్యాయాన్ని నిరసిస్తూ మేము ఇళ్లపై నల్లజెండాలు ఎగరవేశాం.. అని సంజయ్ వెల్లడించారు.



# మహిళా మంత్రులకు కేసీఆర్ ఆత్మీయ స్వాగతం

## చీరసారెతో దంపతుల సత్కారం

## యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న కెసిఆర్


## మేడారం ఆహ్వాన పత్రిక అందచేసిన మంత్రులు

**గజ్వేల్, జనవరి 8 :** ఎర్రవెల్లిలోని తన నివాసానికి వచ్చిన మహిళా మంత్రులను భారత రాష్ట్రసమితి అధినేత కేసీఆర్ ఆత్మీయంగా పలకరించారు. అతిథి మర్యాదలతో పసుపు, కుంకుమ, చీర, తాంబూలాలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు సీతక్క, కొండా సురేఖ గురువారం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి.. మేడారం జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. మేడారం ప్రసాదం అందజేసి.. మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న జాతరను సందర్శించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా.. తన ఇంటికి వచ్చిన ఆడబిడ్డలను ఆత్మీయంగా పలకరించి.. సాదరంగా ఆహ్వానించిన కేసీఆర్ దంపతులు సాంప్రదాయ పద్ధతిలో సత్కరించారు. కేసీఆర్ దంపతులు ఇచ్చిన తేనీటి విందు స్వీకరించిన మంత్రులు.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత, ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మహిళా మంత్రులకు మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ ఆహ్వానం పలికారు. తన ఇంటికి వచ్చిన రాష్ట్ర మహిళా మంత్రులను 'బాగున్నరా అమ్మ' అంటూ ఆత్మీయంగా పలకరించారు. వారికి సాదర స్వాగతం పలికారు. కేసీఆర్, ఆయన సతీమణి శోభమ్మ వారికి అతిథి మర్యాదలు చేశారు. సంప్రదాయం ప్రకారం పసుపు కుంకుమలు, చీర, తాంబూలాలతో ఆ ఆడబిడ్డలను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఆహ్వాన పత్రికను అందజేశారు. అదేవిధంగా మేడారం ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ దంపతులు అందించిన తేనీటి విందును మహిళా మంత్రులు స్వీకరించారు. కాసేపు పరస్పర యోగక్షేమాల గురించి వారు మాట్లాడుకున్నారు. ఇష్టాగోష్టి అనంతరం మహిళా మంత్రులు తిరుగు ప్రయాణం అయ్యారు. అంతకుముందు మహిళా మంత్రులు ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసం దగ్గర వాహనాలు దిగగానే మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ వారికి పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా ఆహ్వానించారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో సిట్ దూకుడు

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారణ

**హైదరాబాద్,జనవరి 8:** తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దర్యాప్తు మరింత ఊపందుకుంది. ఫోన్లు ట్యాప్ చేసిన ఆరోపణలపై సిట్ దూకుడుగా విచారణ చేపడుతోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిన సిట్.. వారిని విచారిస్తోంది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గురువారం జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. గతేడాది నవంబర్ 17న కూడా ఆయన సిట్ విచారణకు హాజరైన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి నోటీసు అందడంతో జైపాల్ యాదవ్ విచారణకు రాగా.. సిట్ అధికారులు ఈ కేసుకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో ఈ కేసులో నిందితుడైన అడిషనల్ ఎస్పీ తిరుపతన్న, జైపాల్ యాదవ్ మధ్య ఫోన్ సంభాషణలు జరిగినట్లు సిట్ గుర్తించింది. దర్యాప్తులో భాగంగా.. ఒక కేసులో భార్యాభర్తల మధ్య తలెత్తిన సమస్యపై తిరుపతన్నతో మాట్లాడినట్లు జైపాల్ యాదవ్ వాంగ్మూలం ఇచ్చారు. అయితే సిట్ అధికారులు ఎన్నికల సమయంలో జరిగిన ఈ కాల్స్, సంభాషణలపై లోతుగా విచారించారు. జైపాల్ యాదవ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసినట్లు సమాచారం.అలాగే ఈ కేసులో మరో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యనూ సిట్ విచారించనుంది. ఇటీవల సిట్ జారీ చేసిన నోటీసుల్లో భాగంగా ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలతోపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కూడా విచారణకు హాజరు కానున్నారు. బీఆర్ఎస్ హయాంలో కొండల్ రెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు దర్యాప్తులో తేలడంతో ఆయనను సాక్షిగా పిలిచినట్లు తెలుస్తోంది.



# రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైంది?

## మరోమారు రేంవత్‌పై కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, జనవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శేరిలింగపల్లి నియోకవర్గానికి చెందిన పలువురు నాయకులు వివిధ పార్టీల నుంచి వచ్చి బీఆర్ఎస్‌లో చేరారు. కేటీఆర్ వారికి స్వయంగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి సర్కారు ప్రజలను మోసం చేసిందని అన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఒక్క హామీని కూడా ఈ రేవంత్ సర్కారు నెరవేర్చలేదని కేటీఆర్ విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఏడాదిలోగా రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడి పోయినయని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి ఇయ్యకుండా నిరుద్యోగులను మోసం చేసింరని ఆరోపించారు. కాంగ్రెస్ మోసాలను



ఎండగట్టేందుకు విద్యార్థులు రోడ్లపైకి వస్తున్నారని కేటీఆర్ చెప్పారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్‌లో, ఇవాళ అశోక్‌నగర్‌లో విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. జాబ్ నోటిఫికేషన్‌లు ఎక్కడ రాహుల్‌గాంధీ అని ప్రశ్నిస్తున్నారని తెలిపారు. జీహెచ్‌ఎంసీ ఎన్నికల సెమ్గీ÷నైల్ లాంటివని, ఈ ఎన్నికల్లో చాకుల్లాంటి కుర్రోళ్లను అభ్యర్థులుగా నిలబెడుతామని, గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

# నిరుద్యోగులపై దమనకాండ దారుణం

## ఆందోళన చేస్తున్న వారిపై పోలీసుల దాష్టీకం

## జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం చేసిన రేవంత్

## ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్, జనవరి 8:** నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రేవంత్ సర్కారు సాగిస్తున్న దమన కాండపై మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రంగా మండిపడ్డారు. నిన్న దిల్‌సుఖ్‌నగర్, నేడు అశోక్ నగర్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులపై పోలీసులు క్రూరంగా విరుచుకుపడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కాంగ్రెస్ నేతలు ఎన్నికలకు ముందు అశోక్ నగర్ లైబ్రరీ చుట్టూ చక్కర్లు కొట్టి పొర్లుదండాలు పెట్టి నిరుద్యోగులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్నారు. వారి ఉద్యోగ కాంక్షను ఆసరా చేసుకొని, వారిని కాంగ్రెస్ కార్యకర్తలుగా మార్చుకొని ఇంటింటికి తిప్పి ప్రచారానికి వాడుకుని.. అధికార పీఠం ఎక్కగానే అదే నిరుద్యోగ గొంతులపై ఉక్కు పాదం మోపి తొక్కుతున్నారని హరీష్ రావు ఆరోపించారు. ఇవాళ తెలంగాణలో నిరంకుశత్వం రాజ్యమేలుతున్నది. పోలీసు రాజ్యం నడుస్తున్నది. ఓడ దాటే దాకా ఓడ మల్లన్న, ఓడ దాటినాక బోడ మల్లన్న



అన్నట్లు ఇప్పుడు నిరుద్యోగులకు లాఠీ చార్జీలు, అరెస్టులు, సంకెళ్లను బహుమతిగా ఇస్తున్నారని హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలని మోసం చేశారు. నిరుద్యోగ భృతి పేరిట నయవంచన చేశారని మండిపడ్డారు. రెండేళ్లలో 10 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వకుండా 60వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నవు..నీ తప్పుడు ప్రచారంపై కడుపు మండిన విద్యార్థులు, నిరుద్యోగులు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నవు. నెలల తరబడి విద్యార్థులు, నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తుంటే నువ్వు ఢిల్లీకి చక్కర్లు కొడుతూ కాలం వెళ్లదీస్తున్నవని సీఎం రేవంత్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రంథాలయాల్లో పోలీసులు లాఠీ చార్జీలు జరిపించిన అరాచక చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది. విద్యార్థులు, నిరుద్యోగుల వీపులు పగుల గొట్టిన అమానుష పాలన కాంగ్రెస్ ప్రభుత్వానిది. ఆంక్షలతో, నిషేధాలతో నిరుద్యోగుల హృదయాల్లో రగులుతున్న నిరసన జ్వాలలను చల్లార్చలేరు. ఈ రోజు గాయపడిన ప్రతి నిరుద్యోగికి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పి తీరాలి. దాడికి బాధ్యులైన పోలీసు అధికారులపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. నిర్బంధాలను ఆపి నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. నిరుద్యోగులను లాకప్ హింసకు గురిచేసినా, బెదిరింపులకు పాల్పడినా బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం. అరెస్టు చేసిన నిరుద్యోగ సోదరులను భేషరతుగా తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

# సీపీఐ వందేళ్ల ప్రస్థానంపై ఖమ్మంలో సభలు

## జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ వెల్లడి


**ఖమ్మం, జనవరి 8:** సిపిఐ వందేళ్ల ప్రస్థానం పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ఈ నెల 18వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. సీపీఐ జాతీయ నాయకులంతా ఈ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. 18వ తేదీన నగరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సంఘీభావంగా ఈ ర్యాలీలో పాల్గొంటారని పేర్కొన్నారు. గురువారం ఖమ్మం జిల్లాలో రామకృష్ణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌కు వెళ్లారు. అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడుతూ..సీపీఐ ఆవిర్భావం నుంచి పోరాటాల పంథా కొనసాగించిందని తెలిపారు. పేదలు, కార్మికుల హక్కుల కోసం ఎంతోమంది జైలుకు వెళ్లారని అన్నారు. దేశం కోసం సీపీఐ ఎన్నో త్యాగాలు చేసిందని ప్రస్తావించారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పోరాటాల గడ్డ ఖమ్మంలో శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఖమ్మంలో జాతీయ కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. 20వ తేదీ వామపక్ష పార్టీల జాతీయ నాయకులు ఆహ్వానించి సెమినార్ ఏర్పాటు చేశామని అన్నారు. 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగే ఈ సెమినార్‌కు ఎనలేని ప్రాధాన్యత ఉందని వివరించారు. ఈ సెమినార్‌లో వామపక్ష పార్టీలు పాల్గొంటాయని వెల్లడించారు. వామపక్ష పార్టీలు దేశంలో ఇతర పార్టీలను కలుపుకొని పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు రామకృష్ణ. ప్రపంచాన్ని బెదిరించాలనే దుస్సాహసానికి ట్రంప్ పాల్పడ్డారని ,ఇంత జరుగుతున్నా.. ప్రధాని నరేంద్రమోదీ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తనను సంతృప్తిపరచాల్సిన బాధ్యత మోదీపై ఉందని డొనాల్డ్ ట్రంప్ ఇటీవల అన్నారని ప్రస్తావించారు. ఒకప్పుడు ప్రపంచ దేశాలకు నాయకత్వం ఇచ్చిన ఇండియా.. ఇప్పుడు మాట్లాడలేని పరిస్థితికి ఎందుకు దిగజారిందని నిలదీశారు. మోదీ పాలనలో ప్రపంచ దేశాల్లో భారతదేశానికి విలువ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ట్రంప్ పిచ్చోడి చేతిలో రాయిలాగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఒక దేశ అధ్యక్షుడి ఇంటిపై దాడి చేసి కిడ్నాప్ చేసే నీచ స్థితికి ట్రంప్ దిగజారారని షాకింగ్ కామెంట్స్ చేశారు. పోలవరం ముంపు ప్రాంతాల మండలాల్లో ఈరోజు(గురువారం) సమావేశం ఉందని రామకృష్ణ తెలిపారు. ఏపీ ముఖ్యమంత్రి 2027 మార్చి నాటికి పోలవరం పూర్తిచేసి జాతికి అందిస్తామని అంటున్నారని అన్నారు. పోలవరం పూర్తిచేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. పోలవరం ఏర్పాటుకు త్యాగాలు చేసిన భూ నిర్వాసితుల పరిస్థితి గురించి మాట్లాడటం లేదని అన్నారు. ఆగస్టు నెల వస్తే ఆ మండలాల్లోనే గ్రామాలు మునిగిపోతున్నాయని చెప్పుకొచ్చారు. 135 అడుగుల వరకు మాత్రమే సాయం చేస్తామని కేంద్ర ప్రభుత్వం చెబుతోందని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పోలవరం ముంపు బాధితులను గాలికి వదిలేశారని ఆరోపించారు. నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ డిమాండ్ చేస్తోందని అన్నారు. మావోయిస్టుల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ఆపరేషన్ కగార్‌ను సీపీఐ పార్టీ ఖండిస్తోందని తెలిపారు. తక్షణమే నక్సల్స్‌తో చర్చలు జరపాలని కోరారు. మావోయస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్ కూడా బూటకమేనని, పట్టుకొచ్చి కాల్చి చంపారని ఆరోపణలు చేశారు. ప్రశ్నించే వాళ్లని అర్బన్ నక్సల్స్ పేరుతో కేంద్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని రామకృష్ణ విమర్శించారు.




## సంపాదకీయం

# డాలర్, ఆయిల్‌పై ఆధిపత్య ధోరణి!

ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో మార్పు వస్తోంది. డాలర్ ఆధిపత్యానికి గండికొట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. చమురుపై పెత్తనాలను సహించడం లేదు. చైనా యెన్, రష్యా రూబుల్స్, భారత్ రూపాయిల్లో వ్యాపారాలకు సమాయత్తం అవుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా వస్తుమార్పిడి పద్ధతిలో వ్యాపారాలకు తెరదీస్తున్నారు. ఆయా దేశాలు ఈ రకమైన ఒప్పందాలకు ముందుకు కదులుతున్న వేళ ఇవన్నీ కూడా అగ్రరాజ్యం అమెరికాకు కంటకింపుగా మారాయి. ఇవన్నీ జరిగితే డాలర్ పతనం అవుతుంది. చమురుపై ఆధిపత్యం పోతుంది. అందుకే అమెరికా పావులు కదిపింది. ప్రపంచ దేశాలను గుప్పిట పెట్టుకునే ప్రయత్నంలో భాగంగా వెనుజులాపై దాడికి తెగించింది. ఆ దేశ అధ్యక్షుడు ముదురోను కిడ్నాప్ చేసి బందీగా తీసుకెళ్లింది. అయితే ఈ ఘటనపై వెనిజులాలో ఎక్కడా వ్యతిరేకత రాలేదు. ఎందుకంటే అక్కడ నిరుద్యోగం తాండవిస్తోంది. వలసలు పెరిగాయి. ఆయిల్ నిల్వలు ఉన్నా ఎదగడానికి లేకుండ ఆపోయింది. చావెజ్ కాలంలో చమురుశుద్ధి రంగంలోకి దిగిన అమెరిక్ ఆయిల్ కంపెనీలను తన్ని తగలేశారు. ఈ కారణంగా అక్కడ తినడానికే తిండి లేకుండా పోయింది. సంచుల్లో కరెన్సీ పట్టుకెళితు సంచెడు కూరగాయులు కూడా దొరకని పరిస్థితి దాపురించింది. అందుకే అమెరికా దాడిని ప్రజలు స్వాగతించారు. ఇకపోతే వెనెజులాతో చైనా వ్యాపారం జోరుగా సాగుతోంది. చైనా యెన్‌లో వ్యాపారం సాగిస్తోంది. ఇది అమెరికాకు గిట్టడం లేదు. చైనాను కట్టడి చేయడానికి అమెరికా వెంటనే రంగంలోకి దగడం వెనక ఇదే కారణమని అంతర్జాతీయ పరిణామాలు చెబుతున్నాయి. ప్రపంచంలో ఆర్థికంగా ఎదిగిపోతున్న చైనాను కట్టడి చేయడానికి అమెరికా వెనిజులాను ఎరగా చేసుకుందన్న వాదన ఉంది. అందులో భాగంగానే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోపై నార్కో టెర్రరిస్టు అనే అభియోగం మోపి అమెరికా కిడ్నాప్ చేసింది. అమెరికా వెనిజులాలో లభించే చమురు, ఖనిజ నిక్షేపాలను తన ఆధీనంలోకి తీసుకునేందుకు మాత్రమే ఈ దురాక్రమణకు పాల్పడలేదు. గత రెండు దశాబ్దాలుగా లాటిన్ అమెరికాపై చైనా పట్టు పెంచుకుంటోంది. లాటిన్ అమెరికా దేశాలకు చైనా ఆర్థిక సహాయమందిస్తోంది. దక్షిణ అమెరికాపై చైనా పట్టును సడలించడానికే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇలాంటి బెదిరింపులకు దిగుతున్నారు. ఆర్థిక కోణంలో పరిశీలిస్తే.. వెనిజులాలో లభించే క్రూడాయిల్ ఎక్కువశాతం చైనాకు ఎగుమతి అవుతుంది. ఇదే కాకుండా బొగ్గు, బంగారం, బాక్సైట్, ఐరన్ ఎగుమతులు కూడా రెండు దశాబ్దాల్లో చైనాకు విపరీతంగా వియత్నాం ఎగుమతుల్ని పెంచుకుంది. 2000 సంవత్సరంలో ఒక శాతం కన్నా తక్కువగా ఉన్న ఖనిజ ఎగుమతులు అధికారిక లెక్కల ప్రకారం 2018 నాటికి 28 శాతం మేర వియత్నాం ఎగుమతులు పెరిగాయి. రెండు దశాబ్దాల కాలంలోనే.. లాటిన్ అమెరికా దేశాలకు చైనా రుణాలు ఇవ్వడం కూడా పెరిగింది. 1990ల మధ్యలో వెనిజులా దిగుమతులలో అమెరికా వాటా చాలా సంవత్సరాలు స్థిరంగా 40 శాతం మార్కును దాటింది. 2023లో వెనిజులా దిగుమతుల్లో అమెరికా వాటా కేవలం నాలుగో వంతు మాత్రమే. అయితే అదే కాలలో చైనా వాటా మూడింట ఒకవంతుగా ఉంది. గత రెండు దశాబ్దాలలో చైనా వాటా పెరిగింది. అమెరికా నుంచి దిగుమతుల వాటా దాదాపు సగానికి తగ్గింది. ఇదే క్రమంలో డాలర్ల నుంచి చైనా యెన్‌ల రూపంలో మారకం సాగుతోంది. వెనిజులాపై ఆంక్షల నేపథ్యంలో ఈ పద్ధతిని చైనా ఎంచుకుంది. ఇది కూడా అమెరికా ఆగ్రహానికి కారణమయ్యింది. చైనా 2001-2023 మధ్యకాలంలో లాటిన్ అమెరికా దేశాలకు చైనా నుంచి పెట్టుబడుల పరంగానూ, సహాయంగానూ, రుణాలు, గ్రాంట్ల రూపంలో మొత్తం 300 బిలియన్ డాలర్లకు పైగా అందించింది. అందులో మూడింట ఒకవంతు కంటే ఎక్కువ సుమారు 106 బిలియన్ డాలర్లను వెనిజులాలో చైనా పెట్టుబడి పెట్టింది. లాటిన్ అమెరికాలోనే కాకుండా.. వెనిజులా ప్రపంచవ్యాప్తంగా చైనా నుంచి సహాయం పొందుతున్న నాల్గవ అతిపెద్ద దేశం అని ఎయిడ్ డేటా అనే పరిశోధనా ప్రయోగశాల గణాంకాలు చెబుతున్నాయి. వెనిజులా దిగుమతులతో.. చైనా 170కి పైగా ప్రాజెక్టులను నిర్మించుకుంది. వెనిజులాలో చైనా 26 శాతం కంటే ఎక్కువ విద్యుత్, మైనింగ్ ఇతర సంబంధిత పరిశ్రమల వంటి కీలక రంగాల్లో పెట్టుబడి పెట్టినట్లు ఈ గణాంకాలు తెలిపాయి. లాటిన్ అమెరికాలో చైనా ప్రభావాన్ని తగ్గించడానికి, ఓ రకంగా చైనాకు కౌంటర్ ఇవ్వడానికే వెనిజులా అధ్యక్షుడు మదురోని కిడ్నాప్ చేసినట్లు ఈ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే రష్యా, చైనా, ఇతర ఐరోపా దేశాలు డాలర్ ప్రభావం నుండి బయటపడే ప్రయత్నంలో ఉన్నాయి. ఇవన్ఈన గమనించిన ట్రంప త్వరగా చర్య తీసుకోకపోతే మొదటికే ముప్పు వస్తుందని గుర్తించారు. డారల్‌పైనా, ఆయిల్‌పైనా పట్టు కొనసాగించాలంటే అడ్డుకట్ట వేయాలని నిర్ణయించుకున్నారు. దాని పర్యవసానమే వెనిజులాపై దాడి అని గుర్తించాలి. అలాగే చైనా, భారత్, మెక్సికో తదితర దేశాలపైనా ఆంక్షలు, టారిఫ్‌లు విధిస్తున్నారు. బెదిరిస్తున్నారు. ముఖ్యంగా భారత్ ఆధిపత్యానికి గండి కొట్టేందుకు ర కరకాలుగా ప్రయత్నిస్తున్నారు. అక్కడి ఉద్యోగులపైనా ఆంక్షలు విధిస్తున్నారు. ఇవన్నీ కూడ అమెరికా పెత్తనం కొనసాగించేందుకే అని ప్రపంచం గుర్తిస్తోంది.



# భారత్‌పై పేలనున్న మరో బాంబ్

- ఏకంగా 500 శాతం సుంకాల వింధింపునకు రెడీ
- బిల్లును సిద్ధం చేసిన అమెరికా



**వాషింగ్టన్, జనవరి 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై మరో బాంబు వేసేందుకు రెడీ అవుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే కారణంతో భారత్‌పై ఏకంగా 500 శాతం సుంకాలు విధించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఈ మేరకు కీలక బిల్లుకు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ విషయంపై రిపబ్లికన్ సెనెటర్ లిన్స్ గ్రాహం ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. ట్రంప్‌తో జరిగిన భేటీలో పలు కీలక విషయాల గురించి చర్చలు జరిపినట్టు తెలిపారు. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు అధ్యక్షుడు ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఈ బిల్లుపై వచ్చే వారం ఓటింగ్ జరగనుందని వెల్లడించారు. ఉక్రెయిన్‌లో పుతిన్ చేస్తున్న దారుణాలకు రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్, చైనా, బ్రెజిల్ దేశాలు పరోక్షంగా మద్దతు ఇస్తున్నాయని గ్రాహం ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా బిల్లు ప్రకారం ఆయా దేశాలపై 500 శాతం సుంకాలు విధించే అధికారం అమెరికాకు ఉంటుందని గ్రాహం తెలిపారు బిల్లు ఆమోదం పొందితే రష్యా నుంచి ఇతర దేశాలు చమురు కొనడం తగ్గుతుందని లిన్స్ గ్రాహం ఆశాభావం వ్యక్తం చేశారు. రష్యా నుంచి చమురు కొంటున్న దేశాల్లో ప్రస్తుతం చైనా మొదటి స్థానంలోనూ, భారత్ రెండో స్థానంలోనూ ఉన్నాయి. రష్యా నుంచి చమురు కొనడాన్ని ఆపించడానికి ట్రంప్ ఎన్నో ప్రయత్నాలు చేశారు. అందులో భాగంగానే భారత ఉత్పత్తులపై 50 శాతం సంకాలు విధించారు. అయినా భారత్ మాత్రం రష్యా నుంచి చవకగా వస్తున్న చమురును కొనుగోలు చేస్తూనే ఉంది. అందుకే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యాపై బెదిరింపులకు దిగారు. రష్యా వాణిజ్య భాగస్వామ్య దేశాలపై టారిఫ్‌లను విధించేందుకు సిద్ధమయ్యారు. ద్వైపాక్షిక రష్యా ఆంక్షల బిల్లుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు. రష్యా చమురు కొనుగోలు చేసినందుకు వాణిజ్య భాగస్వాములైన భారత్, చైనా, బ్రెజిల్‌లపై జరిమానా విధించేందుకు ఈ బిల్లును వినియోగించనున్నారు. గ్రాహం-బ్లూమెంటల్ బిల్లు ఆమోదం పొందితే, రష్యా చమురు లేదా యురేనియంను కొనుగోలు చేస్తున్న దేశాలపై 500శాతం వరకు సుంకాలు విధించడానికి అధ్యక్షుడికి అనుమతి లభిస్తుంది. బుధవారం వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశమయ్యానని గ్రాహం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రంప్ నెలల తరబడి చర్చిస్తున్న బిల్లుకు తన మద్దతు తెలిపారని అన్నారు. వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు మీడియాతో మాట్లాడుతూ.. ఈ అంశాన్ని ధృవీకరించారు. వచ్చే వారం ప్రారంభంలో ఓటింగ్ జరగవచ్చని గ్రాహం అన్నారు. ఈ బిల్లుని హౌస్ ఆమోదిస్తే, ప్రస్తుతం పరిశీలిస్తున్న స్కేల్-బ్యాక్డ్ ప్రభుత్వ నిధుల ప్యాకేజీని వచ్చే వారం సెనెట్ చేపట్టనుంది. అంటే రష్యాపై ఆర్థికంగా ఒత్తిడి విధించేందుకు రూపొందించింది. గతంలో ఈ బిల్లులో కొన్ని సవరణలు చేపట్టాలని వైట్‌హౌస్ సూచించింది.

# మా యుద్ధ విమానాలకు పెరిగిన గిరాకీ


- ఇక మాకు ఐఎంఎఫ్ రుణం కూడా అక్కర్లేదు
- పాక్ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ప్రగల్భాలు



**ఇస్లామాబాద్, జనవరి 8:** ఆపరేషన్ సిందూర్‌తో చావుదెబ్బతిన్నా..పాక్ మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూనే ఉంది. ప్రగల్భాలతో ప్రపంచాన్ని బురిడీ కొట్టించాలని చూస్తోంది. తాజాగా పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్‌తో యుద్ధం తర్వాత తమ యుద్ధ విమానాలకు ఎక్కడలేని గిరాకీ వచ్చిందని, అవి హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నాయ న్నారు. ఇకపై తమ ఆర్థిక కష్టాలు తీర్చేందుకు ఐఎంఎఫ్ రుణం కూడా అవసరం ఉండకపోవచ్చని పగటి కలలు కంటున్నారు. గతేడాది మే నెలలో భారత్‌తో 4రోజుల పాటు జరిగిన యుద్ధం తర్వాత పాకిస్థాన్‌కు రక్షణ ఆర్డర్లు పెరిగాయి. అవి ఏ స్థాయిలో అంటే.. ఆరు నెలల తర్వాత మాకు అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి రుణాల అవసరం ఉండకపోవచ్చని, పాక్ మిలిటరీ సామర్థ్యాలు ప్రపంచం దృష్టిలో పడ్డాయని ఖవాజా వ్యాఖ్యలు చేశారు. ఖవాజా మాటలకు, పాక్ ప్రభుత్వ చర్యలకు ఏమాత్రం పొంతన లేదు. కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టేందుకు ఐఎంఎఫ్ నుంచి కొన్నేళ్లుగా పాకిస్థాన్ నిధులు అర్థిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ నిధులు పొందేందుకు గాను ఐఎంఎఫ్ సూచించిన సంస్కరణల్లో భాగంగా పాక్‌కు చెందిన అంతర్జాతీయ విమానయాన సంస్థను అమ్మేందుకు అక్కడి ప్రభుత్వం సిద్ధమైంది. ఇక, 2026-2027 బ్జడెట్‌లో కొన్ని సడలింపులు, సబ్సిడీలు ఇవ్వాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకోసం రుణషరతులపై మినహాయింపులు ఇవ్వాలని ఐఎంఎఫ్‌ను కోరుతోందని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఖవాజా చెప్పినట్టుగా పాకిస్థాన్ యుద్ధవిమానాలు జేఎఫ్-17, జే-10కు దొరికిన బయ్యర్లు అజర్‌బైజాన్, లిబియాలు మాత్రమే. బంగ్లాదేశ్ ఇంకా చర్చలు జరుపుతోంది. అయితే, జేఎఫ్-17కు రష్యా, చైనా, ఇటలీ, తుర్కియే, యూకేకు చెందిన పరికరాలను దాయాది అమర్చుతోంది. ఇంజిన్ రష్యాది కాగా.. దాని డిజైనర్, తయారీదారు చైనా. అందులో పాక్ తయారీ పరికరాలు పరిమితంగానే వాడుతున్నారు. దాంతో వాటి అమ్మకాల నుంచి వచ్చే ఆదాయంలో తమ వాటాను ఇతర దేశాలు తీసుకోగా.. షరీఫ్ ప్రభుత్వానికి వచ్చేది అంతంతమాత్రంగానే ఉంటుందని పాక్ రాజకీయ విశ్లేషకులు వెల్లడించారు. ఒకవేళ జేఎఫ్-17ను 15 మిలియన్ డాలర్లు, జే-10ను 40 మిలియన్ డాలర్లకు విక్రయించినా.. 2026 ప్రారంభం వరకు ఉన్న 300 బిలియన్ డాలర్ల అప్పులకుప్పను తొలగించుకోగలదా..? అని ప్రశ్నిస్తున్నారు.

# నకిలీ ప్రభుత్వ ఉద్యోగాలతో మోసం

- ఆరు రాష్ట్రాల్లో ఏకకాలంలో ఈడీ దాడులు
- ఈడీ దాడులపై మండిపడ్డ బెంగాల్ సీఎం మమత





**న్యూఢిల్లీ, జనవరి 8:** ఒక వ్యవస్థీకృత ముఠా నిర్వహిస్తున్న నకిలీ ప్రభుత్వ ఉద్యోగాల కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ గురువారం ఆరు రాష్ట్రాల్లో సోదాలు జరిపింది. బీహార్‌లోని ముజఫర్‌పూర్, మొతిహరి, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా, కేరళలోని ఎర్నాకులం, పండలం, అదూర్ మరియు కోడూర్, తమిళనాడులోని చెన్నై, గుజరాత్‌లోని రాజ్‌కోట్, ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ప్రయాగ్‌రాజ్, లక్నోలోని 15 ప్రదేశాల్లో సోదాలు కొనసాగుతున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలో మొదట ఈ కుంభకోణాన్ని గుర్తించినప్పటికీ, అటవీ, పోస్ట్, ఐటి, హైకోర్టు, ప్రజా ప్రనుల శాఖ, బీహార్ ప్రభుత్వం, ఢిల్లీ అభివృద్ధి అథారిటీ, రాజస్థాన్ సెక్రటేరియట్, ఇతర ప్రభుత్వ సంస్థలు సహా 40కి పైగా విభాగాల్లో ఈ స్కామ్ జరిగినట్లు దర్యాప్తులో తేలిందని అన్నారు. ఈ ముఠా ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లను అనుకరిస్తూ నకిలీ ఇమెయిల్ ఖాతాలను వినియోగించి మోసపూరిత జాయినింగ్ లెటర్స్ పంపిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నమ్మించేందుకు రైల్వేలు, ఇతర సంస్థల్లో నియమించిన కొంతమంది బాధితులకు ఈముఠా రెండు నుండి 3నెలల వరకు జీతాల చెల్లింపులు కూడా చేశాయని అన్నారు. కోల్‌కతాలో కొనసాగుతున్న ఈడీ దాడులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు రాజకీయ ప్రేరేపితమని, రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఐ-ప్యాక్ చీఫ్ ప్రతీక్ జైన్ నివాసంలో జరిగిన సోదాల్లో ఈడీ అధికారులు టిఎంసి హార్డ్ డిస్క్‌లు, అంతర్గత పత్రాలు, రహస్య డేటాను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని అన్నారు. జైన్ నేతృత్వంలోని కన్‌స్టలెన్సీ సంస్థ ఇండియన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ కార్యాలయంలో కూడా సోదాలు కొనసాగుతున్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కి చెందిన ఐటి సెల్‌ను కూడా ఐ-ప్యాక్ నిర్వహిస్తోంది. అధికార పార్టీ అంతర్గత వ్యూహం, అభ్యర్థుల జాబితాలు, గోప్యమైన డిజిటల్ మెటీరియల్‌ను ఈడీ యాక్సెస్ చేసేందుకు యత్నిస్తోందని, ఆ సమాచారానికి, ఆర్థిక దర్యాప్తుతో సంబంధం లేదని అన్నారు. తమ పార్టీ వ్యూహం, ప్రణాళికలకు సంబంధించిన హార్డ్ డిస్క్‌ను తీసుకునేందుకు యత్నిస్తున్నారని అన్నారు. రాజకీయ పార్టీల అంతర్గత పత్రాలను సేకరించడం ఈడీ పనా అని కేంద్రాన్ని నిలదీశారు. ఈ ప్రక్రియ బెదిరింపుగా అభివర్ణించారు. రాజకీయ ప్రతీకారమని అన్నారు. హోంమంత్రి దేశాన్ని రక్షించే వ్యక్తిలా కాకుండా అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

# ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ కన్నుమూత

**సంతాపం ప్రకటించిన జైరామ్ రమేశ్**

**పూనె, జనవరి 8:** ప్రఖ్యాత పర్యావేరణవేత్త మాధవ్ గాడ్గిల్ (82) కన్నుమూశారు. ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పూనెలోని తన నివాసంలో బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమారుడు సిద్దార్థ్ గాడ్గిల్ గురువారం వెల్లడించారు. మాధవ్ గాడ్గిల్ పశ్చిమ కనుమల పర్యావరణ ప్రాముఖ్యతకు ఆయన విశేష కృషి చేశారు. ప్రపంచ జీవవైవిధ్య హాట్‌స్పాట్ అయిన పశ్చిమ కనుమలలో ఆయన చేసిన కృషికి గాను 2024లో ఐక్యరాజ్యసమితి అత్యున్నత పర్యావరణ గౌరవమైన వార్షిక ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డును బహూకరించింది. ఁగా, ఆయన పర్యావరణానికి సంబంధించి విలువైన సిఫార్సులను అందించారు. అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో పర్యావరణానికి నష్టం చేకూర్చకుండా కఠినమైన ఆంక్షలను తన నివేదికలో సిఫార్సు చేశారు. వాటిల్లో కొత్త రోడ్లు లేదా భవన నిర్మాణాల కట్టడాలకు అనుమతించరాదని, నిటారుగా ఉన్న వాలులో అభివృద్ధి చేయరాదని, రాతి తవ్వకాలపై నిషేధం విధించాలని ఆయన సిఫార్సు చేశారు. మాధవ్ గాడ్గిల్ మృతికి మాజీ పర్యావరణశాఖా మంత్రి, కాంగ్రెస సీనియర్ నేత జైరాం రమేశ్ సంతాపం తెలిపారు. 'మాధవ్ గాడ్గిల్ ఒక అత్యున్నతస్థాయి విద్యావేత్త, అవిశ్రాంత క్షేత్ర పరిశోధకుడు, మార్గదర్శక సంస్థ నిర్మాత, గొప్ప సంభాషణకర్త, ప్రజల నెట్‌వర్క్‌లు, ఉద్యమాలను దృఢంగా నమ్మిన వ్యక్తి, ఐదు దశాబ్దాలకు పైగా చాలామందికి స్నేహితుడు, తత్వవేత్త, మార్గదర్శి, గురువు. ఆధునిక శాస్త్రంలో అత్యుత్తమ విశ్వవిద్యాలయాలలో శిక్షణ పొందిన ఆయన జీవవైవిధ్య పరిరక్షణలో ఛాంపియన్‌గా నిలిచారు' అని జైరాం రమేష్ తన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. అలాగే మాధవ్ స్ఫూర్తిదాయక వ్యక్తిగా నిలిచిపోతారని జైరాం రమేష్ అన్నారు.



# టూరిజమే గేమ్ చేంజర్

మొదటి పేజీ తరువాయి

ఆర్థిక వ్యవస్థకు 'గేమ్ ఛేంజర్'గా మార్చి, యువతకు భారీగా ఉపాధి కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలతో పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాల్లో మొత్తం 14 కొత్త సంస్థలు ఏర్పాటవుతాయి. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో 11,753 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. సమావేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా కృష్ణా నది తీరంలో మెరీనా ప్రాజెక్టుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. దీంతో పాటు, రాష్ట్రంలో సరకు రవాణా రంగాన్ని వ్యవస్థీకృతం చేసేందుకు 'ఏపీ లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇతర ముఖ్యమైన నిర్ణయాలలో, రాష్ట్రవ్యాప్తంగా 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ కోసం రూ.944.53 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో కొత్తగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు, జల్ జీవన్ మిషన్ కింద రూ.5,000 కోట్ల



రుణానికి ప్రభుత్వ గ్యారెంటీ ఇచ్చేందుకు కూడా కేబినెట్ అంగీకరించింది. ఎక్సైజ్ విధానంలో భాగంగా బార్లపై ఉన్న అదనపు రిటైల్ ఎక్సైజ్ పన్నును ఉపసంహరించుకోవాలని, కార్పొరేషన్ల పరిధిలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సహా మంత్రులందరూ పాల్గొన్నారు. తాజా నిర్ణయాలు రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు మరింత ఊతమిస్తాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది.

## ఎంత మంది ఎంత బాధపడినా అమరావతిని బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతా

**అమరావతి :** తెలుగు సంస్కృతి, సినిమా, సాహిత్యం, కళలు, రుచుల సమ్మేళనంగా విజయవాడలో 'అమరావతి-ఆవకాయ ఫెస్టివల్ 2026' అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. పున్నమిఘాట్‌లోని ప్రధాన వేదికపై మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణా నదిలో నూతనంగా ఏర్పాటు చేసిన హౌస్ బోట్లను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, అమరావతి దేవతల రాజధాని అని,



వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అభివృద్ధి పథంలో పయనిస్తుందని అన్నారు. ఎంతమంది ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎవరు ఎంత బాధపడినా అమరావతిని దేశంలోనే బెస్ట్ సిటీగా, డైనమిక్ సిటీగా తీర్చిదిద్ది తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. విజయవాడను అత్యంత పరిశుభ్రమైన నగరంగా (క్లీనెస్ట్ సిటీ), అమరావతిని పచ్చని నగరంగా (గ్రీన్ సిటీ) మారుస్తామని హామీ ఇచ్చారు. కృష్ణా నది ఒడ్డున గంట సేపు గడిపితే ఎలాంటి ధ్యానం అవసరం లేదని, అంతటి ప్రశాంతత ఇక్కడ ఉందని ఆయన పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో పండుగలు, సంబరాలు కనుమరుగై ప్రజల ముఖాల్లో నవ్వులు కరవయ్యాయని చంద్రబాబు విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విజయవాడలో విజయ ఉత్సవ్, దసరా వేడుకలను ప్రపంచస్థాయిలో నిర్వహించామని గుర్తుచేశారు. ఒకప్పుడు దసరా అంటే మైసూరు, కలకత్తా గుర్తుకొచ్చేవని, ఇప్పుడు విజయవాడ పేరు వినిపించేలా చేశామని అన్నారు. ఆవకాయ అనగానే ప్రపంచవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ గుర్తుకొస్తుందని, భారతదేశంలో ఫుడ్ అంటే ఆంధ్రప్రదేశ్ అనే స్థాయికి మన వంటకాల ఖ్యాతి ఉందని కొనియాడారు. తెలుగు సినిమా వైభవాన్ని ప్రస్తావిస్తూ, 'భక్త ప్రహ్లాద' నుంచి 'బాహుబలి' వరకు తెలుగు చిత్రసీమ ఎన్నో శిఖరాలను అధిరోహించిందని అన్నారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్, శోభన్‌బాబు వంటి మహానటులు కృష్ణా జిల్లా నుంచే వచ్చి చిత్రసీమకు దిక్సూచిగా నిలిచారని, నేడు పవన్ కల్యాణ్, బాలకృష్ణ వంటి వారు దాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. సంపద సృష్టిలో, వ్యాపార చతురతలో కృష్ణా జిల్లా ప్రజలు ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికలను వివరిస్తూ, విశాఖపట్నాన్ని ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతామని, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ద్వారా ఇళ్లలోనే గ్యాస్ తయారుచేసుకునే సాంకేతికతను అందుబాటులోకి తెస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఏఐ వల్ల ఉద్యోగాలు పోవని, పర్యాటకం, సాంకేతికతతో మరిన్ని ఉద్యోగాలు సృష్టిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఉత్సవాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత విజయవాడ ప్రజలదేనని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తదితరులు పాల్గొన్నారు.

## పొదుపు సంఘాలకు నేరుగా రుణసదుపాయం



**గుంటూరు :** ఆన్‌లైన్‌లోనే పొదుపు సంఘాలు రుణాలు తీసుకునే సదుపాయం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. మహిళా సంఘాలను సమర్థవంతంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం అన్నారు. గుంటూరు నగర శివారులో ఏర్పాటు చేసిన సరస్ మేళాలో సీఎం మాట్లాడారు. పొదుపు సంఘాలు రూ.26వేల కోట్ల నిధిని ఏర్పాటు చేశాయి. 1.13 కోట్ల మంది సభ్యులు ఉన్నారు. రూ.5,200 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తున్నారు. పొదుపు సంఘాలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాం. నా మాట విన్న కుటుంబాలు ఇప్పుడు బాగుపడ్డాయి. ఎక్కువ తలసరి ఆదాయం పొందేది మన తెలుగువారి కుటుంబాలే. దేశంలోని బెస్ట్ ప్రాక్టీసెస్‌ను ఇక్కడికి తీసుకురావాలి. మహిళల శక్తి నాకు తెలుసు. మన రాష్ట్రంలోని మహిళలు.. ఉత్తర భారతదేశంలోని మహిళలకు శిక్షణ ఇచ్చారు. మహిళా సంఘాలను సమర్థవంతంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. మహిళలు ఫ్రీగా బస్సులో తిరిగే అవకాశం కూటమి ప్రభుత్వం కల్పించింది' అని సీఎం వివరించారు. అంతకు ముందు సరస్ మేళాలో పొదుపు సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సీఎం వీక్షించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

### డ్వాక్రా బజార్‌లో హల్వా రుచి చూసిన బాబు


గుంటూరు నగర శివారులో సరస్ ప్రదర్శన - అఖిల భారత డ్వాక్రా బజార్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం పరిశీలించారు. ప్రదర్శనలో భాగంగా ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం స్వయంగా పరిశీలించారు. ఒక స్టాల్‌లో ఏర్పాటు చేసిన మాడుగుల హల్వా రుచి చూసి.. టేస్ట్ బాగుందని నిర్వాహకులను అభినందించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను సీఎం ఆసక్తిగా తిలకించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే మాధవి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు.

## సర్పంచుల ఫోరం అధ్యక్ష రేసులో ఆసిఫ్‌ఖాన్!

ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో నిబద్ధతకు నిలువుటద్దంలా నిలిచిన యువ నాయకుడు ఆసిఫ్ ఖాన్ ను జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకోవాలనే డిమాండ్ క్షేత్రస్థాయి నుంచి హోరెత్తుతోంది. మాజీ మంత్రివర్యులు చిల్కూరి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాజకీయ ఆరంగేట్రం చేసిన నాటి నుంచి, నేటి డీసీసీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ కు నమ్మిన బంటుగా పార్టీ వెన్నంటే ఉండటం ఆయన విధేయతకు నిదర్శనం. గతంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పార్టీ పటిష్టతకు ఈయన చేసిన కృషిని గుర్తించిన అధిష్టానం, ఇప్పుడు ఆసిఫ్ ఖాన్‌కు జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ముఖ్యంగా విద్యావంతులు, రెడ్డి సామాజికవర్గం అధికంగా ఉన్న బోరిగామ గ్రామంలో, కేవలం 70 ముస్లిం ఓట్లు ఉన్నప్పటికీ కులమతాలకు అతీతంగా అందరి మద్దతుతో సర్పంచ్‌గా గెలవడం ఆయన నాయకత్వ పటిమకు సాక్ష్యంగా నిలుస్తోంది.

### నమ్మకానికి పట్టాభిషేకం..

గత 13 ఏళ్లుగా జిల్లా అధ్యక్షుడికి నీడలా ఉంటూ, పార్టీ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న ఈ యువ నేతను సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పార్టీకి అత్యంత ఆవశ్యకం. నాయకత్వం పట్ల అంచంచలమైన విశ్వాసం కలిగిన ఆసిఫ్ వంటి వ్యక్తికి బాధ్యతలు అప్పగిస్తే, జిల్లాలోని సర్పంచులందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చి పార్టీకి బలమైన రక్షణ కవచంలా నిలుస్తారని పార్టీ వర్గాలలో జోరుగా చర్చ జరుగుతుంది. ఇచ్చోడ మండల స్థాయిలో తనదైన ముద్ర వేసిన ఈయన,




ఇప్పుడు జిల్లా బాధ్యతలు చేపడితే డీసీసీ నాయకత్వానికి మరింత బలం చేకూరుతుంది. ఈ ఎంపిక జరిగితే, అది పార్టీ కోసం రక్తం చెమట ధారపోసే సామాన్య కార్యకర్తలకు ఇచ్చే గొప్ప గౌరవం అవుతుంది.

### బోరిగామ తీర్పు.. సెక్యులర్ నాయకత్వానికి నిదర్శనం

ఇచ్చోడ మండలంలోని బోరిగామ గ్రామం రాజకీయంగా అత్యంత చైతన్యవంతమైనది. సి.ఎం.ఓ మాజీ ఉన్నతాధికారి గోపిడి చంద్రశేఖర్ రెడ్డి స్వగ్రామంగా గుర్తింపు పొందిన అటువంటి చోట, రెడ్డి కమ్యూనిటీ ఓట్లు నిర్ణాయక శక్తిగా ఉన్నప్పటికీ ఆసిఫ్ ఖాన్‌ను అందరూ ఏకగ్రీవంగా ఆదరించారంటే ఆయనలోని నిష్పాక్షికత అర్థమవుతోంది. నామమాత్రపు మైనారిటీ ఓట్లు ఉన్న గ్రామంలో అగ్రవర్ణాల అండతో గెలవడం అనేది జిల్లా రాజకీయాల్లోనే ఒక గొప్ప మలుపు. ఇటువంటి సర్వజన ఆమోదం పొందిన నాయకుడిని ఫోరం అధ్యక్షుడిగా ఎన్నుకుంటే, అది కులమతాలకు అతీతంగా కాంగ్రెస్ ను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఒక గొప్ప ఆయుధంగా మారుతుంది.

### కాంగ్రెస్ విజయభేరికి ఆ ఎంపికే నాంది..

రాబోయే రోజుల్లో ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో పట్టు సాధించాలంటే, క్షేత్రస్థాయి సమస్యలపై అవగాహన ఉండి, ప్రభుత్వంతో పోరాడగల నాయకుడికి పగ్గాలు అప్పగించాలి. సర్పంచులు ఎదుర్కొంటున్న నిధుల కొరత, పరిపాలనాపరమైన ఇబ్బందులను గట్టిగా వినిపించగల సత్తా ఆసిఫ్ ఖాన్ కు ఉంది. ఈ యువ నేతను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం ద్వారా జిల్లాలోని ప్రతి గ్రామంలో పార్టీ కేడర్ ఉత్సాహంగా పనిచేస్తుంది. విధేయతను గుర్తించి, గౌరవప్రదమైన బాధ్యతను ఆయనకు అప్పగిస్తేనే జిల్లాలో కాంగ్రెస్ జెండాను తిరుగులేకుండా ఎగురవేయడం సాధ్యమవుతుందని రాజకీయ వర్గాలు బలంగా విశ్వసిస్తున్నాయి.

ఫిరోజ్ ఖాన్
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464



## ఎత్తిపోతలపై కూటమి ప్రభుత్వం దుష్ప్రచారం



కూర్చుని చంద్రబాబు ఏపీ ప్రయోజనాలను తాకట్టుపెట్టారని విమర్శించారు. గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ మోహన్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 'సొంత రాష్ట్రాన్ని తన స్వార్థ ప్రయోజనాలకు తాకట్టుపెట్టారు. రాయలసీమ ఎత్తిపోతలపై రేవంత్ వ్యాఖ్యలే సాక్ష్యం. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డితో చంద్రబాబు రహస్య ఒప్పందానికి అధికార ముద్ర వేశారు. రాయలసీమ లిఫ్ట్ అవసరం లేదని మంత్రులు మాట్లాడుతున్నారు. రాయలసీమ లిఫ్ట్ వెనుక గొప్ప ఉద్దేశ్యం ఉంది. రాయలసీమ ఎత్తిపోతల ఆపమని కోరినట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. రేవంత్ వ్యాఖ్యలు చూస్తే చంద్రబాబు ఏపీని అమ్మకానికి పెట్టారని చెప్పడానికి నిదర్శనం. శ్రీశైలంలో 881 అడుగులు ఉంటేనే పోతిరెడ్డిపాడుకు నీళ్లు వస్తాయి.. పోతిరెడ్డిపాడు నుంచి 101 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. ఇరవై ఏళ్లలో మూడు, నాలుగుసార్లే అన్ని నీళ్లు తెచ్చుకోగలిగాం' అని అని వైఎస్ జగన్ తెలిపారు. 800 అడుగుల్లోపే 2 టీఎంసీల నీళ్లు తీసుకునేందుకు.. తెలంగాణలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టారు. ఎస్ఎల్‌బిసితో 45 టీఎంసీలు తరలించేలా పనులు జరుగుతున్నాయి. 777 అడుగుల నుంచే లెఫ్ట్ పవర్‌హౌస్ ద్వారా..4 టీఎంసీల నీళ్లు తెలంగాణ ఖాళీ చేస్తున్న పరిస్థితి. మనకు నీళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్నాం. తెలంగాణలో పవర్‌హౌస్ ద్వారా ఇష్టారీతిన నీళ్లు తీసుకుంటున్నారు. తెలంగాణలో లిఫ్ట్‌లు, పవర్‌హౌస్‌తో రోజుకు 8 టీఎంసీలు తీసుకుంటున్నారు. శ్రీశైలం, సాగర్, పులిచింతల పవర్‌హౌస్‌లు తెలంగాణెళి ఆపరేట్ చేస్తోంది. ఓటుకు నోటు కేసులో ఆడియో, వీడియోలతో అడ్డంగా దొరికారు. అందుకే చంద్రబాబు నోరు మెదపలేని పరిస్థితి ఉందని జగన్ ఎద్దేవా చేశారు. మేం వచ్చే నాటికే తెలంగాణలో లిఫ్ట్‌ల పనులు జోరుగా సాగుతున్నాయి. తెలంగాణ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు లేవని వైఎస్ జగన్ పేర్కొన్నారు. చంద్రబాబు దగ్గరుండి రాయలసీమ లిఫ్ట్ ను ఖూనీ చేశారన్నారు. చంద్రబాబు, ఆయన మంత్రి కలిసి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ అక్కర్లేదని మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. స్టెబిలైజింగ్ రిజర్వాయర్లు కట్టకపోతే కుప్పానికే కాదు చిత్తూరు జిల్లాకు తాగునీళ్లు ఉండవని జగన్ తెలిపారు. విద్యుత్ ఛార్జీలు పెంచను అని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు బాదుడే బాదుడుతో ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని తెలిపారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి రెండు ఏళ్ళు గడవక ముందే రాష్ట్రం రూ. 3 లక్షల కోట్లకు పైగా అప్పులు చేసారని తెలిపారు. సంపద సృష్టిస్తానని చెప్పి రాష్ట్రాన్ని అప్పుల దిశగా నడిపిస్తున్న చంద్రబాబు ప్రభుత్వాన్ని ప్రజలు నిలదీయాలని కోరారు. మెడికల్ కాలేజీల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.. కానీ లాభాలు మాత్రం ప్రైవేటు వాళ్లకే. ఇది స్కాం కాక మరేమిటని ప్రశ్నించారు. చంద్రబాబు స్కాంలకు కాదేది అనర్హమని అన్నారు. ఇసుక.. లిక్కర్.. ఆఖరికి రేషన్ బియ్యంలోనూ స్కాంలేనని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను 19 నెలల్లోనే స్కామాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని తెలిపారు. ప్రజల నుంచి దోచుకోవడానికి దొడ్డిదారులు వెతుకుతున్నారని, చార్జీలు, టోల్‌లు, సెస్‌ల పేరుతో ఇష్టమొచ్చినట్లు జనాలపై ఆర్థిక భారం మోపుతున్నారని తెలిపారు. బాదుడుతో సంపద సృష్టిస్తున్నారా అని ప్రశ్నించారు. గతంలో రాయలసీమలో ఉన్న ఏ ప్రాజెక్టునూ పూర్తిగా వాడుకోలేని పరిస్థితులు ఉండేవని, 40ఏళ్ల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులకు పూర్తి స్థాయిలో నీళ్లు నింపలేకపోయారని తెలిపారు. ఎన్జీటి అభ్యంతరాల తర్వాత కేంద్రం నుంచి ఎక్స్పర్ట్ అప్రైజల్ కమిటీ మూడుసార్లు సమావేశమైతే రాష్ట్రం తరఫున చంద్రబాబు కనీసం నోరు మెదపలేదని జగన్ తెలిపారు.

## నదీగర్భంలో రాజధాని ఎలా నిర్మిస్తారు

### అమరావతిపై మరోమారు జగన్ సంచలన వ్యాఖ్యలు

**అమరావతి :** రాజధాని అమరావతిపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోమారు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్‌లో బిల్లు పెడుతున్న సమయంలో వైఎస్ జగన్ ఈ వ్యాఖ్యలలు చేయడం గమనార్హం. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలోజగన్ విలేకర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా నదీగర్భంగా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నారని జగన్ ఆరోపించారు. దీనిని సుప్రీంకోర్టు పరిగణలోకి తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. రాజధాని అనే పదమే లేదని.. సీఎం ఎక్కడ కూర్చొంటే అదే రాజధాని అంటు ఆయన పునరుద్ఘాటించారు. నదీ గర్భంలో భవన నిర్మాణాలకి అనుమతులివ్వరని.. అలాంటింది రాజధాని నిర్మాణం చేపడుతున్నారంటూ సీఎం చంద్రబాబుపై పరోక్షంగా వ్యాఖ్యానించారు. రహదారులు, నీరు, విద్యుత్ సరఫరా లేని ప్రాంతంలో రాజధాని నిర్మాణం అంటూ వైఎస్ జగన్ వ్యంగ్యంగా అన్నారు. సో కాల్డ్ క్యాపిటల్ అంటూ అమరావతిని ఆయన అభివర్ణించారు. అమరావతి రాజధానిగా ఉండడం వల్ల తమకేమీ అభ్యంతరం లేదని ఇటీవల వైసీపీ అధినేత వైఎస్ జగన్ రాజకీయ కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాత తాజాగా వైఎస్ జగన్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. ఇకపోతే రాజధాని అనే పదానికి రాజ్యాంగంలో ప్రత్యేక నిర్వచనం లేదని, భారత రాజ్యాంగంలో 'రాజధాని' అనే పదం ఎక్కడా ప్రస్తావించలేదని ఆయన స్పష్టం చేశారు. 'ప్రభుత్వం ఎక్కడి నుంచి పని చేస్తే.. అదే ఆ రాష్ట్ర రాజధాని' అని పేర్కొన్న జగన్.. శాసనసభ, మంత్రులు, అధికారులు అందరూ అక్కడి నుంచే పాలన సాగిస్తారని, పాలనా వ్యవస్థ మొత్తం అక్కడి నుంచే నడుస్తుందన్నదే రాజధాని అసలైన అర్థం అని వివరించారు. అమరావతి భౌగోళికంగా, మౌలికంగా రాజధానికి అనువైన ప్రాంతం కాదని అన్నారు వైఎస్ జగన్.. విజయవాడ, గుంటూరు నగరాలకు దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో అమరావతి ఉందని, విద్యుత్, నీరు, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు లేని ప్రాంతమని, రోడ్లు, పవర్, వాటర్ కనీస అవసరాలే లేని చోట రాజధాని నిర్మాణం ఎలా సాధ్యం..? అని ప్రశ్నించారు. ఇక, 'రివర్ బేసిన్‌లో భవనాల నిర్మాణానికే అనుమతులు ఉండవు.. అలాంటిది నగరం నిర్మిస్తామనడం సరికాదు' అంటూ జగన్ ప్రభుత్వ నిర్ణయంపై తన అభిప్రాయాన్ని మరోసారి స్పష్టంగా వెల్లడించారు. రాష్ట్ర ప్రజల సౌకర్యం, భద్రత, అభివృద్ధి అవకాశాలను దృష్టిలో పెట్టుకుని రాజధాని నిర్ణయం ఉండాలని, పాలనా కేంద్రం ఎక్కడి నుంచి సమర్థంగా పనిచేస్తుందో అదే రాజధానిగా గుర్తించబడుతుందని పేర్కొన్నారు.

## అమరావతిపై జగన్ అసత్య ప్రచారాలు

మొదటి పేజీ తరువాయి

గర్భంలో నిర్మాణాలు చేస్తున్నామని అసత్య ప్రచారం చేస్తున్నారు. కోర్టుల్లో కేసులు వేయిస్తున్నారు. అక్కడ ఎలాంటి పరిస్థితుల్లో కూడా నిర్మాణాలు జరగవు. నేతలు పూర్తిగా అవగాహన చేసుకుని మాట్లాడాలని సూచించారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను జగన్ అర్థం చేసుకుని స్పందించాలి. మిడి మిడి జ్ఞానంతో మాట్లాడం తప్పన్నారు. రివర్‌బెడ్, రివర్ బేసిన్‌కు తేడా తెలుసుకోవాలి. వాస్తవాలు తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడం తగదుని మంత్రి హితవు పలికారు. రెండో విడత భూ సమీకరణకు రైతులు ముందుకు వస్తున్నారు. గంటల వ్యవధిలో వందల ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చారు. ఇది చూసి ఓర్వలేకే జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. అమరావతి ముందుకెళ్లిపోతోందన్న అసూయతోనే అవాస్తవాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇలాగే వ్యవహరిస్తే.. ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడితే జగన్‌కు ప్రస్తుతం ఉన్న 11 సీట్లు సున్నాకు చేరుకుంటాయని హెచ్చరించారు. ఏ రాష్ట్రానికైనా ఒక రాజధాని ఉంటుంది. ప్రతి జిల్లాకు హెడ్ క్వార్టర్, కలెక్టర్ కార్యాలయం ఉంటాయి. రాజధానిలో మంత్రులు, కార్యదర్శులు, అధికారులు అందరూ ఉండి.. ప్రజల సమస్యలను పరిష్కరిస్తారు. వచ్చే ఏడాదిన్నరలో రాజధానిలో ట్రంక్ రోడ్లు పూర్తి చేస్తాం. రెండున్నరేళ్లలో లేఅవుట్ రోడ్లు పూర్తి చేస్తాం. మూడేళ్లలో ఐకానిక్ భవంతుల నిర్మాణం పూర్తవుతుందని నారాయణ తెలిపారు.

# రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చు

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా




**అదిలాబాద్ జనవరి8( సమయం న్యూస్) :** రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించినప్పుడే అమూల్యమైన మానవ ప్రాణాలను కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు.గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెంబర్ఉ 1లో నిర్వహించిన “2026 జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు” అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రోడ్డు భద్రతపై ప్రదర్శించిన నాటికలు, ఉపన్యాసాలు అందరినీ ఆలోచింపజేశాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు భద్రతపై అవగాహన కేవలం పెద్దలకే కాకుండా చిన్ననాటి నుంచే విద్యార్థులకు కలగాలనే ఉద్దేశంతో పాఠశాలల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతివేగం అత్యంత ప్రమాదకరమని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు వివరించాలని కోరారు. 18 సంవత్సరాల లోపు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. రోడ్డు సంకేతాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. రోడ్డు భద్రతతో పాటు చదువుపై కూడా దృష్టి సారించి, రాబోయే పదవ తరగతి పరీక్షల్లో కష్టపడి చదివి జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులు, విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, మండల విద్యాధికారి సోమయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలాదేవి, కోఆర్డినేటర్ తిరుపతి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సదర్మాట్ బ్యారేజీ మిగిలి ఉన్న పనులు తక్షణమే పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ జనవరి8( సమయం న్యూస్) :** మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న సదర్మాట్ బ్యారేజీకి సంబంధించిన మిగిలి ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

గురువారం జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి కలెక్టర్ సదర్మాట్ బ్యారేజీని పరిశీలించారు. త్వరలో బ్యారేజీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. ప్రారంభోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బ్యారేజీ ఆయకట్టు మీద రహదారి పనులు పూర్తి చేయాలని తెలిపారు. బ్యారేజీ నిర్మాణం దాదాపు పూ- ర్తయిందని, మిగిలి ఉన్న పనులను కూడా ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో అదనపు ఎస్పీ సాయి కిరణ్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, నీటిపారుదల శాఖ అధికారులు, తహసిల్దార్ శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలక్టోరల్ మ్యాపింగ్ పక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్.



**కుక్కునూరు పల్లి జనవరి8( సమయం న్యూస్). :** గురువారం కుకునూరు పల్లి మండల తహసిల్దార్ కార్యాలయం జిల్లా కలెక్టర్ కె హైమావతి సందర్శించి మండలంలోని ఎలక్టోరల్ మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఎలెక్టోరల్ మ్యాపింగ్ 100 శాతం పూర్తి చెయ్యాలి. మండలంలోని అన్ని గ్రామాల్లో సూపర్ వైజర్ లు, బిఎల్ఓ లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణకు సంబంధించిన అన్ని పనులను ఫీల్డ్ స్థాయిలో ఇంటింటి తనిఖీలు వేగవంతం చేయాలని తెలిపారు. రోజు చేసిన మ్యాపింగ్ వివరాలు కంప్యూటర్ లో అప్లోడ్ చేసే ప్రక్రియను పరిశీలించారు.అంతకుముందు కలెక్టరేట్ పక్కనగల ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ క్షత్రస్థాయిలో పరిశీలించారు. నెలవారీ పరిశీలనలో భాగంగా గోదాం చుట్టూ వీక్షించి రక్షణ చర్యలను పరిశీలించారు. లాగ్ బుక్ చెక్ చేసి విజిటర్స్ రిజిస్టర్ లో సంతకం చేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చుట్టు సిసి కెమెరాల పనితీరు, పోలిస్ అధికారులు 24/7 గట్టి బందోబస్తు ఏర్పాటు అలాగే రెవెన్యూ అధికారులు తరుచు గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యవేక్షణ చెయ్యాలని సూచించారు

# ఒక క్షణం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిండు ప్రాణం బలి

- కుటుంబాలకు తీవ్ర విషాదం
- ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు.



**నారాయణపేట, జనవరి,08(సమయం న్యూస్) :** గురువారం తెలంగాణ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవా అధికారి సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన న్యాయ మూర్తి బోయ శ్రీనివాసులు ఆన్ రోడ్ సురక్ష అభియాన్ స్పెషల్ క్యాంపెయిన్ పై ర్యాలీ జిల్లా కోర్ట్ నుంచి సత్యనారాయణ చౌరస్తా వరకు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు మాట్లాడుతూ ఒక క్షణం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిండు ప్రాణం బలి అవుతుందన్నారు.రోడ్డు నియమాలు మీ ప్రాణాలు కుటుంబాల భవిష్యత్తుని కాపాడేందుకు రూపొందించారని గుర్తు చేశారు.రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనల ప్రసంగం నియమాలు స్వేచ్ఛను పరిమితం చేయవని, ప్రాణాలను కాపాడతాయని నొక్కి చెప్పాలి, సిగ్నల్‌లను పాటించడం, వేగ పరిమితులు మరియు హెల్మెట్‌లు/సీట్ బెల్ట్‌లు ధరించడం వంటి ముఖ్య అంశాలను హైలైట్ చేయాలి,అదే సమయంలో ఫోన్లు,మద్యం తాగి వాహనాలు నడపడం మరియు ఆకస్మిక విన్యాసాలు వంటి అంతరాయాలను నివారించాలి, చివరికి క్రమశిక్షణ మరియు అవగాహన ద్వారా డ్రైవర్లు, ప్రయాణీకులు మరియు పాదచారులకు సురక్షితమైన రోడ్లను సృష్టించాలి,తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథరిటీ రూపొందించిన ప్రమాణ పత్రాన్ని చదివి విద్యార్థుల చేత ప్రమాణం చేయించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.ప్రభాకర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మిపతి గౌడ్, ట్రాఫిక్ ఏస్.ఐ కృష్ణ చైతన్య, సీనియర్ మరియు జూనియర్ అడ్వకేట్స్ మరియు న్యాయశాఖ సిబ్బంది, శ్రీ సాయి స్కూల్, లిటిల్ స్టార్స్ స్కూల్, రవితేజ స్కూల్ విద్యార్థులు మరియు స్కూల్స్ ఉపాధ్యాయులు, పోలీసులు ఆధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

- ప్రత్యేక సిలబస్, నాణ్యమైన విద్య
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీం నగర్ జనవరి8( సమయం న్యూస్) :** విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ప్రీ ప్రైమరీ చిన్నారు లకు యూనిఫామ్, పుస్తకాలు, స్టేషనరీ కిట్ అందజేశారు.ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 33 ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించామని తెలిపారు. నైపుణ్యం గల శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నాణ్యమైన బోధనను అందిస్తారని అన్నారు. ప్రత్యేక సెలబస్ ద్వారా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే పూర్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత, నాణ్యమైన విద్య అందుతోందని యూనిఫాం, పుస్తకాలు వంటివి ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ప్రీ ప్రైమరీ చిన్నారులకు ఉచితంగా షూ అందజేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రీ ప్రైమరీ స్కూళ్లలో పిల్లల నమోదు, హాజరు పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు,ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు.

## మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శన

పర్లపెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. మూడవ తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. రోజు చదవడం, రాయడం తప్పనిసరిగా అలవర్చుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు పాఠాన్ని చెప్పడమే కాకుండా విషయాన్ని అర్థం చేయించడం చాలా ముఖ్యమని తెలిపారు. బుధవారం బోధనను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సూరం స్వప్న, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ ఎం మంజుల పాల్గొన్నారు.

# బచ్చన్నపేటలో ఫర్టిలైజర్ షాప్ లను సందర్శించి.

- రైతుల తో నేరుగా మాట్లాడిన కలెక్టర్
- యూరియా కొరత లేదు
- యాప్ అమలుపై రైతుల సంతృప్తి
- నిరంతర పర్యవేక్షణ చేయాలి
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**బచ్చన్న పేట జనవరి8( సమయం న్యూస్) :** జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం బచ్చన్నపేట మండలంలో పర్యటించి, యాసంగి సీజన్‌లో రైతులకు యూరియా ఎరువుల సరఫరా, పంపిణీ పరిస్థితులు, యూరియా బుకింగ్ యాప్ అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్... హాకా గోపాల్ నగర్, పీఏసీఎస్ బచ్చన్నపేట, ఎంజీసీ బచ్చన్నపేట కేంద్రాలను సందర్శించి అక్కడి నిల్వలు, అమ్మకాలు, బుకింగ్ విధానం, రైతులకు అందుతున్న సేవలపై సమగ్రంగా సమీక్షించారు.గురువారం నాటికి అందుబాటులో ఉన్న ప్రారంభ యూరియా నిల్వలను అధికారులు కలెక్టర్ కి వివరించారు. పీఏసీఎస్ బచ్చన్నపేటలో 1067 బ్యాగులు, ఎంజీసీ బచ్చన్నపేటలో 333 బ్యాగులు, హాకా గోపాల్ నగర్‌లో 444 బ్యాగులు నిల్వలుగా ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్... మూడు కేంద్రాలలో ఉన్న రైతులను యూరియా బుకింగ్ యాప్ అమలుపై అభిప్రాయాలను తెలుసుకోగా.. ..యాప్ ద్వారా ముందుగానే బుకింగ్ చేసుకోవడం వల్ల వరుసలో నిలబడాల్సిన అవసరం లేకుండా, సమయం వృథ కాకుండా సులభంగా యూరియా పొందగలుగుతున్నామని రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. యాప్ అమలుతో పారదర్శకత పెరిగిందని, అనవసరమైన గందరగోళం తగ్గిందని రైతులు తెలిపారు.అలాగే రైతులు పండిస్తున్న పంటల గురించి కలెక్టర్ అడగగా... కోతుల బెడద కారణంగా వేరుశనగ, చిరుధాన్యాలు వంటి ఇతర పంటలను సాగు చేయలేకపోతున్నామని, ప్రధానంగా వరి పంటనే సాగు చేస్తున్నామని ఎక్కువ మంది రైతులు తెలిపారు. ఈ సమస్యపై సంబంధిత శాఖల అధికారులను సమన్వయం చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు.జనగామ జిల్లాలో యూరియా నిల్వల పరిస్థితిపై కలెక్టర్ కి వ్యవసాయ అధికారులు విపులంగా వివరించారు. ప్రస్తుతం జిల్లాలో రోజుకు సగటున సుమారు 7500 బ్యాగుల యూరియా అమ్మకాలు జరుగుతున్నాయని, యూరియా బుకింగ్ యాప్‌కు రైతుల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని తెలిపారు. యాప్‌లో నమోదవుతున్న బుకింగ్స్ సంఖ్య రైతుల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోందని పేర్కొన్నారు.కేంద్ర రిజర్వ్ పూల్ (జక్రా) నుండి జనగామ జిల్లాకు 2000 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయింపు జరిగిందని అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా మార్క్‌ఫెడ్‌కు 29,333 బ్యాగుల యూరియాకు ఇండెంట్ ఇవ్వగా, ఇప్పటికే 12,888 బ్యాగులు జిల్లాకు చేరాయని తెలిపారు. మిగిలిన 16,445 బ్యాగులు ఒక రోజులో జిల్లాకు చేరనున్నాయని పేర్కొన్నారు. అదనంగా బఫర్ స్టాక్‌లో ఉన్న 15,111 బ్యాగులకు ఈ రోజే ఇండెంట్ ఇవ్వగా, అవి శనివారానికి జిల్లాకు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ఇదే సమయంలో ప్రైవేట్, మార్క్‌ఫెడ్ ద్వారా మరిన్ని రేకులు జిల్లాకు రానున్నాయని, అందువల్ల జిల్లాలో యూరియా కొరతకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... యూరియా పంపిణీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగాలని, యూరియా బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే అమ్మకాలు జరగాలని అధికారులకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సమయంలో అవసరమైన పరిమాణంలో యూరియా అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. జిల్లాలో తగినంత యూరియా నిల్వలు ఉన్నందున రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు.ఈ పరిశీలన కార్యక్రమం లో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని, వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# సి ఎం కప్ టార్చ్ ర్యాలీని ప్రారంభించిన భూక్యా మురళీ నాయక్..

**మహబూబాబాద్ జనవరి 08( సమయం న్యూస్,). :** "ముఖ్యమంత్రి కప్ టార్చ్ ర్యాలీ" జిల్లా కలెక్టరేట్ నుండి ప్రారంభం ఈ కార్యక్రమానికిబి ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించిన మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, అదనపు కలెక్టర్ (స్థానిక




సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, పాల్గొన్న జిల్లా విద్యాశాఖ అధికారి రాజేశ్వర్,లి జిల్లా యువజన క్రీడల శాఖ అధికారిని ఓ.జ్యోతి, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసరావు, క్రీడాకారులు, విద్యార్థిని, విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డ్రైవింగ్ సమయంలో భద్రతా నియమాలు పాటించండి

- స్పీడో మీటర్లకు అమ్మ నాన్న స్టిక్కర్లను అంటించండి
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి



**నారాయణపేట, జనవరి,08(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రం లో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో పాల్గొన్నారు రాష్ట్ర క్రీడా, పశు సంవర్ధక,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి.జనవరి 1 నుండి ప్రారంభం అయిన ఈ కార్యక్రమంలో విద్యార్థులచే మంత్రి ప్రతిజ్ఞ చేయించారు.ఈ సందర్బంగా విద్యార్థులనుద్దేశించి మంత్రి మాట్లాడుతూ.....మన దేశం లో ప్రతీ సెకండ్ కు ఒక ఆక్సిడెంట్ జరుగుతుందని, భద్రతా నియమాలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాల నుండి తప్పించుకోగల్గుతామని తెలిపారు. పేరెంట్స్ డ్రైవింగ్ చేసేటప్పుడు పిల్లలను, యువకులు డ్రైవింగ్ చేసేటప్పుడు ఇంట్లో తల్లిదండ్రులను గుర్తు పెట్టుకోవాలన్నారు. ఆక్సిడెంట్ వల్ల తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్ ను దేశ జట్టులో ఆడే అవకాశం కోల్పోయానని మంత్రి తన స్వీయ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. మనం భద్రతా నియమాలు పాటించినా ఎదుటి వారు సేఫ్టీ గా రాకపోతే ఇరువురికి ప్రమాదమని తెలిపారు. మన శరీరం లో ప్రతీ అవయవం ముఖ్యమని అందుకే మనం డ్రైవింగ్ చేసేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం వంటి సేఫ్టీ నియమాలు పాటించాలన్నారు. బైక్ లు నడిపేటప్పుడు స్పీడో మీటర్ లకు అమ్మా, నాన్న అని ఉండే విధంగా స్టికర్లను అంటించాలని రవాణా అధికారులకు సూచించారు. లక్ష స్టికర్లకు తానే స్వయంగా డబ్బులు ఇస్తానని, వాటిని ప్రింట్ చేయించి ప్రతీ బైక్ కు అంటించాలని అధికారులను ఆదేశించారు.యువకులు బైక్ లపై స్టంట్లు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కోట శ్రీనివాసరావు,బాబు మోహన్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,అజహరుద్దీన్ వంటి ప్రముఖుల కుమారులు కూడా రోడ్డు ఆక్సిడెంట్ లో మృత్యువాత పడ్డారని మంత్రి గుర్తు చేశారు.

# ఈవీఎం గోడౌన్ ను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్, జనవరి 08( సమయం న్యూస్).:** జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ గురువారం సందర్శించారు. సాధారణ పరిశీలన ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయి సందర్శన జరిపారు. ఈవీఎం గోడౌన్ కు వేసిన సీళ్లను పరిశీలించారు. ఈవీఎం గోడౌన్ వద్ద పోలీసు బందోబస్తు తీరును గమనించి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ అగ్ని మాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజు, సిబ్బంది సాత్విక్, విజయేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# మహిళాఉశిశు అభివృద్ధికి PANKHUD (పంకుడి) డిజిటల్ పోర్టల్ ప్రారంభం

**న్యూఢిల్లీ, జనవరి 8,( సమయం న్యూస్).:** కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ PANKHUDI అనే సమగ్ర డిజిటల్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఈ పోర్టల్‌ను కేంద్ర మంత్రి శ్రీమతి అన్నపూర్ణ దేవి ప్రారంభించారు.జూ= సంస్థలు, ఎన్‌జీఓలు, కార్పొరేట్లు, వ్యక్తులు ఒకే వేదికపై మహిళలు, పిల్లల సంక్షేమ కార్యక్రమాలకు భాగస్వాములు కావడమే ఈ పోర్టల్ లక్ష్యం. పారదర్శకత, బాధ్యత, నగదు రహిత లావాదేవీలతో ప్రభుత్వంతో భాగస్వామ్యాన్ని సులభతరం చేస్తుంది.

పోషణ్ 2.0, మిషన్ వత్సల్య, మిషన్ శక్తి వంటి పథకాల అమలుకు ఈ పోర్టల్ తోడ్పడనుంది. దీని ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలు, బాలల సంరక్షణ సంస్థలు, వన్ స్టాప్ సెంటర్ల సేవలు మరింత మెరుగవుతాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

# శాఖపరమైన సమస్యలపై పరిపాలన విభాగం తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



**హన్మకొండ జనవరి08( సమయం న్యూస్). :** పోలీస్ అధికారులు, సిబ్బందికి సంబంధించిన శాఖపరమైన సమస్యలపై పరిపాలన విభాగం తక్షణమే స్పందించాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగం వరంగల్ పోలీస్ కమిషనర్ గురువారం పరిపాలన విభాగం కార్యాలయములో తనిఖీలు చేపట్టారు. తనిఖీలు సిపిఓ కార్యాలయమునకు చేరుకున్న కమిషనర్‌కు అధికారులు పుష్పగుచ్చాలను అందజేసి స్వాగతం పలకగా, సాయుధ పోలీసులు గౌరవ వందనం చేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ పరిపాలన విభాగం కార్యాలయములోని బడ్జెట్, ఎస్టాబ్లిష్‌మెంట్, పే, జనరల్ సెక్షన్లతో పాటు యం,ఎస్ సెక్షన్లు, ఇన్‌వర్డ్, ఆవుట్ వర్డ్‌లను పోలీస్ కమిషనర్ సందర్శించి సంబంధిత సెక్షన్ అధికారులు నిర్వహిస్తున్న విధులు అలాగే అ సెక్షన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది విధులకు సంబంధించిన పలు రికార్డులను పోలీస్ కమిషనర్ తనిఖీ చేసారు. ముఖ్యంగా సిబ్బందికి సంబంధించి శాఖపరమైన సమస్యలపై వచ్చిన దరఖాస్తులపై సంబందిత సెక్షన్ అధికారులు తీసుకుంటున్న చర్యల వివరాలకు చెందిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ పరిపాలన విభాగం సజావుగా కోనసాగేందుకు సంబంధిత అధికారులకు పలుసూచనలు అందజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అధికారుల మధ్య ఏలాంటి అలస్యం లేకుండా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగిపోవాలని, పరిపాలన పరంగా ఎలాంటి సమస్యలు వచ్చిన తన దృష్టికి తీసుకరావాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు.ఈ తనిఖీల్లో అదనపు డిసిపి రవి, పరిపాలన విభాగం ఏ.ఓ సంపత్, సెక్షన్ సూపరింటెండెంట్లు రమేష్,యాకూబ్ బాబా,సంధ్య, జలజ,రమాదేవి,సురేందర్‌తో పాటు ఇతర పరిపాలన సిబ్బంది పాల్గోన్నారు.

# టీఎస్పిసిడిఎల్ అధికారులతో కలిసి వినాయక నగర్ శుభాకాంక్షలు మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ బస్తీ బాట



**మల్కాజిగిరి జనవరి8( సమయం న్యూస్).:** ఈరోజు మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్, టిఎస్పిఎస్పి డిఎల్ అనగా విద్యుత్ శాఖ యొక్క డి. ఈ అన్వర్ భాష మరియు ఇతర అధికారులతో కలిసి బలరాం నగర్ డివిజన్ లోని కృపా కాంప్లెక్స్, ఓల్డ్ నేరెడ్మేట్, భగత్ సింగ్ నగర్ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి పెండింగ్లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిశీలించడం జరిగినది. ముఖ్యంగా కృపా కాంప్లెక్స్ లో పాడైపోయిన విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చాలని, ఎల్బీనగర్ లో వంగిపోయి ఉన్నటువంటి విద్యుత్ స్తంభానికి నూతన నూతన స్తంభాలతో రీప్లేస్ చేయాలని డి అన్వర్ భాషా గారు సదరు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భగత్ సింగ్ నగర్ లో రోడ్డు మధ్యలో ఉన్నటువంటి సిమెంట్ పోల్లను రోడ్డు పక్కగా షిఫ్ట్ చేయాలని కోరగా పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు డి ఈ అంబర్ భాషా గారు సూచించారు. ఈ సందర్భంగా మల్కాజ్గిరి కార్పొరేటర్ శ్రవణ్ నూతన ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడిఈ చంద్రశేఖర్, ఏఈ క్రిస్టినా, పలువురు విద్యుత్ లైన్మెన్లు అధికారులు బిజెపి నాయకులు నందు యాదవ్,మురళి గౌడ్, పవన్,సంతోష్ మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల పథకం పై ముగిసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ









**మక్తల్, మున్సిపల్,(మం)జనవరి,08(సమయం న్యూస్):** పథకంతో పర్యావరణానికి ఎలాంటి ముప్పు లేదని ముక్తకంఠంతో ఏకాభిప్రాయం తెలిపిన ప్రజా ప్రతినిధులు, రైతులు,రైతు సంఘాల సభ్యులు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి దామరగిద్ద తండా లో గురువారం ఏర్పాటు చేసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. మూడు నియోజకవర్గాల నుంచి మూడు నియోజకవర్గాలలోని 7 మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, రైతు సంఘాల నాయకులు, విశ్రాంత ఉద్యోగులు, రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి అందరూ ముక్త కంఠంతో నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఎలాంటి పర్యావరణ ముప్పు, విఘాతం లేదని, వీలైనంత తొందరగా ఆ పథకానికి పర్యావరణ అనుమతులు ఇచ్చి ప్రారంభించాలని ఏకాభిప్రాయాన్ని తెలియ జేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(పి సి బి) హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం నుంచి ఈ ఈ సురేష్ హాజరు కాగా జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, నీటి పారుదల శాఖ ఎస్. ఈ శ్రీధర్ పాల్గొన్నారు.పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ లో భాగంగా ఏడు మండలాల నుంచి వచ్చిన వందలాది మంది సమక్షంలో 28 మంది వక్తలు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. అందరూ మక్తల్ నారాయణపేట కోడంగల్ ఎత్తిపోతల పథకం పనులను తొందరగా ప్రారంభించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని, ఆ పథకం పూర్తి చేసి సాగు, తాగునీరు అందించాలని కోరారు. ఆ పథకం చేపడితే పర్యావరణానికి వచ్చే నష్టం ఏమీ లేదని, గాలి, నీరు, వాతావరణ కాలుష్యం ఏమీ జరగదని తేల్చి చెప్పారు. ఆ పథకం పూర్తి అయితే పర్యావరణం ఇంకా మెరుగు అవుతుందని తెలిపారు. వెంటనే పథకం ప్రారంభించేందుకు పర్యావరణ అనుమతులు ఇవ్వాలని అధికారి సురేష్ ను వారు కోరారు. చివర్లో అధికారి సురేష్ మాట్లాడుతూ.. పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో వచ్చిన అభిప్రాయాలన్నింటిని నమోదు చేసుకున్నామని, మొత్తం కార్యక్రమాన్ని వీడియో చిత్రీకరణ చేయడం జరిగిందని, మీటింగ్ మినిట్స్ తో పాటు వీడియో ను కాలుష్య నియంత్రణ మండలి కి సమర్పిస్తామని తెలిపారు. ఆ పథకంలో ఊట్కూర్ గ్రామం ముంపునకు గురయ్యే ఆస్కారమే లేదని, ఊట్కూరు మండల పరిసరాలలో సంచరించే జింకలను సంరక్షణ కేంద్రానికి తరలించేందుకు బడ్జెట్ కేటాయించడం జరిగిందని నీటి పారుదల శాఖ ఎస్. ఈ. శ్రీధర్ ఓ ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జీ కుంభం శివకుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఈ ఈ బ్రహ్మానందరెడ్డి, పర్యావరణ కన్సల్టెన్సీ కరీముల్లా, దామరగిద్ద తహసిల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో జయలక్ష్మ, దామరగిద్ద తండా సర్పంచ్ శరణ్ నాయక్, దామరగిద్ద సర్పంచ్ అద్దన్ కనికి రెడ్డి, బాపన్ పల్లి శ్రీను, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, రైతులు రైతు సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రీలిఫండ్ చెక్కులను అందచేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే .



**మల్కాజ్‌గిరి సమయం న్యూస్ జనవరి 8. :** మల్కాజ్‌గిరి శాసనసభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను తమ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులైన,జహీదా బేగం గారికి రూ. 33,000/-సుమాయా బేగం గారికి రూ. 24,000/-విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు.ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న పేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయుక్తంగా మారిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం అందేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

# ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ మాఫీతో జీహెచ్‌ఎంసీ వన్ టైమ్ సెటిల్‌మెంట్ పథకం

- ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి: జీహెచ్‌ఎంసీ

**హైదరాబాద్, జనవరి 8( సమయం న్యూస్). :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఞూ) పథకం 2025ఉ26ను కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీలో 90 శాతం మాఫీ లభించనుంది.ఈ పథకం ప్రకారం, పన్ను చెల్లింపుదారులు పూర్తి ప్రిన్సిపల్ ట్యాక్స్‌తో పాటు కేవలం 10 శాతం వడ్డీ మాత్రమే ఒక్కసారి చెల్లిస్తే, మిగిలిన 90 శాతం వడ్డీ పూర్తిగా మాఫీ చేయబడుతుంది. దీని ద్వారా దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలను సులభంగా పరిష్కరించుకునే అవకాశం కలుగుతుంది.

పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నగరాభివృద్ధికి సహకరించాలని జీహెచ్‌ఎంసీ విజ్ఞప్తి చేసింది. ఞూ పథకం కింద చెల్లింపులు వీఎ+ఎవీజ యాప్, మీ సేవ కేంద్రాలు, జీహెచ్‌ఎంసీ సిటిజన్ సర్వీస్ సెంటర్లు (జూజం) మరియు ఆన్‌లైన్ విధానాల ద్వారా చేయవచ్చు.సకాలంలో ఆస్తి పన్ను చెల్లించడం ద్వారా నగర మౌలిక సదుపాయాలు, పౌర సేవలు మరింత బలోపేతం అవుతాయని అధికారులు తెలిపారు.

# ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య



**నారాయణపేట, జనవరి,08(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో రోడ్ సురక్ష అభియాన్ఉ2026 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రతకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి, అనంతరం రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.అదేవిధంగా ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమాలకు సంబంధించిన స్టిక్కర్లను అందజేసి, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై కృష్ణ చైతన్య మాట్లాడుతూ.వాహనదారులు హెల్మెట్, సీటుబెల్ట్ ధరించడం తప్పనిసరిగా పాటించాలని, వేగ నియంత్రణతో పాటు మద్యం సేవించి వాహనం నడపకూడదని హెచ్చరించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గి ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు.ప్రత్యేకంగా విద్యార్థులు చిన్న వయసులోనే రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించుకుని, కుటుంబ సభ్యులకు కూడా ఈ సందేశాన్ని చేరవేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది,ఆటో డ్రైవర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు ఫిర్యాదు చేసిన కమ్మరి శ్రీను




**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 8 :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని వార్డులలో ఓటర్ల విభజనకు సంబంధించిన అంశంలో తీవ్ర అవకతవకలు నెలకొన్న నేపథ్యంలో గురువారం రోజు గజ్వేల్ 6వ వార్డు నుంచి కమ్మరి శ్రీను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ని కలిసి సంబంధిత ఆధారాలతో కూడిన వినతి రిప్రజెంటేషన్ పత్రాన్ని గజ్వేల్ పరిధిలోని వార్డులలో నివసిస్తున్న ఓటర్లను ఆయా వార్డులకు కాకుండా మిగతా వార్డులలో బదిలీ చేయడం అంశంపై తీవ్రమైన వ్యతిరేకతను తెలుపుతూ వినతి పత్రాన్ని అందజేసి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులలో నివసిస్తున్న ఓటర్లను అదే వార్డులో ఓటరుగా గుర్తించి ఆమోదించాలని తద్వారా ఎన్నుకోబడే ప్రజాప్రతినిధులకు ఆయా వార్డులలోని నివసిస్తున్న ప్రజలకు పరిపాలన సౌలభ్యం సమస్యలపై ప్రశ్నించే అధికారం ఉంటుందని తెలిపారు. ఇట్టి విషయంపై స్పందించిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం సిద్దిపేట జిల్లా కలెక్టర్ కి సంబంధిత అధికారులకు సమస్య పరిష్కారం కోసమై ఆదేశాలు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇట్టి సమస్య పరిష్కరించబడని పరిస్థితులలో అవసరమైతే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టడంతో పాటు అవసరమైతే తెలంగాణ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించి పిటిషన్లు దాఖలు చేసి ఓటర్లకు న్యాయం జరిగే అంతవరకు న్యాయపోరాటం చేస్తాము అని తెలియజేశారు

## సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికులకు స్పెషల్ బస్సులు



- పరిగి ఆర్టీసీ డిపో మేనేజర్ కే. కృష్ణమూర్తి

**పరిగి మున్సిపల్(మం)జనవరి,08(సమయం న్యూస్) :** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రయాణికుల సౌకర్యార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా పరిగి డిపో నుండి హైదరాబాద్‌కు, అలాగే అక్కడి నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం తదితర ప్రధాన ప్రాంతాలకు ప్రత్యేక (స్పెషల్) బస్సు సర్వీసులు నడపడం జరుగుతున్నట్లు పరిగి డిపో మేనేజర్ కే. కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఈ ప్రత్యేక సేవలను సద్వినియోగం చేసుకొని, తమ ప్రయాణ టికెట్లను ముందుగానే ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవాలని సూచించారు. టికెట్ బుకింగ్ కోసం www.tgsrtc.telangana. gov.in వెబ్‌సైట్‌ను వినియోగించుకోవచ్చని తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణికులందరూ సుఖవంతమైన మరియు సురక్షతమైన ప్రయాణం చేయాలని పరిగి డిపో మేనేజర్ కే. కృష్ణమూర్తి ఆకాంక్షంచారు.

## దాతల సహకారం పాఠశాలల అభివృద్ధికి ఎంతో అవసరం

- మండల విద్యాధికారి
- పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తాం గ్రామ సర్పంచ్



**పరిగి మండలం, జనవరి,08(సమయం న్యూస్) :** పాఠశాలల అభివృద్ధికి విద్యార్థుల విద్యా ప్రగతికి దాతల సహకారం ఎంతో అవసరమని పరిగి మండల విద్యాధికారి ఏం గోపాల్ తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని ప్రాథమిక పాఠశాల మిట్ట కోడూరులో ప్రధానోపాధ్యాయులు ఉస్మాన్ అలీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మిట్ట కోడూర్ గ్రామానికి చెందిన డాక్టర్ గఫార్ విద్యార్థినీ విద్యార్థులు ఆడుకోవడానికి పదివేల రూపాయలు విలువచేసే వివిధ ఆట వస్తువులను పాఠశాలకు విరాళంగా అందజేశారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విద్యాధికారి మాట్లాడుతూ దాతల సహకారం చిరస్థాయిగా ఉంటుందని తెలియజేశారు. గ్రామ సర్పంచ్ పి మాణిక్యం మాట్లాడుతూ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో నిరంతరం కృషి చేస్తున్నారని పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలియజేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ కన్వీనర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థుల ప్రగతి కోసం కృషి చేస్తామని తెలియజేశారు. ఆట వస్తువులు విరాళంగా అందజేసిన డాక్టర్ గఫార్ ని మండల విద్యాధికారి, సర్పంచ్ ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు ఇట్టి కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేశం, గ్రామ మాజీ సర్పంచ్ జగదీశ్వర్, మాజీ ఎంపీటీసీ జహంగీర్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుద్ధదేవ్, గడిసింగాపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్ జాంప్లా, శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ నర్సింలు, కవిత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## సమగ్రశిక్షను విద్యాశాఖలో విలీనం చేసి. ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరణ చేయాలి

- గట్యానాయక్, బీఎంపీ పార్టీ జిల్లా అధ్యక్షులు.




**పరిగి మండలం, జనవరి,08(సమయం న్యూస్) :** పరిగి పట్టణ కేంద్రములో మండల విద్యాశాఖాధికారి గోపాల్ నాయక్, వికారాబాద్ జిల్లా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ను బీఎంపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్, ఎల్ హెచ్ పీ ఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పాండునాయక్, బీఎంపీ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు హరి నాయక్ చేతుల మీదుగా సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతావత్ గాంగ్యనాయక్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఎంపీ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు గట్యానాయక్ మాట్లాడుతూ సమగ్రశిక్ష ను విద్యాశాఖలో విలీనం చేయాలని, సమగ్రశిక్ష కాంట్రాక్టు ఉద్యోగులందరినీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీ ఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ నాయక్ నాయకులు యం. రవీందర్ నాయక్, జిల్లా కార్యదర్శి రవీందర్ నాయక్,ఆయా ఉపాధ్యాయ సంఘం బాధ్యులు బుగ్గయ్య, వెంకటయ్య, బుచ్చి లింగం, ఖాజా, బుచ్చయ్య, ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీశైలం, మోహన్ బాబు, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఎల్ హెచ్ పీ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్ గురించి కలలు కనండి సాకారం చేసుకోండి.

- మంచి వ్యక్తులతో స్నేహం చేసి ఉన్నత లక్ష్యన్ని చేరుకోవాలి.....
- డ్రగ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్ గా మారాలి
- డ్రగ్స్ ఉపయోగించి బంగారు భవిష్యత్తు ను నాశనం చేసుకోవద్దు
- డ్రగ్ ఫ్రీ సూర్యాపేటకొరకు కృషి చేయాలి....
- డ్రగ్స్ కి వ్యతిరేకంగా కదం తొక్కిన యువత... డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో మారుమోగిన సూర్యాపేట పట్టణ వీధులు
- డ్రగ్ ఫ్రీ ఇండియా ర్యాలీ కి వేలాదిగా తరలి వచ్చిన విద్యార్థులు,



**సూర్యాపేట జనవరి 08( సమయ్దం న్యూస్).:** విద్యా ర్థులు బంగారు భవిష్యత్ నిర్మించుకునేందుకు కలలను కని వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మ శారద అన్నారు. జాతీయ యువజన దినోత్సవం లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో గురువారం సూర్యాపేట పట్టణంలో ని కోర్ట్ భవనం నుండి సంతోష్ బాబు చౌరస్తా మీదుగా పి ఎస్ ఆర్ సెంటర్ నుండి పోస్ట్ ఆఫీస్ మీదుగా జూనియర్ కళాశాల వరకు డ్రగ్ ఫ్రీ ఇండియా అవగాహనా ర్యాలీలో జిల్లా ఎస్పి కే నరసింహ, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ లతో కలిసి జిల్లా ప్రిన్సిపల్ సెషన్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ లక్ష్మ శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సభలో జిల్లా జడ్జి మాట్లాడుతూ డ్రగ్స్ అనే మహమ్మారి చాప కింద నీరులా వ్యాపించి యువత జీవితాలను నిర్వీర్యం చేస్తుందని వాటిని సమాజం నుండి నిర్మూలించేందుకు జిల్లాలోని పరిపాలన, పోలీస్, న్యాయ శాఖలు కృషి చేస్తున్నాయని అన్నారు. డ్రగ్స్ ఉపయోగించడం వల్ల మనసు,శరీరం,వ్యక్తిత్వం నిర్వీర్యం చెంది తప్పుడు పనులు చేసేలా ప్రేరేపిస్తాయని వాటి వల్ల మనకి ఎలాంటి ఉపయోగం లేదని ఆరోగ్యానికి హానికరం అని మాదకద్రవ్యాలు, గంజాయి లాంటి వాటిని తయారు చేసిన, రవాణా చేసిన, సేవించిన,అమ్మినా, కొనుగోలు చేసిన, తెలియక చేసిన నేరమవుతుందని ఎన్ డి ఎస్ ఏ యాక్ట్ ప్రకారం నేరమవుతుందని బయటికి రావడానికి కూడా బెయిల్ కూడా ఇవ్వకుండా శిక్షలు విధించడం జరుగుతుందని, 20 సంవత్సరాల నుంచి యావజీవ శిక్ష పడేలా కఠిన శిక్షలు ఉంటాయని తెలిపారు. మాదకద్రవ్యాలు తెలియక చేదించిన, బానిసైన వారి కొరకు రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి డాక్టర్ల ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించి వారిని మాదకద్రవ్యాల నుండి బయట పడేసి యధావిధిగా జీవితం కొనసాగించేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ న్యాయ సహాయం చేస్తుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. జీవితంలో స్నేహితుల పాత్ర చాలా గొప్పదని జయాల్లో,అపజయాల్లో నేనున్నానంటూ వెన్ను తట్టే మంచి స్నేహితులు ఉంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు అని, అదే తప్పుడు స్నేహం అలవాటు అయితే చెడు మార్గాలలో వెళ్లి జీవితాలను నాశనం అవుతాయని తెలిపారు. మాదకద్రవ్యాలు పాఠశాలలో, కళాశాలలో చాక్లెట్స్ రూపంలో తయారుచేసి డ్రగ్స్ కు యువత ఎడిక్ట్ అయ్యేలా చేసి డ్రగ్స్ కు అలవాటు పడి తప్పుడు మార్గాలలో నేరాలు చేసేలా ప్రేరేపిస్తున్నారని వాటి నుంచి మనం ముందుగానే మేల్కొని చుట్టుపక్కల ఎక్కడైనా మాదకద్రవ్యాలు కనిపిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలని డ్రగ్ ఫ్రీ సూర్యాపేట నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జన్మదినం సందర్భంగా భారతదేశంలో డ్రగ్స్ ను దూరం చేయుటకు డ్రగ్ ఫ్రీ ఇండియా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని డ్రగ్స్ ఉపయోగించడం వల్ల జీవితాలు,కుటుంబాలు ఆగమయవుతున్నాయని డ్రగ్స్ అమ్మకం ద్వారా వచ్చిన డబ్బులు సమాజంలో కలహాలు సృష్టించి అభివృద్ధి చెందకుండా చేసేందుకు ఉపయోగిస్తున్నారని తెలిపారు. పాఠశాలలో, కళాశాలలోని టీచర్స్ లెక్చరర్స్ విద్యార్థుల యొక్క ప్రవర్తన, అలవాట్ల పై నిఘా పెట్టాలని,మంచి ఆలోచనలు ఆచరణలోకి తీసుకొచ్చి కార్యాచరణగా అయి మంచి అలవాట్లుగా మారి మంచి క్యారెక్టర్ నిర్మించి మన గమ్యాన్ని చేర్చుతాయని తెలిపారు. విద్యార్థులకు కథ రూపంలో చెడు స్నేహం చేయటం ద్వారా డ్రగ్స్ ఉపయోగించటం వల్ల కలిగే నష్టాలను, మంచిగా చదవటం వల్ల కలిగే లాభాలను ఆసక్తి కలిగించేలా చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో నేడు డ్రగ్స్, గంజాయి ఉపయోగిస్తున్నారని వాటిని సమాజం నుండి తొలగించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీయనుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఎస్ పి కే నరసింహ మాట్లాడుతూ యువత భారతదేశ గొప్ప వనరులని, బావి భారత పౌరులని సమాజం నుండి గంజాయి, డ్రగ్స్ తొలగించేందుకు విద్యార్థులే ప్రచారకర్తలుగా అంబాసిడర్ గా మారాలని కోరారు. డ్రగ్స్, గంజాయి అమ్మిన, కొనుగోలు చేసిన చట్టరిత్యా నేరమని కఠినమైన శిక్షలు పడతాయని, వాటిని సేదించటం వల్ల ఆరోగ్యం నాశనం అవుతుందని ఇలా చాలామంది మధ్యలోనే జీవితాలు కోల్పోతున్నారని అన్నారు. డ్రగ్స్, గంజాయి మహమ్మారి ని సమాజం నుండి కుక్కటివేళ్ళతో తీసివేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం జిల్లా ఎస్పి అందరిచే ప్రతిజ్ఞ చేపించారు. అనంతరం ఫ్లెక్సీ పై సంతకాలు చేశారు. డ్రగ్స్ ఫ్రీ ఇండియా ర్యాలీకి విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో సూర్యాపేట పట్టణ వీధులు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ఫర్హీన్ కౌసర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రజిత గోపు, ఫస్ట్ ఎడిషనల్ జూనియర్ జడ్జి అపూర్వ రవళి, సెకండ్ ఎడిషనల్ జూనియర్ జడ్జి మంచాల మమత,బార్ అసోసియేషన్ చైర్మన్ లింగయ్య, సెక్రటరీ రాజు,ఆర్ డి ఓ వేణుమాధవ్, డీఎస్పీ ప్రసన్నకుమార్, జిల్లా అధికారులు, ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు హాజరైనారు.

# తెలంగాణ జాగృతిలో ఉద్యమ కారుల సంక్షమ అధ్యయన కమిటీ ఏర్పాటు!

- తెలంగాణ ఉద్యమ కారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి
- కమిటీ సభ్యుడిగా ఉద్యమ నాయకుడు తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డికి సారథిగా బాధ్యతలు అప్పగించిన వ్యవస్థాపక అధ్యక్షరాలు కవితమ్మ
- భవిష్యత్ మ్యానిఫెస్టోకు పునాది



**హైదరాబాద్, జనవరి 8(సమయం న్యూస్) :** తెలంగాణ జాగృతి నూతన ప్రాంతీయ రాజకీయ పార్టీగా రూపు దిద్దుకునే దిశగా కీలక అడుగులు వేస్తోంది. పార్టీ ఏర్పాటు నేపథ్యంలో ప్రజల సమస్యలను లోతుగా అధ్యయనం చేసేందుకు తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షరాలు కల్వకుంట్ల కవితమ్మ సుమారు 30 అంశాలతో కూడిన అధ్య యన కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల సమస్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కమిటీలో ఉద్యమ నాయకుడు తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి సభ్యుడిగా, సారథిగా ఎంపిక చేశారు. తెలంగాణలో ఉన్న వేలాదిమంది ఉద్యమ కారులు ఎదుర్కొంటున్న సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేయడం ఈ కమిటీ ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. తెలంగాణ రాష్ట్ర సాధనలో అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారుల సంక్షమం, వారి కుటుంబాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ జాగృతి సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా నేడు ప్రత్యేకంగా ఉద్యమకారుల సంక్షమ అధ్యయన కమిటీ" ని ఏర్పాటు చేసినట్లు తెలంగాణ జాగృతి ఒక ప్రకటనలో తెలిపింది.

కప్పాటి పాండురంగారెడ్డి నేతృత్వంలో ఈ కమిటీతెలంగాణ ఉద్యమకారులు ఎదురుకొంటున్న సమస్యలు ప్రభుత్వ హామీలు వారి స్థితి గతులు, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయిన తరువాత కూడా నెరవేరని న్యాయ బద్ధమైన అంశాలపై విస్తృతంగా అధ్యయనం చేయనుంది. ఈ అంశాలన్నింటి నీ భవిష్యత్ తెలంగాణ జాగృతి పార్టీ మ్యాని ఫెస్టోలో పొందుపరిచే విధంగా నివేదిక సిద్ధం చేయనున్నారు. మలిదశ ఉద్యమకారుడు మొదటి నుండి తెలంగాణ ఉద్యమంలో మెదటి నుండి జై తెలంగాణ, టిఆర్ఎస్ పార్టీలలో స్థాపించినప్పటి నుండి తెలంగాణ రాష్ట్రం ఎర్పాటు అయినంత వరకు ఉద్యమంలో ఉద్యమ కారుడిగా,ఉద్యమ నాయకుడిగా పనిచేసిన అనుభవం ఉండడం ఉద్యమ కారుడిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. కవితక్కకు విదేయుడిగా ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరిం చుకుంది. కమిటీలో ఇతర సభ్యులుఈ కమిటీలో పాండు రంగారెడ్డికి అనుబంధంగా పనిచేయడానికి నవావత్ రాజేష్ నాయక్( ములుగు జిల్లా), బండారు శ్రీనివాస్ గౌడ్ (పెద్దపల్లి జిల్లా), సాలం వీరెందర్ (మేడ్చల్ జిల్లా) వీరిని సభ్యులుగా ప్రకటించారు. తెలంగాణ ఉద్యమ కారుల సమస్యల సాధన ధ్యేయంగా ఈ కమిటీ పని చేయనుందని, వారి పోరాటమే తెలంగాణ జాగృతి భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో నూతన ప్రాంతీయ పార్టీగా తెలంగాణ జాగృతి ఏర్పాటవ్వడం ఖాయమనే సంకేతాలు కనిపిస్తున్న తరుణంలో ఈ అధ్యయన కమిటీల ఏర్పాటు రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి కర పరిణామంగా మారింది. ఉద్యమకారులు సంక్షమ కమిటీకి నేతృత్వం వహించే అవకాశం వచ్చిన సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ "తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది నిస్వార్థంగా పనిచేశారు. వారి త్యాగాలను, వారు పడ్డ కష్టాలను స్మరించుకుంటూ, వారికి అండగా నిలవడమే ఈ కమిటీ ప్రధాన ఉద్దేశం. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షరాలు శ్రీమతి కల్వకుంట్ల కవిత గారి ఆదేశాల మే-రకు/దిశానిర్దేశంతో ఈ కమిటీని నియమించడం జరిగింది." అని పేర్కొన్నారు.

**కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశాలు:** క్షత్రస్థాయిలో ఉద్యమకారుల ప్రస్తుత ఆర్థిక, సామాజిక స్థితిగతులను అధ్యయనం చేయడం. అనారోగ్యంతో లేదా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న ఉద్యమకారులను గుర్తించడం. వారికి సంస్థ ప్రభుత్వం తరఫున ఎటువంటి సహాయ సహకారాలు అందించవచ్చో పరిశీలించి, సమగ్ర నివేదికను రూపొందించడం. నిజమైన ఉద్యమకారులకు తగిన గుర్తింపు దక్కేలా చూడటం. ఉద్యమకారుల సంక్షమానికి తెలంగాణ జాగృతి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ఈ కమిటీ ద్వారా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

## తిమ్మాపూర్ గ్రామంలో హాండ్స్ ఆఫ్ హెూప్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి

**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 8 :** గజ్వేల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆశ్రయం హాండ్స్ ఆఫ్ హెూప్ వారి సహకారంతో తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ పోసానిపల్లి రాజు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి హాజరై ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు అనంతరం ఆశ్రయం హాండ్స్ ఆఫ్ హెూప్ వారిని సర్పంచ్ రాజును అభినందించారు భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్నలను పొందాలున్నారు ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు అనంతరం ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి మందులను పంపిణీ చేశారుప్రజలందరూ ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు ఆరోగ్యమే మహాభాగ్యం



అన్నారు మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్నారు, సరైన ఆహారం తినాలని, వాకింగ్ వ్యాయమం లాంటి రోజు గంట సేపు చేయాలని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే వంటనూనెలను తగ్గించుకోనీ ,బయట తినే ఆహారపు అనువాట్లను మానుకోవాలని, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని కోరారు, పిఎసిఎస్ చైర్మన్ ఆలేటి ఇంద్రసేనారెడ్డి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పనుగట్ల శ్రీనివాస్ గౌడ్, పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీశైలం మాజీ కో ఆప్షన్ ఇక్బాల్, వైద్య సిబ్బంది భరద్వాజ్ డాక్టర్లు, తిమ్మాపూర్ గ్రామ ఉపసర్పంచ్ నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేందర్, వార్డు మెంబర్లు రామచంద్రం భార్గవి అనూజ సుదర్శన్ ప్రశాంత్ కవిత సీనియర్ నాయకులు రాజయ్య కనుకయ్య సత్యనారాయణ తదితరులున్నారు

# దివ్యాంగుల అభ్యున్నతికి పటిష్ట కార్యాచరణ అమలు

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, జనవరి 8: ( సమయం న్యూస్ ) :** జిల్లాలో దివ్యాంగుల అభ్యున్నతికి పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్ లో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల కారణంగా నెలరోజులు ఆలస్యంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని అన్నారు. దివ్యాంగుల సంక్షమ కార్యక్రమాల అమలులో ఖమ్మం జిల్లా యంత్రాంగం ముందంజలో ఉంటుందని అన్నారు. దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకం సంబంధించి ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, జిల్లాలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగ జంటలకు సంబంధిత వివాహ ప్రోత్సాహకం త్వరగా అందేలా చూడాలని అన్నారు. స్కాలర్ షిప్, దివ్యాంగులకు అవసరమైన పరికరాల పంపిణీలో లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అర్హులైన దివ్యాంగులందరికి పారదర్శకంగా సదరం సర్టిఫికెట్ అందించేలా చర్యలు తీసుకున్నామని, అర్హులకు అందేలా సదరం సర్టిఫికెట్ జారీ అంశాన్ని ర్యాండంగా చెక్ చేస్తామని అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో కంటి చూపు సమస్య వల్ల బిడ్డను పాఠశాలకు పంపడం లేదని ఒక దరఖాస్తు వచ్చిందని, ఖమ్మం జిల్లాలో కంటిచూపు సమస్య ఉన్న పిల్లల కోసం ప్రత్యేకంగా పాఠశాల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని, త్వరలోనే దీనిని ప్రారంభిస్తామని కలెక్టర్ తెలిపారు. వీధి వ్యాపారాల్లో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలి టీలకు ఆదేశాలు జారీ చేశామని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులలో దివ్యాంగులకు 5 శాతం అమలు అయ్యేలా చర్యలు చేపట్టామని అన్నారు. దివ్యాంగులకు ఆత్మ గౌరవ భవనం మంత్రి అనుమతితో త్వరలో భూ కేటాయింపులు చేస్తామని అన్నారు. నూతన మీ-సేవా కేంద్రాల ఏర్పాటులో దివ్యాంగులకు 5 శాతం అందేలా చూస్తామని, కేంద్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలను కూడా పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అన్నారు. హైదరాబాద్ కలెక్టర్ గా పని చేస్తున్న సమయంలో తాను బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేశానని అన్నారు. ఖమ్మం జిల్లాలో కూడా నిబంధనల ప్రకారం బ్యాక్ లాగ్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేసేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని అన్నారు. దివ్యాంగ క్రీడా పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కలెక్టర్ అభినందనలు తెలిపారు. దివ్యాంగ ఉద్యోగుల సంఘం ప్రతినిదులు మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ఆత్మ గౌరవం భవనం కేటాయింపు చేయాలని అన్నారు. దివ్యాంగులకు రవాణా నిమిత్తం వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ లో సమస్యలు రాకుండా చూడాలని కోరారు. విద్యా శాఖలో నూతనంగా ప్రారంభించిన ఎర్లీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అద్భుతంగా పని చేస్తుందని, దీనిని అద్భుతంగా రూపొందించినందుకు జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా స్థాయి ఆటల పోటీలలో పాల్గొని మొదటి, రెండవ స్థానం లో నిలిచిన దివ్యాంగులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేసి దివ్యాంగులతో కలిసి జిల్లా కలెక్టర్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షమ అధికారిణి విజేత, డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ. డా. వేణుమాధవ్, డి. హెచ్. ఈ. డబ్ల్యూ సమ్రీన్, దివ్యాంగ సంఘ ప్రతినిధులు, స్వచ్ఛంధ సంఘ సభ్యులు, దివ్యాంగులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన ఎన్. ఎస్. ఎస్ శీతాకాల ప్రత్యేక శిబిరం

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న బొంరస్ పేట మండల ఎంఇఓ హరిలాల్
- భారత దేశంలోని జాతీయ సేవ సంస్థల్లో ఎన్. ఎస్.ఎస్ అత్యంత ఎక్కువ మంది వాలంటీర్లను కలిగిన ఏకైక సంస్థ-
- డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్. బి.శ్రీనివాస్ రెడ్డి



**బొంరస్ పేట మండలం, జనవరి,08(సమయం న్యూస్):** కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల ఎన్. ఎస్. ఎస్ యూనిట్ -1 మరియు యూనిట్-2 ల సంయుక్త ఆధ్వర్యంలో రేగడి మైల్వార్ లో జరిగిన శీతాకాల ప్రత్యేక శిబిరం ఏడవ రోజు ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బొంరస్ పేట మండల ఎంఇఓ హరిలాల్ పాల్గొని వాలంటీర్లను ఉద్దేశించి విద్యతో పాటు సామాజిక సేవ, క్రమశిక్షణ, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం వంటివి నేర్చుకొనుటకు ఎన్. ఎస్.ఎస్ శిబిరం ఒక ప్రత్యేక వేదిక అని తెలియజేసినారు .అదేవిదంగా వాలంటీర్లు నిర్వహించిన సంక్షమ పథకాల ర్యాలీ,పరిశుభ్రతపై ర్యాలీ, ఆరోగ్యం, శానిటేషన్, బడి మానివేసిన పిల్లల సర్వేలు చాలా ఆకర్షణీ యంగా, విశ్వసనీయంగా ఉన్నాయని కొనియాడారు. కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్. బి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ భారత దేశం లోని జాతీయ సేవా సంస్థల్లో ఎన్. ఎస్.ఎస్ అత్యంత ఎ క్కువ మంది వాలంటీర్లను కలిగిన ఏకైక సంస్థ అని, పశువైద్య శిబిరం, ఉచిత వైద్య శిబిరం వంటివి ఈ శిబిరం ప్రత్యేకతలన్నారు విద్యార్థులు సేవా కార్యక్రమాల ద్వారా గ్రామాలలో చైతన్యానికి కృషి చేయాలన్నారు. వాలంటీర్లు నిర్వహించిన కార్యక్రమాలను కొనియాడారు. గ్రామ సర్పంచ్ గుర్మిట్కల్ చిట్టెమ్మ వాలంటీర్లు ప్రత్యేక శీతాకాల శిబిరంలో చేసిన కార్యక్రమాలు, సలహాలు గ్రామ అభివృద్ధికి ఎంతగానో తోడ్పడు తాయని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్మిట్కల్ చిట్టెమ్మ,వెంకట రెడ్డి ,ఉపసర్పంచ్ దాసరి చంద్రప్ప, పంచాయతీ సెక్రటరీ నాగరాజు,డాక్టర్. నవ్యశ్రీ, తెలంగాణ పోరాట యోధుడు గోవింద్ గౌడ్, వార్డ్ మెంబెర్స్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ రఫియా ఖానమ్, టి. రాంబాబు,ఎన్. ఎస్.ఎస్ యూనిట్ -1మరియు యూనిట్ 2 ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్. ఆర్. శ్రీనివాస్,డాక్టర్. ఈ.సోమ్లా, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు ఎన్. ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

● భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

**భూపాల పల్లి జనవరి 08( సమయం న్యూస్).:** గురువారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణంపై గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో సజాలంలో ఫోటో క్యాప్చర్ చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, గృహ నిర్మాణ శాఖ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించాలని సూచించారు. ఇండ్లు మంజూరు కాబడిన. లబ్ధిదారులు 45 రోజుల్లో నిర్మాణం ప్రారంభించకుంటే రద్దు చేయాలని స్పష్టం చేశారు. ఎంపీడీవోలు, గ్రామపంచాయతీ సెక్రటరీలు, గృహ నిర్మాణ శాఖ ఏఈలు సమన్వయంతో నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణం చేపట్టేందుకు మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. ఇల్లు నిర్మించుకునే పరిస్థితులు లేని లబ్ధిదారులకు లక్ష రూపాయల సహాయం అందించాలని సూచించారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల ఖర్చులపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. నిధుల సమస్య ఏమీలేదని, బిల్లులు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేస్తే నిధులు మంజూరు అవుతాయని స్పష్టం చేశారు. ప్రగతిలో ఉన్న ఇళ్ల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి గృహ నిర్మాణ శాఖ పీడి లోకిలాల్, పి ఆర్ ఈ ఈ వెంకటేశ్వర్లు, గృహ నిర్మాణ శాఖ డీఈ శ్రీకాంత్, భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎంపిడిఓలు, తధితరులు పాల్గొన్నారు.



# జంతు వధ శాలను పునరుద్ధరించాలి

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
- ఖాజీపేట లో గల కమేలా ను క్షేత్ర స్థాయిలో పరిశీలన
- నిరంతరం కమర్షియల్ చెత్త సేకరణ చేయండి.

**వరంగల్ జనవరి8( సమయం న్యూస్) :** ఖాజీపేట లో గల జంతు వధ శాల (కమేలా)ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. గురువారం బల్దియా పరిధి 63 వ డివిజన్ పరిధి లోగల కమేలా, 28 వ డివిజన్ ఇంతేజాజ్ గంజ్ ప్రాంతం లో మేయర్ శానిటేషన్ తనిఖీలు చేపట్టి సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బల్దియా పరిధి 28వ డివిజన్ బట్టల బజార్ ప్రాంతంలో గల ఇంతేజార్ గంజ్ పోలీస్ స్టేషన్ సమీపంలో మేయర్ క్షేత్ర స్థాయిలో శానిటేషన్ తనిఖీలు చేపట్టారు. ప్రతి కమర్షియల్ దుకాణానికి టైం షెడ్యూల్ కేటాయించి చెత్త సేకరణ జరపాలని ఎవరైనా దుకాణ దారులు చెత్తను రోడ్డుపై వేస్తే పెనాల్టీ లు విధించాలని మేయర్ అన్నారు. అనంతరం ఖాజీపేట లో గల కమేలా తో పాటు ఇంటిగ్రేటెడ్ నాన్ వెజ్ మార్కెట్ ను మేయర్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు, స్లాటర్ హౌస్ (కమేల) ను పరిశీలించి అధికారుల ఆదేశించిన మేయర్ పూర్తి స్థాయి లో జంతు వధ శాలను పునరుద్ధరించాలని అన్నారు. సమీపం లో గల ప్రభుత్వ భూమిని శుభ్రం చేసి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, అందులో ఏలాంటి నిర్మాణం చేపడితే ఉపయుక్తం గా ఉంటుంది అనే విషయాన్ని ఇంజనీరింగ్ అధికారులు నిర్ధారించాలన్నారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ విజయ శ్రీ రజాలే, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఏ ఈ విజయ లక్ష్మి, సానిటరీ ఇన్స్పెక్టర్ రవీందర్ యాదవ్, పాల్గొన్నారు.

# చైనా మాంజా దారం వద్దు..దేశీయ దారాలే ముద్దు.

● మీర్జాపూర్ లో విద్యార్థులకు అవగాహన




**కోస్గి మండలం, జనవరి,08(సమయం న్యూస్) :** సంక్రాంతి సందర్భంగా గాలి పటాల ఎగురవేసే వేడుకల్లో చైనా మాంజ దారాలకు బదులుగా దేశీయ దారాలనే ఉపయోగిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. గురువారం నారాయణపేట జిల్లా కోస్గి మండలం మీర్జాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎర్త్ క్లబ్ ఆధ్వర్యంలో చైనా మాంజా దారాలతో ప్రమాదాలు... అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యంగ్ ఎర్త్ లీడర్ సమన్వయకర్త వార్ల మల్లేశం మాట్లాడుతూ గాలి పటాలు సంక్రాంతి పండుగలో ముఖ్యభాగమని వాటిని ఎగురవేసేందుకు ఉపయోగించే దారాలలో చైనా మంజా ఎంతో ప్రమాదకరమని అన్నారు. సాధారణ నైలాన్ సింథటిక్ దారాలకు గాజు పొడి, పారిశ్రామిక పదార్థాలు, వంటి వాటిని ఉపయోగిస్తూ తయారుచేసిన ప్రమాదకర మాంజ దారాలు గత కొంత కాలంగా మార్కెట్లోకి ప్రవేశించి జీవరాసులకు పర్యావరణానికి ఇబ్బందులు కల్గిస్తున్నాయని అన్నారు. ఈ దారాల వల్ల ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటూన్నాయని పలు ఉదాహణలతో విద్యార్థులకు వివరించారు. మన సంతోషం ఇతర జీవులకు విషాదకరంగా మారకూడదని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చైనా మంజదారాలను నిషే దించిందని వాటిని అమ్మినా.. కొన్నా, ఉపయోగించినా జైలు శిక్ష తో పాటు జరిమానా వంటి శిక్షలు ఉంటాయని అన్నారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో మేడలు, ఎత్తైన ప్రాంతాలలో జాగ్రత్త వహించాలని, విద్యుత్ తీగలతో అశ్రద్ధ గా ఉండవద్దని వీలైనంత వరకు మైదాన ప్రాంతాలలో గాలిపటాలు ఎగరవేయాలని సూచించారు. ప్లాస్టిక్ కాగితపు గాలిపటాలకు బదులుగా సాధారణ కాగితాలతో, వెదురు బద్దలు, దారాలు ఉపయోగిస్తూ వివిధ రకాల గాలి పటాల తయారీ పై విద్యార్థులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. విద్యార్థులు స్వయంగా పర్యావరణహిత గాలిపటాలు తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు త్రిగుణ, మల్లయ్య, సంతోష్, భీమయ్య,రహమత్ పాషా, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# యాలాల గ్రామానికి పేరి రాజేందర్ రెడ్డి సేవలు



**యాలాల మండలం, జనవరి,08(సమయం న్యూస్) :** గురువారం యాలాల మండల్ కేంద్రం లో తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి ఆదేశాల మేరెకూ యాలాల మండల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో గోవింద్రాపేట్ గ్రామం మంచి నీటి సౌకర్యం తో బోరు మెటర్ ను ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచ్ సి హెచ్. శివయ్య,ఉప సర్పంచ్ మల్కిరెడ్డి శోభారాజు రెడ్డి, వికారాబాద్ జిల్లా మాజీ కో-అప్షన్ అధ్యక్షులు అక్బర్ బాబ, 12వార్డ్ నెం. బోయిని ఉమేష్,గ్రామ కమిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ నాయి, పాకిరప్ప(రేవంత్ రెడ్డి)మౌలానా,గ్రామ పంచాయతీ వర్కర్ శబ్బీర్,బాలయ్య,రాములు గోవిద్రాపేట్ గ్రామ ప్రజలు పేరి రాజేందర్ రెడ్డికి ధన్యవాదములు తెలియజేశారు


# వేధిస్తున్న గ్రామ కార్యదర్శి పై జిల్లా కలెక్టర్కు బాధితురాలి ఫిర్యాదు



**ఖమ్మం జనవరి 8 ( సమయం న్యూస్ ) :** ఎలాంటి నిర్మాణం లేకుండానే ఇంటి నెంబర్ కేటాయించడం , నిర్మాణం ఉన్నప్పటికీ ఇంటి నెంబర్కేటాయించక పోవడం గురించి ప్రశ్నించి నందుకుగాను తనపై పూవడ ఉదయ నగర్ గ్రామ కార్యదర్శి మహేష్ వీధింపులకు పాల్పడుతున్నాడని తనపై అక్రమంగా కేసు వణించడం జరిగిందని బాధితురాలు చీమల నీల గురువారం జిల్లా కలెక్టర్ , ఖమ్మం పోలీస్ కమిషనర్ , జాయింట్కలెక్టర్ నేరుగా వినతి పత్రం సమర్పిస్తూ ఫిర్యాదు చేసింది. అదేవిధంగా మహిళ కమిషన్ ,రాష్ట్ర డిజిపి, బీసీ కమిషన్ పోస్టు ద్వారా తన ఫిర్యాదును పంపింది. పువ్వాడ ఉదయ నగర్ గ్రామంలో తనతో పాటు కొంతమందికి ఇంటి నెంబర్లు కేటాయించలేదని, ఎలాంటి ఇంటి నిర్మాణం లేని రత్నకుమారి అనే మహిళకు ఖాళీ స్థలం ఉంటే ఇంటి నెంబర్ ఎలా కేటాయించారని తాను ప్రశ్నించానని.. దీనిపై పంచాయతీ సెక్రెటరీ మహేష్ నన్ను వీడియో తీసి బెదిరిస్తున్నాడని, నాపై కక్ష కట్టాడని వినతి పత్రంలో బాధితురాలు నీలా ఆవేదన వ్యక్తం చేసింది. సమస్య ఏదైనా తనకు కాకుండా ఎమ్మార్వో ఆఫీస్ కు లేదా కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లి, వారికి చెప్పాలని... చెప్పుకోవాలని నన్ను మానసిక ఒత్తిడి, ఆందోళన గురి చేస్తున్నాడని ఆమె పేర్కొంది. పైగా నాకు ఇంటి నెంబరుగుర్తింపు పత్రాలనురద్దు పరుస్తానని బెదిరిస్తూ ,నీ అంతు చూస్తానని అంటున్నాడని వివరించింది. ఈ గ్రామ పంచాయతీ కార్యదర్శి వల్ల తనకు తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని వినతిపత్రంలో ఆందోళన వ్యక్తం చేసింది. తాను గ్రామ కార్యదర్శిని సామాజిక మాధ్యమాలలో తప్పుడు ప్రచారం చేస్తూ ఉందనే కారణంతో తనపై తప్పుడు అభియోగాలు మోపి తనపై కేసు నమోదు చేశారని చెప్పింది. అదేవిధంగా రత్నకుమారి అనే మహిళ తనకు కోర్టు ద్వారా నోటీసులు పంపిందని నీలా పేర్కొంది. సదరు గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేసి తనకు రక్షణ కల్పించాలని కోరుతూ వినతి పత్రాలను సమర్పించింది.

# 12 న ముగ్గుల పోటీలు

● జిల్లా అసిస్టెంట్ కలెక్టర్(అండర్ ట్రైనింగ్)మరియు నర్వ మండల ఎంపీడీఓ ప్రణయ్ కుమార్




**నర్వ మండలం, జనవరి,08(సమయం న్యూస్) :** 12 న ముగ్గుల పోటీలునారాయణపేట జిల్లా అసిస్టెంట్ కలెక్టర్( అండర్ ట్రైనింగ్) మరియు నర్వ మండలం ఎంపీడీవో ప్రణయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 12 న ఉదయం 10 గంటలకు నర్వ ఎంపీడీవో కార్యాల యం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.10,000 నగదు, రెండవ బహుమతిగా రూ. 5,000, మూడవ బహుమతిగా రూ.2,000 నగదు అందజేయనున్నారు. నర్వ మండలానికి చెందిన యువతులు, మహిళలు ఈ ముగ్గుల పోటీలలో పాల్గొనాలని ఎంపీడీవో కార్యాలయ అధికారులు కోరారు.

# వేలంలో రెండు వాహనాలు



● తాండూర్ ఎక్సైజ్ ఇంచార్జ్ సీఐ-రాణి

**తాండూర్ మున్సిపల్, జనవరి,08(సమయం న్యూస్ :** వికారాబాద్ జిల్లా తాండూరు ఎక్సైజ్ స్టేషన్ నందు నేడు మధ్యానం 12:00 గంటలకు వాహనాల వేలం కలదు. ఇట్టి వేలంలో రెండు వాహనాలు ఉంచబడు తున్నాయి అవి (1)హీరో హెూండా ఫైషన్,(HERO HONDA PASSION) (2)మహీంద్రా జీతో,(MA-HENDRA JEETHO లు కలవు కావున ప్రజలు పెద్ద ఎత్తున వేలంలో పాల్గొని ఇట్టి వాహనాలను సొంతం చేసుకోగలరని ఎక్సైజ్ ఇన్చార్జ్ సిఐ రాణి తెలిపారు.

# బాన్సువాడ లో 2.14 కోట్ల వ్యయం తో బి టి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ.



**బాన్సువాడ జనవరి 08( సమయ్దం న్యూస్) :** బాన్సువాడ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద రూ 2 కోట్ల 14 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బిటి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి గారు, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ శ్రీ కాసుల బాలరాజు గారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాన్సువాడ పట్టణ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు.

# పెద్ద పల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన చికిత్స



**పెద్ద పల్లి జనవరి08( సమయం న్యూస్) :** పెద్దపల్లి పట్టణానికి చెందిన 46 సంవత్సరాల ఒక మహిళలకు గత కొంతకాలంగా కడుపులో కుడి వైపు తీవ్రమైన నొప్పితో గ్లాడ్ బ్లాడర్ లో 14 ఎఎ స్టోన్ తో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అవ్వడం జరిగింది. ఈమెకు ఈ రోజు వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి అధునాతన పద్ధతిలో డా. అమర సింహా రెడ్డి, లాప్రోస్కోప్ సర్జన్ తో లాప్రోస్కోపిక్ కొలాసిస్టెక్టమీ ఆపరేషన్ ను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి సర్జరీ లో పాల్గొన్న వైద్యుల బృందం డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ విష్ణు చంద్రిక, డాక్టర్ కృష్ణవేణి మరియు డాక్టర్ రామంలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక పరిజ్ఞానంతో ఇలాంటి ఎన్నో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి కావున ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోగలరని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ గారు ఒక ప్రకటనలో తెలిపారు

# టెట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహణ


● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం జనవరి08( సమయం న్యూస్). :** టెట్‌ఉ2026 పరీక్షల నిర్వహణలో భాగంగా గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అబ్దుల్ కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ సైన్సెస్‌లో నిర్వహించిన టెట్ పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. ఈ పరీక్ష కేంద్రంలో సెషన్‌కు మొత్తం 100 మంది అభ్యర్థులు కేటాయించగా, అందులో 87 మంది హాజరై 13 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. అదే విధంగా సెషన్‌ఉకు 100 మంది అభ్యర్థులు కేటాయించబడగా, 56 మంది హాజరై 44 మంది గైర్హాజరయ్యారని కలెక్టర్ వివరించారు. రెండు సెషన్లలోనూ పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టడంతో పాటు, పరీక్ష నియమ నిబంధనలు కట్టుదిట్టంగా అమలు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు.

# 2027 జనాభా లెక్కలు..

## ఇళ్ల జాబితా సేకరణకు షెడ్యూల్ విడుదల




దేశ వ్యాప్తంగా జనాభా లెక్కలు నిర్వహించేందుకు గత పార్లమెంట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 2027 జనాభా లెక్కలకు సంబంధించి కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా ఇళ్ల జాబితా సేకరణ ప్రక్రియను 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 తేదీల మధ్య చేపట్టనున్నట్లు కేంద్ర హెూం శాఖ ప్రకటించింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ ఆరు నెలల కాలపరిమితిలో తమకు అనుకూలమైన ఏదైనా 30 రోజుల పాటు ఈ గణనను నిర్వహించుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొంది. స్వయంగా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఈసారి జనాభా లెక్కల్లో ప్రజలకు 'సెల్ఫ్ ఎన్యూమరేషన్ణ స్వయంగా వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటును కల్పించారు. అధికారులు ఇంటింటికి వచ్చి వివరాలు సేకరించే 30 రోజుల ప్రక్రియ ప్రారంభమవడానికి సరిగ్గా 15 రోజుల ముందే ఈ ఆప్షన్ అందుబాటులోకి వస్తుంది. ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ కుటుంబ వివరాలను ముందే నమోదు చేసుకునేలా ఈ మార్పులు చేసినట్లు కేంద్రం వెల్లడించింది.

# పిల్లలో కనీస విద్యా ప్రమాణాలు పెంచేందుకు దృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- జనవరి 31, ఫిబ్రవరి 5, ఫిబ్రవరి 23 కనీస విద్యా ప్రమాణాల పై మాక్ టెస్ట్
- పాఠశాల తనిఖీ సమయంలో ప్రతి తరగతి గదిలో 3 విద్యార్థుల ప్రమాణాలు చెక్
- ఉన్నత పాఠశాలలో 6వ తరగతి,7వ తరగతి విద్యార్థుల బేసిక్స్ పై స్పెషల్ క్లాస్
- నిబంధనల ప్రకారం జనవరి 26 నాటికి పీఎం శ్రీ నిధులను వినియోగించాలి
- విద్యా శాఖ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జనవరి-08( సమయం న్యూస్) :** పిల్లలో కనీస విద్యా ప్రమాణాలు పెంచేందుకు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష విద్యా శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పాఠశాలలో విద్యా నాణ్యత పెంపొందించేందుకు మండల విద్యాశాఖ అధికారి, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, విద్యా శాఖ జిల్లా ఉన్నతాధికారులు నిర్వహించే తనిఖీలు, తీసుకునే రివ్యూ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. పాఠశాలల తనీఖీ నిమిత్తం విద్యా శాఖ ఉన్నతాధికారులు వీక్లీ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, ప్రతి మండలంలో నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం పాఠశాలల తనిఖీలను ప్రతి అధికారి కనీసం 80 శాతం పూర్తి చేయాలని అన్నారు. ప్రతి పాఠశాల తనిఖీ నాణ్యతతో ఉండాలని, చెక్ లిస్ట్ ప్రకారం ప్రతి అంశాన్ని పరిశీలించి పాఠశాల పర్యటన సంబంధించి రిపోర్టు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండే విధంగా కృషి చేయాలని, పిల్లలు ప్రస్తుత విద్యా ప్రమాణాల స్థితిగతులను సరిగ్గా నమోదు చేయాలని అన్నారు. విద్యా ప్రమాణాలు సరిగ్గా లేకున్నా అంతా బాగుందని చూపెట్టేందుకు తప్పుడు వివరాలు ఇవ్వవద్దని అన్నారు. ప్రాథమిక విద్య మిడ్ లైన్ చెకింగ్ లో పెద్దపల్లి జిల్లా ప్రస్తుతం 17వ స్థానంలో ఉందని, తెలుగు రాయడం, చదవడం లో విద్యార్దులు చాలా వెనుకబడి ఉన్నారని, క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా అధికారులు ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల సిబ్బందికి తగు సూచనలు జారీ చేయాలని అన్నారు. జనవరి 31, ఫిబ్రవరి 5, ఫిబ్రవరి 23 నాడు 3 సార్లు ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాల పై మాక్ టెస్ట్ నిర్వహించాలని, ప్రతి పరిక్షకు విద్యార్థులలో ఇంప్రూవ్మెంట్ ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. బట్టి పద్దతులలో కాకుండా పిల్లలకు విషయ పరిజ్ఞానం అందేలా పిల్లలను ఇంటరాక్ట్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరగాలని అన్నారు. పాఠశాలల తనీఖీకి సమయంలో అధికారులు ప్రతి తరగతి గదిలో కనీసం 3 విద్యార్థుల ప్రమాణాలను ర్యాండం గా చెక్ చేయాలని అన్నారు. గణితం ప్రమాణాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. తరగతి గదిలో ప్రతి రోజు గంట నుంచి రెండు గంటల వరకు పిల్లల రీడింగ్ స్కిల్స్, గ్రహణ శక్తి పెంచే విధంగా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 7వ తరగతి చదివే విద్యార్థులకు బేసిక్స్ దృఢంగా ఉండాలే ప్రతిరోజు గంట సమయం స్పెషల్ క్లాస్ ఏర్పాటు చేయాలని అన్నారు. 8వ తరగతి,9వ తరగతి విద్యార్థులపై సైతం శ్రద్ధ వహిస్తూ వారికి విషయ పరిజ్ఞానం సరిగ్గా అందేలా చూడాలని అన్నారు . ప్రతి ఉన్నత పాఠశాలలో సంక్రాంతి కంటే ముందు 10వ తరగతి సిలబస్ పూర్తి చేయాలని అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్ నిర్వహించాలని అన్నారు.

పాఠశాలలో పిల్లలకు మెరుగైన పద్ధతిలో విద్యా బోధన అందించాలని, పాఠ్యాంశాలు పిల్లలకు అర్థమయ్యే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల క్లాసెస్ ను రెగ్యులర్ గా హెడ్ మాస్టర్ లు వినాలని కలెక్టర్ సూచించారు. స్కూల్ పిల్లలకు లైబ్రరీ పీరియడ్ తప్పనిసరిగా ఉండేలా చూడాలని అన్నారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు ఎఫ్.ఆర్.ఎస్ నమోదు అయ్యేలా చూడాలని అన్నారు. పాఠశాల సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు యూ.ఐ.డి.సి లో నమోదు చేయాలని అన్నారు. పీఎం శ్రీ పథకానికి ఎంపికైన 16 పాఠశాలలకు సంబంధించి 88 లక్షల నిధులు అందుబాటులో ఉన్నాయని, నిబంధనల ప్రకారం ఈ నిధులను హెడ్ మాస్టర్ లు జనవరి 26 నాటికి వినియోగించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు నూతనంగా అందించిన కంప్యూటర్లను వినియోగించాలని, ఉన్నత తరగతి విద్యార్థులకు కంప్యూటర్ నాలెడ్జ్ అందే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో పాత సామాన్లు, స్టోరేజ్ వస్తువులను పూర్తి స్థాయిలో తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు పిఎం. షేక్ ,మల్లేశం ,జిసిడిఓ కవిత,మండల విద్యా ధికారులు , కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు , సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు, ఫైర్ సేఫ్టీ నిబంధనలు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా పాటించాలి

● జిల్లా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి



**మహబూబ బాద్ జనవరి 08( సమయం న్యూస్). :** రోడ్డు భద్రత మహెూత్సవాల సందర్భంగా గురువారం మహబూబాబాద్ పట్టణంలోని ఫాతిమా హైస్కూల్లో మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సాయి చరణ్ అధ్యక్షతన ప్రైవేటు పాఠశాలల వాహనలు,ఆటో డ్రైవర్స్,కు వైద్య పరీక్షలు నిర్వహించి రోడ్డు, ఫైర్ భద్రతలపై అవగాహన సమీక్ష సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక వాహన డ్రైవర్ ట్రాఫిక్ రూల్స్ ను పక్కాగా పాటించాలని, జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్, పాటిస్తూ, వాహనాల ఓవర్టేక్ చేసే సమయంలో నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక డ్రైవర్ తన ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలని,డ్రైవింగ్ చేసే క్రమంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని, టు వీలర్ వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఇతర హెవీ వెహికల్స్ నడిపే డ్రైవర్స్ సీట్ బెల్ట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. పాఠశాలల వాహనాలను క్రమం తప్పకుండా ఫిట్నెస్ ఉండే విధంగా నిత్యం తనిఖీలు చేసుకోవాలన్నారు. వాహనాలలో ఫైర్ సేఫ్టీ పరికరాలను ఎప్పటికీ సిద్ధంగా ఉంచుకోవాలని అనుకోని పరిస్థితులలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు సమయస్ఫూర్తితో వ్యవహరించి అగ్ని ప్రమాదాలను నివారించాలని అన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఎట్టి పరిస్థితులలో ఇవ్వరాదని, లైసెన్సు లేకుండా వాహనం నడపకూడదని సూచించారు.

ప్రభుత్వం రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుని పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తుందని ఈ మాసంలో స్పెషల్ డ్రైవ్ ద్వారా డ్రైవర్లకు వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగానే లయన్స్ క్లబ్ వారి సౌజన్యంతో ఈరోజు డ్రైవర్లకి కంటి పరీక్షలు, బీపీ, షుగర్ ఇతర వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు ఫైర్ సేఫ్టీ వైద్యం ఆరోగ్యం రోడ్డు భద్రత ట్రాఫిక్ రూల్స్ తదితర అంశాలపై హాజరైన డ్రైవర్లకు క్లుప్తంగా వివరించారు. సమావేశం అనంతరం కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లు, వైద్య సిబ్బందికి ప్రజలకు ఫైర్ సేఫ్టీ పై మాక్ డ్రిల్ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో జిల్లా ఫైర్ అధికారి టీ .మోహన్ రావు, డిపిఆర్ఓ పి.రాజేంద్రప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ వెంకట్ రెడ్డి,సాయి చరణ్, ట్రాఫిక్ ఎస్ఐ అరుణ్ కుమార్, వైద్యాధికారులు, డాక్టర్ మౌనిక, డాక్టర్ నర్మద, డ్రైవర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు

# ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్

- డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడం పట్ల ఆగ్రహం
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టీకరణ
- మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశం



**నిజామాబాద్, జనవరి 08( సమయం న్యూస్).** ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ విభాగాలను, ఆపరేషన్ థియేటర్, శస్త్ర చికిత్స వార్డు, రిసెప్షన్ సెంటర్ తదితర వాటిని సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ ను తనిఖీ చేసి, విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది హాజరు గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా డ్యూటీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా అత్యవసర వైద్యం కోసం ఆసుపత్రికి వస్తే ఎలా అని సిబ్బందిని నిలదీశారు. ఈ తరహా నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని, వైద్యులు, సిబ్బంది అందరూ విధుల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు జరుపుతానని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

ప్రతిరోజు సగటున ఎంతమంది రోగులు ఆసుపత్రికి వస్తున్నారు, వారిలో ఎంతమంది ఇన్ పేషంట్లుగా అడ్మిట్ అవుతున్నారు, వైద్యులు, సిబ్బంది సరిపడా సంఖ్యలో ఉన్నారా, ఔషధాలు పూర్తి స్థాయిలో ఉన్నాయా అని ఆరా తీశారు. స్థానికంగా నెలకు సగటున ఎన్ని సాధారణ ప్రసవాలు చేస్తున్నారు, సిజేరియన్లు ఇక్కడే అవుతున్నాయా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ ఉన్నారు.

## మహిళల ప్రీమియర్ లీగ్ 2026కు

# రంగం సిద్ధం

### నేటి నుంచే డబ్ల్యూపీఎల్ నాలుగవ సీజన్..




మహిళల క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న డబ్ల్యూపీఎల్ 2026 సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. గతేడాది ఆసియా కప్ విజయం తర్వాత భారత మహిళల జట్టు మీద అంచనాలు పెరగగా, ఈ లీగ్ ద్వారా మరింత మంది యువ క్రీడాకారిణులు వెలుగులోకి రానున్నారు. జనవరి 9న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్ మరియు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగే మ్యాచ్‌తో ఈ టోర్నీకి తెరలేవనుంది. వేదికలు: ఈసారి టోర్నీ రెండు ప్రధాన నగరాల్లో జరగనుంది. మొదటి 11 మ్యాచ్‌లు నవీ ముంబైలోని డి.వై.పాటిల్ స్టేడియంలో, మిగిలిన మ్యాచ్‌లు (ఎలిమినేటర్ మరియు ఫైనల్‌తో సహా) వడోదరలోని బి.సి.ఎ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు జరిగిన మూడు సీజన్లలో ఒకసారి విజేతగా నిలిచిన ఆర్సీబీ.. మరో టైటిల్‌పై కన్నేసింది. అరంగేట్ర సీజన్‌తో పాటు గత సీజన్‌లో ఆర్సీబీ పేలవ ప్రదర్శనతో పాయింట్స్ టేబుల్‌లో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. ఈ క్రమంలోనే నాలుగో సీజన్‌లో ఎలాగైనా టైటిల్ గెలవాలనే కసితో జట్టును ప్రక్షళన చేసిన ఆర్సీబీకి టోర్నీ ఆరంభానికి ముందే బిగ్ షాక్ తగిలింది. స్టార్ ప్లేయర్ ఎల్లీస్ పెర్రీ గాయంతో ఈ సీజన్‌కు దూరమైంది. ఆమె స్థానాన్ని సాయలీ సత్ఘరే అనే భారత ఆల్‌రౌండర్‌తో ఆర్సీబీ భర్తీ చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) సీజన్-4కు రంగం సిద్ధమైంది. డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్ హ్యాట్రిక్ టైటిల్‌పై గురిపెట్టగా ఆ జట్టుకు ఈసారి బెంగళూరు, గుజరాత్‌లనుంచి గట్టి పోటీ ఎదురు కానుంది. ఆడిన మూడు సీజన్‌లలో రెండుసార్లు సునాయాసంగా టైటిల్ చేజిక్కించుకున్న ముంబ యికి 2024లో తొలిసారి స్మృతి మంధాన సారథ్యంలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) చెక్ పెట్టింది. దీంతో ఆ జట్టు తొలిసారి టైటిల్‌ను సాధించింది. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా 5జట్ల మధ్య డబ్ల్యుపిఎల్ సంగ్రామం జరగనుండగా..

టోర్నీలో మొత్తం 22మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈసారి నవీ ముంబయిలోని డివై పాటిల్ స్టేడియం, వడోదరలోని బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడి యంలో మాత్రమే డబ్ల్యుపిఎల్ లీగ్ జరుగుతుంది. మహిళా క్రికెట్‌కు ఆదరణ పెరగాలన్న ఉద్దేశ్యంతో బిసిసిఐ టికెట్‌ను కేవలం 100 రూపాయల ప్రారంభ ధరగా నిర్ణయించింది. 9న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య డివై పాటిల్ స్టేడియం, నవీ ముంబయిలో జరుగుతుంది. ఆ తర్వాత జనవరి 10న డబుల్ హెడర్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆ రోజు తొలి మ్యాచ్‌లో యుపి వారియర్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య, రెండో మ్యాచ్ ముంబయి ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగనున్నాయి. ఫిబ్రవరి 1తవరకు డబుల్ రౌండ్ రాబిన్ మ్యాచ్‌లు జరుగుతాయి. గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ కొత్త ఫీల్డింగ్ కోచ్‌ను నియమించింది. అంతర్జాతీయ క్రిట్‌లో సుదీర్ఘ అనుభవమున్న ఇంగ్లండ్ వెటరన్ సారా టేలర్‌కు ఫీల్డింగ్ కోచ్ బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని మంగళవారం ఎక్స్ వేదికగా ఫ్రాంచైజీ ప్రకటించింది. 13ఏళ్ల కెరీర్‌కు 2019లో వీడ్కోలు పలికింది. మూడు ఫార్మట్లలో 226 మ్యాచులు ఆడిన సారా 6,500 పరుగులు సాధించింది. మహిళా క్రిట్‌కు విశేష సేవలందించిన ఆమెకు 2025లో ఐసిసి హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటు దక్కింది. అనంతరం కోచ్‌గా కౌంటీల్లో ఇంగ్లండ్ సీనియర్ జట్టుకు సేవలందించింది. జూనియర్ టీమ్ ఇంగ్లండ్ లయన్స్‌కు కోచింగ్ ఇచ్చిన సారా ఫీల్డింగ్ ప్రమాణాలు నెలకొల్పింది. దాంతో.. డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ కోసం ఆమెను గుజరాత్ జెయింట్స్ యాజమాన్యం సంప్రదించింది. జనవరి 10న యూపీ వారియ-ర్స్‌తో గుజరాత్ తలపడనుంది. నవీ ముంబైలోని డీవై పాటిల్ స్పోర్ట్స్ అకాడమీలో మ్యాచ్ జరుగనుంది.

# భారత్‌కు భారీ ఎదురుదెబ్బ

**తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయం**

**నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం**



టీ20 వరల్డ్‌కప్ ముంగిట భారత్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. యంగ్ బ్యాటర్ తిలక్ వర్మకు పొట్ట కింది భాగంలో గాయమైంది. దీంతో అతడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రస్తుతం విజయ్ హజారే ట్రోఫీలో ఆడుతున్న తిలక్?కు ఇటీవల పొట్ట కింది భాగంలో నొప్పి వచ్చింది. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి స్కానింగ్ చేయించారు. డాక్టర్ల సూచన మేరకు అతడికి సర్జరీ చేయించారు. ప్రస్తుతానికి అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంది. ఈ సర్జరీ కారణంగా తిలక్ వర్మ నాలుగు వారాలు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. దీంతో ఇదే నెలలో న్యూజిలాండ్‌తో జరగాల్సిన టీ20 సిరీస్?కు అతడు దూరం కానున్నాడు. జనవరి 21 నుంచి న్యూజిలాండ్‌తో జరగాల్సిన ఐదు మ్యాచ్‌ల సిరీస్‌కు తిలక్? ఎంపికైయ్యాడు. కానీ సర్జరీ కావడంతో ఈ సిరీస్?కు తిలక్ అందుబాటులో ఉండడు. అతని స్థానంలో ఇంకో ప్లేయర్?ను ప్రకటించాల్సి ఉంది. అయితే తిలక్ లాంటి హిట్టింగ్ బ్యాటర్ వరల్డ్‌కప్‌కు ముందు గాయపడడం భారత్‌కు పెద్ద దెబ్బ! వచ్చే నెల 07న టోర్నమెంట్ ప్రారంభం కానుంది. అప్పటిలోగా అతడు పూర్తిగా కోలుకొని ఫిట్‌గా అవ్వాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు. అయితే తిలక్ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే వరల్డ్‌కప్‌లో అతడు ప్రారంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడాన్ని కచ్చితంగా చెప్పలేం!విజయ్ హాజారేలో హైదరాబాద్ జట్టుకు తిలక్ వర్మ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ టోర్నీలో తొలి నాలుగు మ్యాచ్‌ల్లో హైదరాబాద్ ఓడడంతో క్వాలిఫైయర్స్‌కు అర్హత సాధించలేదు. రీసెంట్‌గా చండీగఢ్, బంగాల్ జట్లతో జరిగిన మ్యాచ్‌ల్లో హైదరాబాద్ విజయం సాధించింది. దీంతో ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌ల్లో నాలుగు ఓడి, రెండింట నెగ్గింది. గతేడాది సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్ ఫైనల్‌లో తిలక్ వర్మ అద్భుతంగా పోరాడాడు. 150 పరుగుల ఛేదనలో 53 బంతుల్లో 69 పరుగులతో రాణించి టీమ్‌ఇండియాను గెలిపించాడు. పాకిస్థాన్‌పై ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లో తిలక్ పోరాటం అందర్నీ ఆకట్టుకుంది. ఇప్పటిదాకా అతడి కెరీర్‌లో ఇదే అత్యుత్తమ ఇన్నింగ్స్ అనడంలో ఎలాంటి డౌట్ లేదు. కాగా, 2023లో తిలక్ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. ఇప్పటిదాకా 40 మ్యాచ్‌ల్లో 49 యావరేజ్‌తో 1182 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు, 6 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. స్ట్రైక్ రేట్ 143.98గా ఉంది.

టీమ్‌ఇండియా వరల్డ్‌కప్ జట్టు : అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), సంజు శాంసన్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబె, అక్షర్ పటేల్ ( వైస్ కెప్టెన్), రింకు సింగ్, జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, వాషింగ్టన్ సుందర్, ఇషాన్ కిషన్, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి

# 4- 1తేడాతో యాషెస్ ఆసీస్ కైవసం

**చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా విజయం**

**5 వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ పై విక్టరీ**



యాషెస్ చివరి టెస్టులోనూ ఆస్ట్రేలియా విజయం సాధించింది. సిడ్నీ వేదికగా జరిగిన ఐదో మ్యాచ్?లో ఇంగ్లాండ్?పై ఆసీస్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. 160 పరుగులు స్వల్ప ఛేదనలో ఆసీస్ 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. మార్నస్ లబుషేన్ (37), జేక్ వెదరాల్డ్ (34) రాణించారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జోష్ టంగ్ 3, విల్ జాక్స్ 1 వికెట్ దక్కించుకున్నారు. దీంతో ఐదు టెస్టుల యాషెస్ సిరీస్?ను ఆస్ట్రేలియా 4-1 తేడాతో దక్కించుకుంది. అంతకుముందు ఓవర్ నైట్ స్కోరుతో ఐదో రోజు బ్యాటింగ్ కొనసాగించిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 342 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జాకబ్ బెతెల్ (154 పరుగులు) భారీ సెంచరీతో ఆకట్టుకున్నాడు. హ్యారీ బ్రూక్ (42), బెన్ డకెట్ (42) ఫర్వాలేదనిపించారు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్, వెబ్?స్టర్ చెరో 3, బొలాండ్ 2, నెసర్ 1 వికెట్ తీశాడు. దీంతో ఆస్ట్రేలియా ముందు 160 పరుగుల స్వల్ప లక్ష్యం నిలిచింది. ఈ లక్ష్యన్ని ఆసీస్ 5 వికెట్లు కోల్పోయి 31.2 ఓవర్లలో ఛేదించింది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (16) విన్నింగ్ షాట్ బాదాడు. కామెరూన్ గ్రీన్ 22 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. "మా జట్టు ప్రదర్శన అద్భుతం. అందరూ సమష్టిగా రాణించారు. ముఖ్యంగా స్టార్క్, హెడ్, క్యారీలు ఈ సిరీస్‌లో నిలిచిపోయే ప్రదర్శన చేశారు" అని ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ అన్నాడు. ఇక "మేము ఇంతకంటే బాగా ఆడాల్సింది. కానీ ఆస్ట్రేలియా ఐదు టెస్టుల్లోనూ అద్భుతంగా ఆడింది" అని ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ప్రత్యర్థిని కొనియాడాడు. కాగా, ఈ సిరీస్?లో పాట్ కమిన్స్ గైర్హాజరీలో స్మిత్ 4 టెస్టులకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఈ సిరీస్?లో ఆసీస్ ప్లేయర్లు రికార్డులు సృష్టించారు. పేసర్ మిచెల్ స్టార్క్ ఈ సిరీస్‌లో 19.9 సగటుతో ఏకంగా 31 వికెట్లు పడగొట్టాడు. దీంతో అతడు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ష గా ఎంపికైయ్యాడు. అటు బ్యాటింగ్?లో ట్రావిస్ హెడ్ మూడు భారీ సెంచరీలతో రెచ్చిపోయాడు. సిరీస్?లో ఏకంగా 629 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ కూడా 28 డిస్మిసల్స్‌తో ఆకట్టుకున్నాడు. చివరి రోజు ఆటలో థర్డ్ అంపైర్ నిర్ణయం కాంట్రవర్సీ అయ్యింది. ఆసీస్ బ్యాటర్ జేక్ వెదరాల్డ్ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు బంతి బ్యాట్‌కు తాకినట్లు అనిపించింది. ఇంగ్లాండ్ అప్పీల్ చేయగా అంపైర్ నాటౌట్ ఇచ్చారు. డీఆర్ఎస్?లో స్నికో మీటర్‌లో చిన్న కదలిక కనిపించింది. అయినా థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించడంతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు షాక్ అయ్యారు. కెప్టెన్ స్టోక్స్ అంపైర్లతో వాగ్వాదానికి దిగినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్?తో ఆసీస్ బ్యాటర్ ఉస్మాన్ ఖవాజా కెరీర్? ముగిసింది. అతడికి ఇదే చివరి టెస్టు కావడంతో మైదానంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. లక్ష్య ఛేదనలో బ్యాటింగ్‌కు వచ్చిన ఖవాజాకు ఇంగ్లాండ్ ఆటగాళ్లు 'గార్డ్ ఆఫ్ హానర్ష ఇచ్చి గౌరవించారు. అభిమానులు చప్పట్లతో స్టేడియాన్ని హోరెత్తించారు. ఖవాజా తన చివరి ఇన్నింగ్స్‌లో 4 పరుగులు చేసి ఔటయ్యాడు. పెవిలియన్‌కు వెళ్తూ మైదానంలో రాసిన "థంక్యూ ఉజీ" సందేశం వద్ద మోకాళ్లపై కూర్చుని పిచ్‌ను ముద్దాడాడు. ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు సిడ్నీ క్రికెట్ గ్రౌండ్?కు క్రికెట్ అభిమానులు పోటెత్తారు. ఐదు రోజుల్లో కలిపి మొత్తం 2,11,032 మంది ప్రేక్షకులు హాజరయ్యారు. సిడ్నీ మైదానంలో అత్యధిక మంది హాజరైన టెస్టుగా ఈ మ్యాచ్ రికార్డు సృష్టించింది.

# నిబంధనలను ఉల్లంఘించిన పాండ్యా

భారత స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా మళ్ళీ వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి తన ఆటతోనే కాకుండా, బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో చర్చనీయాంశమయ్యారు. విజయ్ హజారే ట్రోఫీలో బరోడా తరపున ఆడుతున్న పాండ్యా, చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టినప్పటికీ, బోర్డు పెట్టిన ఒక ముఖ్యమైన నిబంధనను పక్కన పెట్టడం ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. నిజానికి న్యూజిలాండ్ వన్డే సిరీస్ కోసం టీమిండియాను సెలక్ట్ చేసినప్పుడు హార్దిక్ పాండ్యా 10 ఓవర్ల బౌలింగ్ చేయడానికి ఇంకా పూర్తి స్థాయిలో ఫిట్ కాలేదని బీసీసీఐ స్పష్టం చేసింది. రాబోయే టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని పాండ్యాను జాగ్రత్తగా కాపాడుకోవాలని నేషనల్ క్రికెట్ అకాడమీ, సెలక్టర్లు భావించారు. కానీ విజయ్ హజారే ట్రోఫీలో చండీగఢ్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ ఏకంగా 10 ఓవర్ల కోటాను పూర్తి చేశారు. ఈ 10 ఓవర్లలో 66 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టారు. బోర్డు వారించినా కూడా పాండ్యా ఇంత రిస్క్ తీసుకోవడం ఇప్పుడు చర్చకు దారితీసింది. బౌలింగ్‌లో నిబంధనలు పక్కన పెట్టిన పాండ్యా, బ్యాటింగ్‌లో మాత్రం తన విశ్వరూపం చూపించారు. కేవలం 31 బంతుల్లోనే 75 పరుగులు చేసి మైదానంలో పరుగుల వరద పారించారు. ఇతని ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 2 ఫోర్లు ఉన్నాయి. 240కి పైగా స్ట్రైక్ రేట్‌తో ఆడిన పాండ్యా ప్రతాపానికి బరోడా జట్టు 391 పరుగుల భారీ స్కోరు సాధించింది. సమాధానంగా చండీగఢ్ 242 పరుగులకే కుప్పకూలడంతో బరోడా ఘనవిజయం సాధించింది. గత రెండు మ్యాచ్‌ల్లో పాండ్యా ఏకంగా 20 సిక్సర్లు బాదడం గమనార్హం. ఫిట్‌నెస్ విషయంలో బోర్డు ఆదేశాలను ధిక్కరించినందుకు పాండ్యాకు బీసీసీఐ నుంచి మొట్టికాయలు పడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే టీమ్ మేనేజ్‌మెంట్ లేదా ఎన్‌సీఏ నుంచి ముందస్తు అనుమతి తీసుకున్న తర్వాతే ఆయన బౌలింగ్ చేశారా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఒకవేళ అనుమతి లేకుండానే బౌలింగ్ చేసి ఉంటే, భవిష్యత్తులో గాయాల బారిన పడితే అది జట్టుకు పెద్ద లోటు అవుతుంది. ప్రస్తుతం హార్దిక్ పాండ్యా న్యూజిలాండ్‌తో జరగబోయే టీ20 సిరీస్‌కు సిద్ధమవుతున్నారు.

# 24 బంతుల్లోనే 10 భారీ సిక్సర్లు

**వైభవ్ సూర్యవంశీ ఊచకోత**



గతేడాది ఐపీఎల్‌లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ బాది వైభవ్ సూర్యవంశీ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇప్పుడు 2026 ప్రారంభంలోనే సౌతాఫ్రికా పర్యటనలో తన విశ్వరూపాన్ని చూపించాడు. అక్కడ జరుగుతున్న అండర్-19 వన్డే సిరీస్‌లో భాగంగా రెండో మ్యాచ్‌లో కేవలం 24 బంతుల్లోనే 10 భారీ సిక్సర్లతో 68 పరుగులు చేసి ఊచకోత కోశాడు. విదేశీ గడ్డపై, ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లకు అనుకూలించే సౌతాఫ్రికా పిచ్‌లపై ఈ రేంజ్ హిట్టింగ్ చూసి క్రికెట్ పండితులు నోరెళ్లబెడుతున్నారు. ఇది సౌతాఫ్రికాలో వైభవ్‌కు నమోదైన తొలి 50 స్కోరు కావడం విశేషం. వైభవ్ సూర్యవంశీ కేవలం పరుగులు సాధించడమే కాకుండా, తన దేశం కోసం ఒక భారీ కానుకను సిద్ధం చేస్తున్నాడు. మార్చి 27న వైభవ్ తన 15వ పుట్టినరోజు జరుపుకోనున్నాడు. అయితే ఆ పర్వదినం కంటే ముందే భారత్‌కు అండర్-19 వరల్డ్ కప్ ట్రోఫీని గిఫ్ట్‌గా ఇవ్వాలని కంకణం కట్టుకున్నాడు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 6 వరకు జింబాబ్వే, నమీబియా వేదికలుగా ఈ మెగా టోర్నీ జరగనుంది. ఈ టోర్నీలో వైభవ్ తన బ్యాట్‌తో గనుక భారత్‌ను విజేతగా నిలబెడితే, అతి చిన్న వయ-సులో అండర్-19 వరల్డ్ కప్ గెలిచిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. వైభవ్ ఆడుతున్న విధానం చూస్తుంటే టీమిండియాకు మరో విధ్వంసకర ఓపెనర్ దొరికాడనే భావన కలుగుతోంది. గతేడాది మొత్తం రికార్డుల మీద రికార్డులు కొల్లగొట్టిన వైభవ్, ఇప్పుడు అదే ఫామ్‌ను 2026కి కూడా మోసుకొచ్చాడు. అండర్-19 వరల్డ్ కప్‌లో భారత్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్న తరుణంలో, వైభవ్ సూర్యవంశీ కీలక పాత్ర పోషించనున్నాడు. తన 15వ ఏట అడుగుపెట్టకముందే ప్రపంచ క్రికెట్‌లో ఒక కొత్త శకాన్ని లిఖించడానికి ఈ బీహార్ కుర్రాడు సిద్ధమయ్యాడు.


# నేడు థియేటర్లలోకి ది రాజాసాబ్ మూవీ

## ప్రభాస్ అభిమానులకు సంక్రాంతి పండగ

మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ చేస్తూ వచ్చానని మార్పు కోసమే 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేశానని అన్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ఇది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కీలక పాత్రలు పోషించారు. సంజయ్ దత్ ప్రతినాయకుడిగా నటించారు. సంక్రాంతి కానుకగా జనవరి 9న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. నేడు సినిమా విడుదల కానుండడంతో థియేటర్ల వద్ద ప్రభాస్ అభిమానుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా 'స్పిరిట్' డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగాతో ప్రభాస్, కథానాయికలు ముచ్చటించారు. సినిమా గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఒక తరహా కథలకు అలవాటు పడిన హీరోలు అంత త్వరగా మార్పును కోరుకోరని, 'ది రాజాసాబ్'లాంటి సినిమా చేయడానికి కారణం ఏంటని ప్రభాస్‌ను సందీప్ అడిగారు. అందుకు ఆయన స్పందిస్తూ.. 'నా కెరీర్ మొదటి నుంచి యాక్షన్ ఫిల్మ్స్ ఎక్కువగా చేశా. ఒకే జానర్ ఫిల్మ్స్ చేసి బోర్ కొట్టేసింది. ఆ మార్పు కోసమే 15ఏళ్ల కిందట 'డార్లింగ్' చేశా. 'ఇది వర్కవుట్ అయ్యే సినిమా కాద'ని అందరూ అన్నారు. కానీ, బాగా ఆడింది. ఇప్పుడు భారతీయ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి. అందుకే ఇది ప్రయత్నించా. ఇది బామ్మ-మనవడి కథ. ఇందులో బామ్మ భర్త విలన్. అనుకోని పరిస్థితుల్లో ఆ పాడుబడిన మహల్‌కు వెళ్లాల్సి వస్తుంది. అది ఎందుకనేది సినిమా చూడాలి. ఇందులో 'ది రాజాసాబ్'గా నటించేది నేనే. సినిమా ప్రారంభ సమయంలో రెండు, మూడు టైటిల్స్ అనుకున్నాం. చివరకు 'ది రాజాసాబ్' ఓకే చేశాం'అని ప్రభాస్ చెప్పారు. ఈ సందర్భంగా 'స్పిరిట్' మూవీ పోస్టర్ గురించి చర్చ జరిగింది. 'బాహుబలి' చేసిన ఒక హీరోను ఎలా ప్రజెంట్ చేయాలా? అని చాలా ఆలోచించి ఇప్పుడున్న లుక్‌ను విడుదల చేశాం. ప్రభాస్ చేతిలో ఉన్న గ్లాస్ గురించి సోషల్‌మీడియా బాగానే చర్చ జరిగింది. అది ఒక లీటర్ బాటిల్. ఆయన చేతిలో అది గ్లాస్‌లాగానే కనిపిస్తుంది. ఆ సీన్ చాలా ఇంటరెస్టింగ్‌గా ఉంటుంది. పోస్టర్‌లో ఎక్కువగా తెలుపు మాత్రమే హైలైట్ అయింది. అందుకే మద్యం ఉన్న బాటిల్ అందరి దృష్టిలో పడిందని సందీప్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

# ఏపిలో పెరిగిన టిక్కెట్ ధరలు

## తెలంగాణలో తొలగని ఉత్కంఠ



యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'ది రాజా సాబ్' విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది, మారుతి దర్శకత్వంలో హారర్-కామెడీ జోనర్‌లో వస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ వింటేజ్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ సినిమా టికెట్ ధరల పెంపు మరియు బెనిఫిట్ షోలకు సంబంధించి ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తాజాగా బెనిఫిట్ షోలకు, తర్వాత పది రోజుల పాటు టికెట్ రేట్లను పెంచుతూ ఒక జీవో జారీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కానీ తెలంగాణలో మాత్రం ఆ జీవో ఇంకా రాలేదు. రాత్రికే బెనిఫిట్ షోలు, ప్రీమియర్స్ వేయాల్సి ఉండగా ఆ జీవో ఇంకా రాలేదు. అయితే కోర్టు సమయం ముగిశాక ఆ జీవో జారీ అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. సాధారణంగా ఏదైనా పెద్ద సినిమాకు ప్రభుత్వం రేట్లు పెంచుతూ జీవో ఇచ్చిన వెంటనే, కొందరు కోర్టులో పిటిషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల బుకింగ్స్ ఆగిపోవడం లేదా చివరి నిమిషంలో చిక్కులు ఎదురవడం వంటివి జరుగుతుంటాయి. ప్రభుత్వ జీవో వెలువడిన వెంటనే థియేటర్ యాజమాన్యాలు బుక్‌మైషో సహా ఇతర పోర్టల్స్‌లో బుకింగ్స్ జరిగేలా డేటాను అప్‌డేట్ చేస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం, నేడు సాయంత్రం 5:30 నుండి 6:00 గంటల మధ్య 'ది రాజా సాబ్' అడ్వాన్స్ బుకింగ్స్ పూర్తిస్థాయిలో ఓపెన్ అయ్యే అవకాశం ఉంది. ప్రభాస్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బెనిఫిట్ షోలకు (అర్ధరాత్రి లేదా తెల్లవారుజాము షోలు) కూడా లైన్ క్లియర్ అయింది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన కేంద్రాలలో ఈ షోల కోసం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం అనుమతి కూడా దాదాపు ఖాయం కావడంతో ఇప్పుడు రికార్డు స్థాయి వసూళ్లపై చిత్ర యూనిట్ ధీమాగా ఉంది.




# ఎన్టీఆర్‌తో కార్తికేయ సినిమా

మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఎప్పటినుండో ఓ కథ రెడీ చేస్తున్నారు. అదే లార్డ్ కార్తికేయ సుబ్రహ్మణ్య స్వామి కథ. ఈ సినిమాకు గాడ్ ఆఫ్ వార్ అనే టైటిల్ కూడా ఫిక్స్ చేసినట్టు వార్తలు ఎప్పటినుండో వినిపిస్తున్నాయి. అయితే ఈ సినిమాను ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తో చేస్తున్నట్టు లాంగ్ బ్యాక్ ఒక అనౌన్స్ మెంట్ కూడా ఇచ్చారు. హ్యాట్రిక్స్ హిట్స్ తర్వాత అల్లు అర్జున్- త్రివిక్రమ్ కాంబోలో ఒక భారీ మైథలాజికల్ చిత్రానికి శ్రీకారం చుట్టారు. కాని పుష్ప హిట్ తర్వాత త్రివిక్రమ్ సినిమా నుండి బన్నీ స్టెప్ అవుట్ అయ్యాడు. ఆ ప్లేస్ లోకి జూనియర్ ఎన్టీఆర్ వచ్చి చేరాడు. భారీ విజువల్స్, గ్రాండ్ సెట్స్, గ్లోబల్ స్టాండర్డ్స్‌తో రూ.1000 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమా ఉంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ లో వినిపించింది. . త్రివిక్రమ్ మార్క్ షార్ప్ డైలాగ్స్, మైథలాజికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను ప్రపంచ స్థాయి ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించనున్నారని టాక్ నడిచింది. అయితే ఇటీవల ఈ కథ మళ్లీ అల్లు అర్జున్ కాంపౌండ్ లోకి వచ్చిందని బాలీవుడ్ నుండి ఫీలర్లు వదిలారు. దాంతో ఈ సినిమాపై గందరగోళం నెలకొంది. తాజాగా సితార నాగవంశీ అనగనగ ఒక రాజు ట్రైలర్ ఈవెంట్ లో మాట్లాడుతూ ' కాలర్ లు ఎగరేయడం ఇప్పుడు ఎందుకులే. మే నెల నుండి కాలర్ ఎగరేద్దాం అని చెప్పాడు. దాంతో ఈ మూవీ జూనియర్ ఎన్టీఆర్ తోనే ఉంటుందని చెప్పకనే చెప్పేసాడు నాగవంశి. అన్ని అనుకున్నట్టు జరిగితే 2027 ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్టీఆర్ - త్రివిక్రమ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది.

# భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో వస్తోన్న రవితేజ

'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అంటూ ఈ సంక్రాంతికి సందడి చేయడానికి రవితేజ సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా కిషోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతీ కథానాయికలు. జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇద్దరి భామల మధ్య నలిగిపోతోన్న వ్యక్తిగా రవితేజ తన మార్క్ కామెడీతో అలరిస్తున్నారు. ఇటీవల వరుస పరాజయాలతో ఉన్న రవితేజ ఇప్పుడు ఈసినామపై ఆశలు పెట్టుకున్నారు. ఇది విజయవంతం కావాలని కోరుకుంటున్నాడు.





# ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అనగనగా ఒక రాజు

రాజుగారి పెళ్లి ఏడుతరాలు గుర్తిండిపోతుందంటూ నవ్వులు పూయిస్తున్నారు నవీన్ పొలిశెట్టి. ఆయన ప్రధానపాత్రలో మారి తెరకెక్కించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'అనగనగా ఒక రాజు' . మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా సందడి చేయనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. అందులో నవీన్ తన మార్క్ కామెడీతో ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలు అందించిన నవీన్ ఇప్పుడు అనగనగా ఒకరాజుతో వస్తున్నాడు.

# 4.69 కోట్లతో రష్మిక నెం.1



హీరోయిన్ రష్మిక మందన్న ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ హీరోయిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే టాలీవుడ్‌లో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ దక్కించుకుని, ఇంకా పలు తెలుగు సినిమాలు చేస్తోంది. మరో వైపు తమిళ సినిమాలు వరుసగా చేస్తూనే ఉంది. ఇక సొంత భాష అయిన కన్నడంలోనూ ఈమె సినిమాలు చేస్తూనే ఉంది. మరో వైపు బాలీవుడ్‌లో ఆగకుండా సినిమాలు చేస్తూనే ఉంది. అందుకే పాన్ ఇండియా రేంజ్‌లో ఈమెను స్టార్ హీరోయిన్ అంటూ అభిమానులు పిలుచుకుంటున్నారు. నేషనల్ క్రష్ అంటూ అభిమానులు పిలుచుకునే ఈ అమ్మడు తాజాగా నెం.1 స్థానంలో నిలిచింది. హీరోయిన్‌గా కాకుండా పన్ను చెల్లించే విషయంలో ఈమె నెం.1 గా నిలిచి అందరినీ సర్‌ప్రైజ్ చేసింది. కేవలం హీరోయిన్‌గానే కాకుండా కుటుంబంకు చెందిన వ్యాపారాల్లోనూ భాగస్వామ్యం ఉన్న కారణంగా రష్మిక అత్యధిక పన్ను చెల్లించినట్లు తెలుస్తోంది. ఒక జాతీయ మీడియా సంస్థ కథనం అనుసారంగా రష్మిక మందన్న ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మూడు త్రైమాసికాలకు కలిపి ఏకంగా ₹4.69 కోట్ల పన్ను చెల్లించింది. కన్నడకు చెందిన హీరోయిన్స్ ఈ స్థాయిలో పన్ను చెల్లించడం చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. పైగా రష్మిక సొంత జిల్లా అయిన కొడగు లో పన్ను చెల్లించిన వారు అందరితో పోల్చితే అత్యధిక పన్ను చెల్లింపు దారుగా రష్మిక నిలిచి నెం.1 స్థానంను దక్కించుకుంది. హీరోయిన్‌గా ఆమె చేస్తున్న వరుస సినిమాలకు కోటాను కోట్ల పారితోషికం అందుకుంటూ ఉంది. పైగా ఈమె ఇటీవల లేడీ ఓరియంటెడ్ సినిమాను చేయడం వల్ల, లాభాల్లో వాటాను సైతం తీసుకుందనే వార్తలు వచ్చాయి. దాంతో ఆమె పారితోషికం అత్యధికంగా అంది ఉంటుంది అనేది చాలా మంది మాట. అందుకే ఈమె తన ఆదాయంకు తగ్గట్లుగానే భారీ మొత్తంలో పన్నును చెల్లించింది అంటూ ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రష్మిక మందన్న సినిమాల విషయానికి వస్తే ఇటీవలే ది గర్ల్ ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా కమర్షియల్ ఫలితాన్ని పక్కన పెడితే ఒక మంచి డీసెంట్ ఫిల్మ్‌గా, ఆలోచింపజేసే విధంగా ఉంది అంటూ రివ్యూలు దక్కించుకుంది. మంచి సినిమాలో నటించావు అంటూ చాలా మంది రష్మిక మందన్న ను అభినందించారని తెలుస్తోంది. రష్మిక గత ఏడాదిలో ఏకంగా ఛావా, సికిందర్, కుబేరా, థామా, ది గర్ల్ ఫ్రెండ్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సికిందర్ మినహా మిగిలిన అన్ని సినిమాలు ఈమెకు మంచి పేరును తెచ్చి పెట్టాయి. అందుకే గత ఏడాది ఆమెకు చాలా కలిసి వచ్చిందని అంటారు. ఇక ఈ ఏడాదిలో ఈమె రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. తెలుగులో మైసా అనే సినిమాతో ఈమె పవర్ ఫుల్ పాత్ర తో కనిపించబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. అతి త్వరలోనే మరిన్ని వివరాలు రావాల్సి ఉన్నాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# మడ అడవుల పరిరక్షణకు పటిష్ట చర్యలు


**నేషనల్ క్యాంపా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ మోహన్**






**విజయవాడ:** సముద్ర తీర ప్రాంతాల్లో క్షణిస్తున్న మడ అడవులను పునరుద్ధరించి ఆ ప్రాంతాల్లో నివసించే ప్రజల జీవనోపాధిని మెరుగుపరచడమే మిష్టీ పథకం ప్రధాన ఉద్దేశ్యం అని నేషనల్ క్యాంపా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ మోహన్ తెలిపారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర అటవీ శాఖల సంయుక్తంగా తీరప్రాంత ఆవాసాలు, స్పష్టమైన ఆదాయాల కోసం మాంగ్రోవ్ ఇనీషియేటివ్ పై విజయవాడ లెమన్ ట్రీ ప్రీమియర్ లో గురువారం రెండు రోజులపాటు నిర్వహించే జాతీయ వర్క్‌షాప్ ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన నేషనల్ క్యాంపా, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆనంద్ మోహన్ మాట్లాడుతూ.. సముద్ర తీరప్రాంతాల్లో క్షణిస్తున్న మడ అడవులను రక్షంచి, సముద్రం కోత నుంచి కాపాడటమే లక్ష్యంగా మిష్టీ పథకం పనిచేస్తుందన్నారు. ప్రస్తుతం ఇది సుమారు రెండున్నర ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఈ పథకానికి జాతీయ కాంపా నిధుల నుండి 10 శాతం కేటాయిస్తున్నారన్నారు. మొత్తం 825 కోట్ల రూపాయల కేటాయింపుల్లో ఇప్పటివరకు కేవలం 100 కోట్లు మాత్రమే వినియోగించబడ్డాయన్నారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో మడ అడవుల విస్తీర్ణం ఎక్కువగా ఉన్నప్పటికీ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు మరియు కేరళ వంటి రాష్ట్రాలు ఈ పథకంలో ఆశించిన స్థాయిలో భాగస్వామ్యం లేదన్నారు. మడ అడవులు ప్రకృతి సిద్ధమైన రక్షణ గోడలా పనిచేసి తుపానులు, ఉప్పెనల వంటి ప్రకృతి వైపరీత్యాల నుండి తీర ప్రాంతాలను కాపాడతాయన్నారు. మడ అడవుల క్షణత వల్ల భూగర్భ జలాల్లో ఉప్పు నీరు చేరి వ్యవసాయ భూములు దెబ్బతింటున్నాయన్నారు. వీటిని కాపాడుకోవడం వల్ల స్థానిక రైతుల భూములు సురక్షతంగా ఉంటాయన్నారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ డాక్టర్ పీవీ చలపతిరావు స్వాగతోపన్యాసం చేస్తూ.. దేశవ్యాప్తంగా తీర ప్రాంత రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు, జాతీయ సంస్థల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్నారన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లో మడ అడవుల విస్తీర్ణం పెరుగుతూ ఉండటం ఒక సానుకూల అంశమని, భవిష్యత్తులో తీర ప్రాంతాన్ని మరింత సురక్షతంగా మార్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మడ అడవులను ఎలా అభివృద్ధి చేయాలి, తీర ప్రాంత రక్షణలో వాటి పాత్రపై లోతైన చర్చలు జరిగుతున్నాయన్నారు. పశ్చిమ బెంగాల్, గుజరాత్ తర్వాత, ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా మడ అడవులు ఉన్నాయన్నారు. మన రాష్ట్రంలో సుమారు 50,000 హెక్టార్లలో ఈ అడవులు ఉండగా, అందులో 40,000 హెక్టార్లు నోటిపై చేయబడ్డాయన్నారు. మడ అడవులు తుఫానులు, సునామీలు మరియు ఉప్పెనల నుండి ప్రాథమిక స్థాయి రక్షణగా నిలుస్తాయని, డెల్టా ప్రాంతాల్లోకి ఉప్పు నీరు చొచ్చుకు రాకుండా అడ్డుకుంటాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మిష్టీ పథకం ద్వారా మడ అడవుల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారని, 2028 వరకు ఈ పథకం కొనసాగుతుందన్నారు. రాష్ట్ర తీర ప్రాంతంలో దాదాపు 30 శాతం కంటే ఎక్కువ భాగం కోతకు గురవుతోందని, దీనిని అరికట్టడానికి 'నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సహకారంతో మేనేజ్మెంట్ ప్లాన్స్ సిద్ధం చేస్తున్నారన్నారు. కృష్ణా-గోదావరి డెల్టా ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌కు అన్నపూర్ణ లాంటిదని, ఇక్కడ లభించే చేపలు, ఇతర వనరులు మన దేశానికి అవసరమైన ప్రోటీన్, కార్బోహైడ్రేట్లను అందిస్తాయన్నారు. వర్క్ షాపులో డైరెక్టర్ ఎన్సీసీఆర్ (నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్) డాక్టర్ ఆర్ఎస్ కంకార, ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ వీఎల్ రాయ్ కుల్లయ్, డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ప (డీఐజీఎఫ్) ప్రశాంత్ రాజగోపాల్, ఎన్టీఆర్ జిల్లా డీఎఫ్వో జి. సతీష్ రెడ్డి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ జిల్లాలకు చెందిన ఫారెస్ట్ అధికారులు, తదితరలు పాల్గొన్నారు.

# హిమాలయ బేబీకేర్ కొత్త డీవీసీ ఆవిష్కరణ




**విశాఖపట్నం:** భారతదేశంలో అత్యంత నమ్మకమైన హిమాలయ బేబీకేర్ శిశువుల తొలి శీతాకాలంలో తల్లుల సహజ ఆందోళనను హృద్యంగా ప్రతిబింబించే కొత్త డిజిటల్ వీడియో కమర్షియల్ (డీవీసీ)ని ఆవిష్కరించింది. చలికాలంలో చల్లని, పొడి వాతావరణ నేపథ్యంతో రూపొందించిన ఈ ప్రచార చిత్రం తల్లిదండ్రులు తమ బిడ్డ మృదువైన చెంపలు, సున్నితమైన చర్మాన్ని ఎలా కాపాడుకుంటారో భావోద్వేగంగా చూపిస్తుంది. ఈ డిజిటల్ వీడియో కమర్షియల్లో కఠినమైన శీతాకాల గాలి తన బిడ్డ సున్నితమైన చర్మాన్ని ముఖ్యంగా ముద్దు ముద్దుగా ఉన్న చెంపలను చూస్తూ తల్లి ఆందోళనతో కథ మొదలవుతుంది. ఆ ఆందోళనకు ఆప్యాయతతో, నమ్మకంతో స్పందిస్తూ.. భయం నుంచి ధైర్యంగా వైపు మళ్ళుతుంది. చివరికి ఆమె ఒక బలమైన హామీ ఇస్తుంది. 'హమ్ హోనే హీ నహీ దేంగే అంటే ఎంత కఠినమైన వాతావరణం అయినా తన బిడ్డ చెంపలు మృదువుగానే ఉంటాయని ఇచ్చే ఒక భరోసా. భావోద్వేగాలు, రోజు వారీ జీవితానికి దగ్గరగా సహజత్వంతో రూపొందించిన ఈ చిత్రం హిమాలయ జెంటిల్ బేబీ లోషన్, జెంటిల్ బేబీ క్రీమ్ శిశువుల కోసం శీతాకాలంలో అవసరమైన ఉత్పత్తులు అన్న విషయాన్ని మరింత బలంగాఅబశ్రీశ్రీ చూపిస్తుంది. చర్మానికి అనుకూలమైన పీహెచ్ 5.5తో, పెంటా మాయిశ్చర్ లాక్ ఫార్ములేషన్ శక్తితో రూపొందిన హిమాలయ జెంటిల్ బేబీ లోషన్, క్రీమ్ చలికాలంలో శిశువుల సున్నితమైన చర్మాన్ని తేమపరచి, చర్మ రక్షణ పొరను కాపాడడంలో సహాయపడుతుందని ఈ క్యాంపెయిన్ చెప్తుంది. తల్లిదండ్రులకు పిల్లలపై ఉండే ప్రేమను శాస్త్రీయ ఆధారాలతో కూడిన భరోసాతో ఈ డీవీసీ తమ బిడ్డ తొలి శీతాకాలాన్ని ఎదుర్కొంటున్న తల్లిదండ్రులకు హిమాలయ బేబీకేర్ ఒక నమ్మదగిన భాగస్వామి అనే విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తుందని హిమాలయ వెల్‌నెస్ కంపెనీ బేబీకేర్ డైరెక్టర్ ఎన్వీ చక్రవర్తి పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**సమన్వయ శాఖల అధికారులు ప్రణాళికతో పనిచేయాలి**

**ఎక్కడా ఏ చిన్న పొరపాటుకూ తావులేకుండా చూడాలి**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**విజయవాడ:** జిల్లాలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలను (ఐపీఈ-2026) విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయ శాఖల అధికారులు ప్రణాళికాయుతంగా వ్యవహరిస్తూ.. పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. ఇంటర్ పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమన్వయ శాఖల అధికారుల సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియెట్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్, సమాచార, పౌర సంబంధాలు తదితర శాఖల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 1 నుంచి పదో తేదీ వరకు జరుగుతాయన్నారు. అదే విధంగా అత్యంత కీలకమైన థియరీ పరీక్షలు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు 98 కేంద్రాల్లో జరుగుతాయని వివరించారు. థియరీ పరీక్షలు ఉదయం 9 గం. నుంచి మధ్యాహ్నం 12 గం. వరకు జరగనున్నట్లు తెలిపారు. 36,734 మంది మొదటి సంవత్సరం విద్యార్థులు, 39,534 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 76,268 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వివరించారు. జిల్లా స్ట్రాంగ్ రూమ్, 17 స్టోరేజ్ పాయింట్ల భద్రతపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. పరీక్ష పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి పరీక్షా కేంద్రాలకు తరలింపు మొదలు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నిర్వహణ, బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘా విషయంలో పోలీసు శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లోనూ నో సెల్ ఫోన్ జోన్‌గా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రాక్టికల్, థియరీ పరీక్షలకు నాలుగు చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, థియరీ పరీక్షలకు మూడు సిటింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటుకు అవసరమైన అధికారులు, సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని, పారిశుద్ధ్యపైనా దృష్టిసారించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి బి.ప్రభాకరరావు, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, డీఈసీ సభ్యులు జి.ఝాన్సీ, ఎన్.వెంకటరావు, జి.వెంకటరమణ, కె.విష్ణుకాంత్, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఏపీఎస్ఆర్టీసీ అధికారి టి.సాయిచరణ్‌తేజ, పోస్టల్, విద్యుత్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# లూయిస్ బ్రెయిలీ సేవలు చిరస్మరణీయం

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**




**విజయవాడ:** లూయిస్ బ్రెయిలీ అందించిన సేవలు చిరస్మరణీయమైనవని, ఎలాంటి సౌకర్యాలూ లేని రోజుల్లో చేతివేళ్లతో చుక్కలను స్పృశించడం ద్వారా చదవగలిగే లిపిని ఆవిష్కరించడం ద్వారా లూయిస్ బ్రెయిలీ మహా మనిషిగా నిలిచారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. గురువారం నగరంలోని ఎంజీ రోడ్డు ఠాగూర్ గ్రంథాలయంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పాల్గొన్నారు. విభిన్న ప్రతిభావంతులు, అధికారులు, చిన్నారులతో కలిసి లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి.. శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దృష్టికి సంబంధించిన సమస్యలు ఉన్నాయని కలత చెందకుండా బ్రెయిలీ చూపిన మార్గంలో నడిచి తామెవరకీ తక్కువ కాదని నిరూపిస్తూ ఎదిగినప్పుడే బ్రెయిలీకి నిజమైన నివాళులు అర్పించినవారమవుతామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ.. బ్రయిలీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 3న నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన దివ్యాంగ ఉద్యోగులకు మెరిట్ అవార్డులు అందించారు. నగరంలో లూయిజ్ బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని వివిధ సంఘాల ప్రతినిధులు కోరగా ఈ అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఛైర్‌పర్సన్ జి.నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతులకు విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించి చేయూతనందిస్తోందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని బాగా చదువుకునేందుకు అవసరమైన ఉపకరణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విజువల్లీ ఛాలెంజ్డ్ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషిచేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు, దృష్టిలోపం కలిగిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొన్నారు. అదేవిధంగా జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వాగ్దేవు కామరాజు, ఠాగూరు గ్రంథాలయ అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ప్రకాష్ విద్యార్థులతో ముచ్చటించిన రైడ్ ఫర్ రోటరీ విదేశీ రైడర్స్



**పాయకరావుపేట:** రోటరీ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వైజాగ్ నుండి మైసూర్ వరకు "రైడ్ ఫర్ రోటరీ" పేరిట 28 మంది విదేశీయులతో నిర్వహిస్తున్న యాత్ర (10వ ఎడిషన్)లో భాగంగా బృందం సభ్యులు గురువారం శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో ఆగి తమ అనుభవాలను విద్యార్థులకు వివరించారు. శ్రీ ప్రకాష్ రోటూరాక్ట్ బృందం, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, రోటరీ గవర్నర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, రోటరీ క్లబ్, రోటరాక్ట్ బృందం తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రైడర్స్ మాట్లాడుతూ... హిందూ దేశ సంస్కృతి సాంప్రదాయాలు తమకు ఎంతగానే నచ్చాయని సేవ, మైత్రి కోసం చేస్తున్న ఈ రైడ్ ఫర్ రోటరీలో పాల్గొంటున్నందుకు తాము ఎంతో సంతోషిస్తున్నామని తెలిపారు. ఈ యాత్రలో నార్వే, జర్మనీ, బెల్జియం, కెనడా, పోలాండ్, ఆస్ట్రియా, రొమానియా దేశాల రైడర్స్ పాల్గొన్నారు. అనంతరం వీరంతా శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో ఉన్న డైరీ ఫాం, బయో గ్యాస్, సేంద్రీయ వ్యవసాయం తదితర వాటిని సందర్శించి ఆసక్తిగా తిలకించారు. ఈ సంధర్భంగా విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్ వీరందరినీ జ్ఞాపికలతో సత్కరించారు.

# రాయచోటిలో రూ.7.5 కోట్లతో ఆధునిక స్టేడియం!

- సచివాలయంలో డీపీఆర్ పరిశీలించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి
- మూడు ఎకరాల్లో మల్టీ స్పోర్ట్స్ కాంప్లెక్స్.. ఈ ఏడాదే పనులు ప్రారంభం
- క్రికెట్, స్విమ్మింగ్, కబడ్డీ సహా అనేక క్రీడలకు అంతర్జాతీయ స్థాయి వసతులు



**రాయచోటి/అమరావతి, జనవరి 08 (సమయం న్యూస్):**


రాయచోటి పట్టణంలో క్రీడాకారుల చిరకాల స్వప్నం త్వరలో సాకారం కానుంది. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి ప్రత్యేక చొరవతో రాయచోటిలో అత్యాధునిక హంగులతో కూడిన క్రీడా స్టేడియం ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. దాదాపు మూడు ఎకరాల విస్తీర్ణంలో, రూ.7.5 కోట్ల భారీ వ్యయంతో 'మల్టీ స్పోర్ట్స్ రిక్రియేషన్ అండ్ రికవరీ' క్రీడా సముదాయాన్ని నిర్మించనున్నారు.

ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను బుధవారం అమరావతిలోని తన ఛాంబర్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్షుణ్ణంగా పరిశీలించారు. నూతన నిర్మాణ శైలితో, తక్కువ సమయంలోనే ఆధునిక సౌకర్యాలతో ఈ స్టేడియాన్ని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాదిలోనే నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

ఈ భారీ క్రీడా సముదాయంలో ఇండోర్ మరియు అవుట్‌డోర్ క్రీడలకు వేర్వేరుగా వసతులు కల్పించనున్నారు. ఇందులో కబడ్డీ, క్రికెట్, స్విమ్మింగ్, హాకీ, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్ వంటి క్రీడలతో పాటు యోగా, జుంబా, మార్షల్ ఆర్ట్స్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు. ఒకేసారి సుమారు 100 మంది క్రీడాకారులు శిక్షణ పొందేలా దీనిని రూపొందిస్తున్నారు. అంతేకాకుండా, వాకర్స్ కోసం ప్రత్యేక ఆకర్షణగా సుమారు 800 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

రాయచోటి యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసి, వారికి తగిన ప్రోత్సాహం అందించడమే లక్ష్యంగా ఈ స్టేడియం నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఇక్కడ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా ఈ స్టేడియం నిర్మాణం ఉంటుందని ఆర్కిటెక్టులు మంత్రికి వివరించారు.

# జనగణనకు ముహూర్తం ఖరారు




- ఇళ్ల జాబితా సేకరణ షెడ్యూల్ విడుదల
- 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రక్రియ ప్రారంభం
- ఈసారి 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' ద్వారా ఆన్‌లైన్‌లోనే వివరాల నమోదు
- అధికారులు రావడానికి 15 రోజుల ముందే వివరాలు ఇచ్చే వెసులుబాటు

**న్యూఢిల్లీ, (సమయం న్యూస్):**

దేశవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 2027 జనాభా లెక్కల సేకరణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. గత పార్లమెంట్ సమావేశాల్లో జనాభా లెక్కల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కేంద్రం, తాజాగా ఇళ్ల జాబితా సేకరణకు సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది.

కేంద్ర హోం శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇళ్ల జాబితా సేకరణ ప్రక్రియ 2026 ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబర్ 30 మధ్య జరగనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఈ ఆరు నెలల కాలపరిమితిలో తమకు అనుకూలమైన ఏదైనా 30 రోజుల పాటు ఈ గణనను నిర్వహించుకునే వెసులుబాటును కేంద్రం కల్పించింది.

'సెల్ఫ్ ఎన్యూమరేషన్'తో సరికొత్త విధానం ఈసారి జనాభా లెక్కల్లో పెను మార్పులు చేశారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునేలా 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' విధానాన్ని ప్రవేశపెట్టారు. సాధారణంగా అధికారులు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించే 30 రోజుల ప్రక్రియ ప్రారంభమవడానికి సరిగ్గా 15 రోజుల ముందే ఈ ఆప్షన్ ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. అంటే అధికారులు రాకముందే ప్రజలు ఆన్‌లైన్ ద్వారా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది.

# ఫ్లెమింగో ఫెస్టివల్‌కు స్వాగతం




**తిరుపతి:** పక్షుల పండుగకు స్వాగతం పలుకుతూ ఈ నెల 10, 11 తేదీల్లో సూళ్లూరుపేటలో నిర్వహించనున్న ఫ్లెమింగో ఫెస్టివల్‌ను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. పులికాట్ సరస్సు తీరంలో జరిగే ఈ వేడుకలు పర్యాటకాభివృద్ధికి దోహదపడేలా ఉంటాయని పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక ఎస్వియూనివర్సిటీ తారకరామ మైదానం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకు నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ అవగాహన ర్యాలీని ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘు వాన్షీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ఆర్డీ రమణ ప్రసాద్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ అధినేత రమేష్ నాద్ లింగుంట్ల, జిల్లా విద్యాశాఖాధికారి కె.వి.ఎన్. కుమార్, సమగ్ర శిక్ష సిఎంఓ సురేష్, ఎంఈఓ బాలాజీతో పాటు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత ఏడాది మూడు రోజులపాటు నిర్వహించిన ఫ్లెమింగో పండుగకు 3 నుంచి 4 లక్షల మంది సందర్శకులు హాజరయ్యారని గుర్తు చేశారు. ఈ ఏడాది అంతకన్నా పెద్ద ఎత్తున పండుగను నిర్వహిస్తూ నేలపట్టు, అటకానితిప్ప, బీవీ పాలెం బోటింగ్, సూళ్లూరుపేటలో వివిధ స్టాల్స్, ఆటల పోటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఫ్లెమింగోతో పాటు పులికాట్ ప్రాంతానికి వచ్చే అనేక వలస పక్షుల జాతులను ప్రజలకు దగ్గర చేసేలా కార్యక్రమాలు రూపొందించామని చెప్పారు. పిల్లలకు ఫ్లెమింగో ఫెస్టివల్ సందర్శనకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, సందర్శకుల కోసం కొన్ని ప్రాంతాలకు ఉచిత రవాణా సదుపాయాలు అందుబాటులో ఉంచుతున్నామని వెల్లడించారు. పక్షి, జంతు ప్రేమికుల కోసం శ్రీసిటీ సహకారంతో రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. సిఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా పరిశ్రమల స్టాల్స్, అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో క్రౌడ్ కంట్రోల్, ట్రాఫిక్ నియంత్రణ చేపడతామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరంతర నిఘా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. బీవీ పాలెంలో బోటింగ్ కోసం కనీస రుసుములు నిర్ణయించి, వచ్చిన మొత్తాన్ని మత్స్యకారుల సంఘాలకు అందజేస్తామని తెలిపారు. ఈ ఫ్లెమింగో ఫెస్టివల్‌కు జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని చెప్పారు. పులికాట్ సరస్సును సందర్శించి పక్షులను వీక్షిస్తూ పర్యాటకాభివృద్ధికి సహకరించాలని ప్రజలకు కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని ఆయన భరోసా ఇచ్చారు.




# నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు

## పనులు వేగవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో సమావేశం

## 2025 సమ్మిట్ ఒప్పందాలు, ఎంఎస్ఎంఈ పార్కులపై కీలక సమీక్ష



**అమరావతి, జనవరి 08 (సమయం న్యూస్):**

రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా రాష్ట్రంలో ఎంఎస్ఎంఈ పార్కుల గ్రౌండింగ్ ప్రగతి, 2025 పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందాలకు సంబంధించిన కంపెనీల గ్రౌండింగ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అలాగే డీఐఈపీసీ (జిల్లా పారిశ్రామిక ఎగుమతి ప్రోత్సాహక కమిటీ) సమావేశాల నిర్వహణపైన, గత కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల అమలుపైనా చర్చించారు. పాజిటివ్ పబ్లిక్ పెర్సెప్షన్, డాక్యుమెంట్ అప్‌లోడ్ ఏజెంట్ స్పేస్ వంటి అంశాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ మాట్లాడుతూ.. జిల్లాల వారీగా ఎంఎస్ఎంఈ పార్కుల ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్, డ్రోన్ కార్పొరేషన్ సీఈఓ సూర్యమన్ పటేల్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ అభిషిక్త్ కిషోర్, వివిధ జిల్లాల కలెక్టర్లు వర్చువల్ విధానంలో హాజరయ్యారు.

# డ్రగ్ మాఫియాపై ఉక్కుపాదం

## 2025లో రూ.1,980 కోట్ల సరుకు సీజ్

## దేశవ్యాప్తంగా 1.33 లక్షల కిలోల మాదకద్రవ్యాల స్వాధీనం

## 447 కేసులు.. 25 మంది విదేశీయులతో సహా 994 మంది అరెస్ట్

## ఎన్‌సీబీ వార్షిక నివేదికలో వెల్లడి



**న్యూఢిల్లీ, జనవరి 08 (సమయం న్యూస్):**

దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ఉక్కుపాదం మోపుతోంది. డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా 2025 సంవత్సరంలో చేపట్టిన ఆపరేషన్లలో ఎన్‌సీబీ భారీ విజయాలు సాధించింది. గతేడాది ఏకంగా 1.33 లక్షల కిలోలకు పైగా మాదకద్రవ్యాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.1,980 కోట్లు ఉంటుందని అధికార వర్గాలు వెల్లడించాయి. కచ్చితమైన గూఢచార సమాచారంతో, దేశంలోని పలు రాష్ట్రాల్లో కీలకమైన రవాణా మార్గాలపై నిఘా ఉంచి ఈ దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో 2025లో ఎన్‌సీబీ మొత్తం 447 కేసులు నమోదు చేసింది. ఈ కేసుల్లో 25 మంది విదేశీయులతో సహా మొత్తం 994 మంది స్మగ్లర్లను అరెస్టు చేశారు. పట్టుబడిన వారిలో దేశీయ నెట్‌వర్క్‌లతో పాటు అంతర్జాతీయ డ్రగ్ మాఫియాతో సంబంధాలు ఉన్నవారు కూడా ఉన్నారని అధికారులు తెలిపారు. యువతను లక్ష్యంగా చేసుకుని విస్తరిస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నట్లు ఎన్‌సీబీ తెలిపింది. అత్యాధునిక నిఘా వ్యవస్థలు, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని వినియోగిస్తూ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, రాబోయే రోజుల్లో అంతర్జాతీయ సహకారంతో చర్యలను మరింత కఠినతరం చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

# పండుగ వేళ మెరుగైన రవాణా సేవలు

## ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి మండిపల్లి సమీక్ష

## సచివాలయంలో రవాణా శాఖ మంత్రిని కలిసిన ఆర్టీసీ ఈడీలు

**అమరావతి, జనవరి 08 (సమయం న్యూస్):**



రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు సచివాలయంలోని తన ఛాంబర్లో ఆర్టీసీ ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహించారు. గురువారం నాడు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) బ్రహ్మానందరెడ్డి, అప్పలరాజు, రవీంద్ర వర్మ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పండుగ సీజన్ దృష్ట్యా రాష్ట్రంలో రవాణా వ్యవస్థ, ఆర్టీసీ కార్యకలాపాలపై మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు సంస్థ ప్రస్తుత పరిస్థితిని, సేవల విస్తరణకు తీసుకుంటున్న చర్యలను మంత్రికి వివరించారు. పండుగ వేళ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ సేవలను మరింత బలోపేతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు భరోసా కలిగించేలా నాణ్యమైన, సురక్షితమైన ప్రయాణ అనుభూతిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.